ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఖమ్మం
epaper.vaartha.com WWW.VAARTHA.COM
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-10-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 245 పేజీలు: 8+16 వెల: 8.00

స్మిత్‌ను పరామర్శించిన ఎమిరేట్స్ యువరాజు
దళిత మహిళా అభ్యర్థిపై స్టాలిన్ వ్యాఖ్యల దుమారం 5


ఆసియా క్రీడల్లో పతకాల పంట

21 స్వర్ణం 27 రజతం 37 కాంస్యం

# భారత్ టాప్-4
## 85 మెడల్స్‌తో ముందంజ
చైనా, జపాన్, కొరియా తర్వాత భారత్ ర్యాంకు



2

ఆసియా క్రీడల్లో భారత్ క్రీడాకారులు తమ సత్తాను చూపించారు. చైనామొదటి స్థానంలో ఉంటే జపాన్ రెండోస్థానం, కొరియా మూడోస్థానంలో ఉండగా భారత్ నాలుగోస్థానంలో నిలిచింది. సంఖ్యపరంగా మొత్తం 85 పతకాలను సాధించింది. వాటిలో పసిడి 21, వెండి 27, కాంస్యం 37 పతకాలున్నాయి. చివరిగా పురుషుల హాకీ టీమ్ 21వ స్వర్ణాన్ని సాధించింది. గడచిన నాలుగు రోజుల్లోనే పసిడి పతకాలతో భారత క్రీడాకారులు ర్యాలీ తీసారు.

## నాలా సమస్యకు 22ఎ
# పరిష్కారం
### అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,అక్టోబరు3,ప్రభాతవార్త:** కొన్ని దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.వ్యవసాయ భూములుగా



ఉన్న పట్టా భూములు, అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ నాలా ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ శనివారం నాడు మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెమో నెంబర్ 48062/యుఎల్‌సి/ఎ1/2026 ద్వారా జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాలా ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉండి, 22ఎ లో ఉన్న నివాస పట్టా భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఆయా దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం నాలా రుసుము, ఇతర ప్రభుత్వ రుసుములను వసూలు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు వెల్లడించారు.ప్రజలు తమ భూముల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టూ >>2


శనివారం హైదరాబాద్‌లో జాతీయ న్యాయ సేవా సంస్థ సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘావాల్, ముఖ్యమంత్రి రేవంత్ తదితరులు

## మహిళలు, పిల్లల
# రక్షణే లక్ష్యం
### సైబర్ నేరాలపై అవగాహన, భద్రత, సంరక్షణ
### భరోసా కేంద్రాల్లో పోలీసు సహాయం
### హైదరాబాద్‌లో తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు
### సైబ-హార్ యాప్ ద్వారా విద్యార్థులు, టీచర్లకు ఆన్‌లైన్ భద్రత
### జాతీయ న్యాయ సేవా సంస్థ సదస్సులో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు3:** పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలకు గురికాకుండా వారికి అవసరమైన భద్రత, సంరక్షణ కోసం న్యాయ సేవల ప్రాధికార సంస్థ (టిజిఎల్ ఎస్ఏ) సూచనలు, కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. డిజిటల్ వేదికలపై పిల్లల రక్షణ కోసం వ్యవస్థలను బలోపేతం చేయడానికి న్యాయసేవల సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు.జాతీయన్యాయ సేవా ప్రాధికార సంస్థ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో "డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం-ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం"అన్న ఇతివృత్తంపై దక్షిణాది ప్రాంతీయ సదస్సు శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సదస్సులో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘావాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్‌నాథ్,, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యాట్రన్ ఇన్‌చీఫ్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, త్రిపుర హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ శ్యామ్ కోషి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు హైకోర్టుల >>2



## దిగ్గజ దర్శకుడు
# సింగీతం ఇకలేరు
### చెన్నైలోని ఆసుపత్రిలో కన్నుమూత
### పంతులమ్మ, మయూరి, భైరవద్వీపం, ఆదిత్య 369 వంటి అనేక విజయవంతమైన చిత్రాలతో ప్రసిద్ధి
### పలు తమిళ, కన్నడ చిత్రాలకు సైతం దర్శకత్వం

**చెన్నై, అక్టోబరు 3:** ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూశారు. సుమారు 94 ఏళ్ళ వయసులో వయోభారంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు సమాచారం. దీంతో తెలుగు సినీ పరిశ్రమ మాత్రమే కాదు యావత్ భారత సినీ జగత్తు తీవ్ర విషాదంలో మునిగిపోయింది. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ, భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తన జీవితంలో ఇటీవలే అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ బ్యానర్‌పై, యువ దర్శకుడు నాగ్ అశ్విన్ సమర్పణలో ఆయన దర్శకత్వం వహించిన సరికొత్త చిత్రం సింగ్ గీతం ప్రేక్షకులతో పాటు సినీ విమర్శకుల ప్రశంసలను అందుకుంది. సినిమా చరిత్రలో తొలి సారిగా సంభాషణలను సైతం సంగీతమయంగా >>2

## విద్య, వైద్యంపై జిల్లాల వారీగా సమీక్ష
### కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి: ముఖ్యమంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు3:** విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా అధికారులు ప్రతివారం సమీక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యంపై సీఎంవో అధికారులతో శనివారం ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నిర్మాణంలోని ప్రధాన ఆస్పత్రులపై సీఎంఆరా తీశారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, >>2


అనంతగిరి ఘాట్‌రోడ్డులో బోల్తాపడిన బస్సు

## అంత్యక్రియలకు వెళ్తూ.. అనంత లోకాలకు..
### అనంతగిరి ఘాట్ రోడ్డులో ట్రావెల్స్ బస్సు బోల్తా
### నలుగురు మహిళలు దుర్మరణం, మరో నలుగురి పరిస్థితి విషమం..

**వికారాబాద్ /ధారూరు, ప్రభాతవార్త:** ఓ వ్యక్తి చావు కబురు విని అంత్యక్రియలకు పయనమైన బంధువులను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు మృతి చెందగా, పలువురికి గాయాలైన సంఘటన శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి బతుకుదెరువు నిమిత్తం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో నివాసం ఉంటున్నాడు.కుటుంబ కలహాల కారణంగా నారాయణరెడ్డి ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు.మృతుని స్వగ్రామం ధారూరుమండలం చింతకుంట గ్రామంకావడంతో అంత్యక్రియలు స్వగ్రామంలో చేసేందుకు కుటుంబసభ్యులు నిర్ణయించారు. నారాయణరెడ్డి మరణ వార్త తెలుసుకున్న, సంగా రెడ్డి జిల్లా పటాన్‌చెరువు ఇస్నాపురంలోని బంధువులు అందరు కలిసి దాదాపు 54 మంది ఓం నమః శివాయ ట్రావెల్స్ బస్సు (ఎపి03 టీసీ 8295)ను కిరాయి కి మాట్లాడుకుని చింతకుంట గ్రామానికి అంత్యక్రియల నిమిత్తం బల్దేరారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో అనంతగిరి ఘాట్ >>2

## అమిత్ షా పర్యటన రద్దు
### చివరి నిమిషంలో మార్పు

**హైదరాబాద్,అక్టోబరు3,ప్రభాతవార్త:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉం



డగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికిగల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా >>2


శనివారం హైదరాబాద్‌లో గౌరవెల్లి ప్రాజెక్టుపై ఉన్నతాధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రి పొన్నం తదితరులు

# వచ్చేసీజన్‌లో గౌరవెల్లి సాగునీరు
### భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యలను త్వరగా పరిష్కరించాలి
### అనుమతులు, కాలువల పనులకు గడువులతో కార్యాచరణ
### నవీకరించిన ప్రాజెక్టు రికార్డులు ట్రిబ్యునల్‌కు సమర్పించాలి
### అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తికి అడ్డుగా ఉన్న పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని లక్ష ఆరువేల ఎకరాలకు వచ్చేసీజన్‌లో సాగు నీరు అందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం గౌరవెల్లి ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ నిర్వహించిన సమీక్షలో రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు నీటిపారుదల, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు, న్యాయపరమైన వ్యవహారాలు చూసే అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉత్తమ్ సూచించారు. పనులవారీగా స్పష్టమైన గడువులు నిర్ణయించి, అర్హులైన వారికి చెల్లించాల్సిన పరిహారాన్ని త్వరగా చెల్లించాలని ఆదేశించారు. ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అడ్డంకులు ఏవైనా ఉంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి జలాశయం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి చేపట్టిన ఇందిరమ్మ వరద కాలువ పథకంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పాలనలో 2008 మేలో 1.4 టిఎంసిల >>2

# ఓటు చోరీ, సీటు చోరీపై రణభేరి
### 6న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, కలెక్టర్ల దిగ్బంధం, 8న లోక్‌భవన్ ముట్టడి
### ఇసికి వ్యతిరేకంగా ఇండియా కూటమి పోరాటం
### జ్ఞానేశ్‌ను అరెస్టు చేయాలి: పిసిసి చీఫ్ మహేష్ గౌడ్


శనివారం గాంధీభవన్‌లో మీడియాతో పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్,అక్టోబరు3,ప్రభాతవార్త:** భారత ప్రజాస్వామ్యంను కుప్పకూల్చే కుట్రలు చేసిన చీఫ్ ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించడమే కాదు వెంటనే అరెస్ట్ చేయాలనీ టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులుమహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఇండియా కూటమి సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహా,రాష్ట్రకార్యవర్గ సభ్యులు పస్య పద్మ,సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ,రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎండి అబ్బాస్,సమాజ్‌వాదిపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి, తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం నర్సయ్య, అశఫ్ బిసి జనసమితి అధ్యక్షుడు జస్వంత్ కుమార్, యువజన సమితి అధ్యక్షుడు సలీంపాషా, ఆర్‌జెడి రాష్ట్ర అధ్యక్షుడు పిశో భయాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మహేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కమీషన్‌కు వ్యతిరేకంగా భారత ప్రజాసామ్యాన్ని కాపాడుకోవడానికి చేయాల్సిన ఉద్యమకార్యాచరణ వివరించారు. >>2

## మిలటరీ ఆయుధాల చోరీ కేసులో మరో ఏడుగురి
# అరెస్టు
### కొత్వాల్ సుమతి వెల్లడి

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారం మిలటరీ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ కేసులో ప్రధాన నిందితుడు ఉప్పుటోళ్ల మల్లేష్‌కు సహకరించిన మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ చోరీ వెనుక ఎలాంటి ఉగ్రకోణం లేదని, దొంగిలించిన ఆయుధాలను వాడి బ్యాంకులు, సంపన్న వర్గాలను దోచుకోవాలని మల్లేష్ పథకం వేసినట్లు మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతి తెలిపారు. దీంతో పాటు తాను చోరీ చేసిన >>2

డ్రాఫ్ట్ జాబితాపై ఆందోళన దేనికి! 3



శనివారం వికారాబాద్ ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## అనంత లోకాలకు..

>> రోడ్డు వద్దకు బస్సు రాగానే, అతివేగం కారణంగా బస్సు ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇస్నాపూర్ గ్రామానికి చెందిన అత్తెల్లి పద్మమ్మ(50), యాదమ్మ(52) బీరంగూడ పద్మమ్మ(55), ప్రమీల(48) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరో 20 మంది కి తీవ్ర గాయాలు కాగా, మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఈ ఘటనకు బాధ్యులైన ట్రావెల్స్ యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని మీడియా ముఖంగా వారు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## సీటు చోరీపై రణభేరి

>> దేశంలో ఓట్‌చోరిని సీట్ చోరిని అడ్డుకొనడానికి ఇండి కూటమి పార్టీలన్నీ కలిసి అక్టోబర్ 6 న జిల్లా కేంద్రాలలో భారీ జనప్రదర్శనతో ర్యాలీ చేసి కలెక్టర్ల నిర్బంధం చేస్తామనీ తెలిపారు. అక్టోబర్ 8 న కూటమి అన్ని పార్టీలు కలిసి లోక్ భవన్ ముట్టడిస్తామనీ చెప్పారు. నవంబర్ 1 న ఛలో ఢిల్లీ కార్యక్రమం ఉంటుందనీ వివరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారంపై తీవ్రంగా ఇండియా కూటమి ఖండిస్తుందనీ ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోనే అర్హత కలిగిన లక్షల మంది పౌరుల ఓట్లు తొలగిస్తున్నారనీ ఆవేదన చెందారు. కేవలం సర్ వల్లే బెంగాల్ లో మమతా బెనర్జీ ఓడిపోయింది ఎన్నికల కమిషన్ సర్ పేరుతో నిజమైన ఓట్లను తొలగిస్తుంది కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపి ఇడి నీ విచ్చల విడిగా వాడుతుందనీ బిజెపి ఎన్నికల కమిషన్ ను లోబర్చుకొని చేయకూడని పనులన్నీ చేస్తుందనీ దుయ్యబట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ సర్ పేరు తో 13కోట్ల ఓట్లను తొలగించారనీ, ఫారం6లో కఠినమైన నిబంధనలతో ఓట్లు చేర్చుకుండా చేస్తున్నారనీ ఆరోపించారు. ఓట్ల తొలగింపుకు లాజికల్ డిస్క్రెపెన్సీ అంటూ ఫిర్యాదు లు చేసి ఓట్లు తొలగిస్తున్నారనీఎన్నికలు తమకు అనుకూలంగా మార్చుకునేలా బిజెపి వ్యవహరిస్తుందనీ విమర్శించారు. తొలగించిన ఓట్లలో అర్హులైన వారిని తిరిగి చేర్చాలనీ కోరారు. ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియలో చీఫ్ జస్టిస్ ను తొలగించి హోం మంత్రి ని చేర్చడానికి ఆయన తప్పుపట్టారు. సిఇసి ని తొలగించడం తో పాటు ఆయనపై చర్యలు తీసుకోవాలనీ అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ఇటి నర్సింహ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యవాదులుఅంతా ఆలోచన చేయాలనీ ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడుకోవాలని కోరారు.

## జిల్లాల వారీగా సమీక్ష

>> ఉస్మానియా ఆస్పత్రుల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను ముందుగానే గుర్తించాలని సీఎం సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలును వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఆయా ఆస్పత్రులు పూర్తయ్యే నాటికి అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను అధికారులు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఆస్పత్రులనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైన చోట ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026 ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడులపై పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దిగ్గజ దర్శకుడు సింగీతం ఇకలేరు

>> మార్చే పూర్తి స్థాయి ఆల్‌మ్యూజికల్ ఫార్మాట్‌లో ఈ ప్రాజెక్ట్‌ను డిజైన్ చేశారు. సాధారణ డైలాగులు కాకుండా, పాత్రల భావోద్వేగాలన్నీ స్వరాల రూపంలోనే సాగడం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో 60కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన సింగీతం శ్రీనివాసరావు, ప్రతి దశాబ్దంలోనూ ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. టాకీ కాలంలో మాటలు లేని నిశ్శబ్ద హాస్య చిత్రం పుష్పక విమానంతో దేశవ్యాప్తంగా సంచలనం. వెండితెరకు కాల ప్రయాణం కాన్సెప్ట్‌ను పరిచ యం చేసిన మార్గదర్శక సైన్స్ ఫిక్షన్ ఆదిత్య 369 కూడా ఆయన సృష్టే. ఆధునిక కంప్యూటర్ గ్రాఫిక్స్ లేని కాలంలోనే లెన్స్ ట్రిక్స్‌తో అపూర్వ సహోదరులుతో మరుగుజ్జు పాత్రను సృష్టించి సాంకేతిక విస్మయం కలిగించిన తీరు ఇప్పటికీ మర్చిపోలేరు. దశాబ్దాల సినీ ప్రయాణంలో నిరంతరం కొత్తదనాన్ని అన్వేషించిన సింగీతం శ్రీనివాసరావు, ఈ వయసులోనూ సరికొత్త ఆలోచనలతో కథలను తెరకె క్కించవచ్చని నేటి తరం దర్శకులకు ఆదర్శంగా నిలిచారని చెప్పవచ్చు.

## అమిత్ షా పర్యటన రద్దు

>> నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాలవల్లే పర్యటనరద్దయి ఉండొచ్చనిపార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధమే

### వాటిని రద్దు చేయండి

**లోక్‌సభ, అసెంబ్లీలకు బ్యాలట్‌తో మళ్లీ ఎన్నికలు జరపండి: మల్లికార్జున ఖర్గే**

**కాలాబురాగి, కర్ణాటక, అక్టోబరు 3:** సర్ ప్రక్రియ కేంద్రంగా దేశంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి. కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్య అభి ప్రాయ భేదాల అంశం, సర్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియపై మాట్లాడిన ఆయన దేశంలో అన్ని ఎన్ని కలు చట్టవిరుద్ధంగానే జరిగాయని ఆరోపించారు. ఈ క్రమం లో లోక్‌సభతో పాటుగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఈవీఎం పద్ధతిలో కాకుండా ఇప్పు డు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. శనివారం రోజు కర్ణాటక కాలాబురగిలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ సహ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా ఈవీఎంల దుర్వినియోగం తీవ్ర స్థాయిలో జరుగుతుందని ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతలే స్వయంగా ఇది చెబుతున్నారని అన్నారు. అధికార బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు వార్డులు, పంచాయతీలు, గ్రామాలకు వెళ్లి ఎక్కువగా పేదలు, గిరిజనులు, దళితులు, మైనార్టీల ఓట్లను కావాలని తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. గతనెల 30న జరిగిన ఇండియా కూటమి సమావేశాన్ని కూడా ఖర్గే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అక్కడ దాదాపు 20 పార్టీల ప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొనగా, సర్ ప్రక్రియ దేశానికి నష్టం కలిగించేలా సాగుతోందని ప్రతి ఒక్కరూ అంగీకరించినట్లు చెప్పారు.

### వారం - వర్జ్యం

**04-10-2026, ఆదివారం,**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె,**
తి.నవమి రా.3.54,
న. పునర్వసు రా.12.15,
వ.మ.12.52 -మ.2.23,
దు.సా.4.14 - సా.5.02,
రాహు. సా .4.30- సా.6.00,
శుభ. స. లేదు.

### వార్తాఫలం

**మేషం :** వృత్తిలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి.

**వృషభం :** సన్నిహితుల నుండి ధనలాభం పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు.వస్త్రలాభాలు.

**మిథునం :**ఉద్యోగ, వివాహ యత్నాలు కలిసి వస్తాయి.వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కర్కాటకం :**దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. భాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

**సింహం :** ప్రయాణాలు లాభిస్తాయి. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. అనుకోని ఆహ్వానాలు.

**కన్య :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. క్రయవిక్రయాలలో స్వల్పలాభాలు. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు.

**తుల :** అప్పు చేయక పోవటమే నిజమైన పొదుపు అని గుర్తిస్తారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

**వృశ్చికం :** బంధువుల నుండి ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. సంఘంలో ఆదరణ లభిస్తుంది. ఆస్థి వ్యవహారాలు కొలిక్కివస్తాయి.

**ధనుస్సు :** ఆకస్మిక ప్రయణాలు లాభిస్తాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.వస్తు సేకరణ.

**మకరం :**కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహా తీసుకుంటారు.

**కుంభం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండండి. పెట్టుబడులకు అనుకూల సమయము. నూతన వస్తు లాభం.

**మీనం :** నూతన పరిచయాలు పెరుగుతాయి. సంఘ సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. ముఖ్య వ్యవహారంలో అనుకూల ఫలితాలు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మహిళలు, పిల్లల రక్షణే లక్ష్యం

>> న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, పలువురు మాజీ న్యాయమూర్తులు పాల్గొన్నారు.
ఈ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మహిళలు, పిల్లల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు వంటి అనేక వ్యవస్థలు పనిచేస్తున్నాయని వివరించారు.
'భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకేచోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నాం. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాం. పిల్లల రక్షణ కోసం పోలీసు శాఖలోని విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో షీ-భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయి. సైబ్ హర్ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం.
విద్యార్థులనే సైబర్ అంబాసిడర్లుగా తయారు చేసి, తమ తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే పిల్లలకు రక్షణ, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించగలం' అని అన్నారు.
'ఆర్థిక సహాయం నుంచి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించడం వరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. టిజిఎస్-ఎల్ఎస్ఏ పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఉపాధ్యాయులు పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చాం' అని తెలిపారు.
సైబర్ నేరాల వలలో పిల్లలు పడకుండా ఇలాంటి కార్యక్రమాల్లో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేయాలని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణ విషయంలో ప్రతి పిల్లవాడు, తల్లిదండ్రులు నియంత్రణ కోసం ప్రత్యేకంగా కేటాయించిన నంబర్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లు తప్పక గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.
'ఈ కార్యక్రమాలకు సహకరిస్తున్న తెలంగాణ హైకోర్టుకు, టిజిఎస్ఎల్ఎస్ఏకు ధన్యవాదాలు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష పడటం కాదు. న్యాయం అంటే బాధితుడి జీవితాన్ని తిరిగి నిలబెట్టడం. గౌరవాన్ని తిరిగి ఇవ్వడం. ముఖ్యంగా పిల్లలు కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయం. న్యాయ సేవల ప్రాధికార సంస్థల కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవల కోసం సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ వాహనాలను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, న్యాయమూర్తుల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంచార లోక్ అదాలత్ ఉచిత న్యాయ సేవలు అందించనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నరసింహ మాట్లాడుతూ వినూత్నంగా ఆలోచించాలి. తల్లిదండ్రుల సమయం, ఉపాధ్యాయుల సమయం, విధాన నిర్ణేతల సమయం పిల్లలకు దక్కేలా హామీ ఇచ్చేందుకు మన చట్టాలను తీర్చిదిద్దుకోవాలని చెప్పారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి సహకారం లేకుండా ఏ చిన్నారి కూడా దేశానికి సేవ చేసే ఉత్తమ పౌరుడిగా ఎదుగుతాడని ఊహించలేం. మన పాఠశాల ఉపాధ్యాయులకు, ప్రత్యేకించి స్థానిక భాషా ఉపాధ్యాయులకు మనం ఇచ్చే గౌరవం, మర్యాదలు నామమాత్రంగానే ఉంటున్నాయని పేర్కొన్నారు. ఆ దృక్పథం మారాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనే ఈ ఇద్దరు కీలక భాగస్వాములకు తగిన సమయం, భద్రత కల్పించాలి; అప్పుడే వారు పిల్లలు ఉన్నతంగా ఎదిగేలా చూసుకోగలరు. మన దేశంలో జననాల రేటు (ఫెర్టిలిటీ రేటు) గణనీయంగా పడిపోతోందన్నారు. భవిష్యత్తులో పరిస్థితులు నేటిలా ఉండబోవు. సౌకర్యవంతమైన భర్తీ నిష్పత్తి అయిన 2.1 నుండి మనం ఇప్పుడు 1.97కి పడిపోయాము. అంటే మరో రెండు తరాల తర్వాత జపాన్ మరియు ఇతర దేశాల మాదిరిగానే మన సమాజం కూడా వృద్ధుల సమాజంగా మారిపోతుంది. కాబట్టి మనం దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి, ఈ ఆస్తిని బలోపేతం చేయాలి, ఎలాంటి సంకోచం లేకుండా ఈ ఆస్తిని నిర్మించాలి; పిల్లలకు అన్ని కోణాల్లోనూ భద్రత కల్పించేందుకు సాంకేతికతను, చట్టాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు.

## ఆయుధాల చోరీ కేసులో మరో ఏడుగురి అరెస్టు

>> ఆయుధాలలో కొన్నింటిని బెంగాల్‌కు చెందిన అక్రమ ఆయుధ వ్యాపారికి అమ్మేందుకు మల్లేష్ ప్రయత్నించినట్లు శనివారం నాడు మల్కాజిగిరి డిసిపి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో తెలిపారు. బొల్లారంలోని మిలటరీ ప్రాంతంలో గల మద్రాస్ రిజిమెంట్ సెంటర్‌లో గత ఆగస్టు 30వ తేదీన భారీగా తుపాకులు, తూటాలు చోరీ అయి న ఘటనలో మొత్తం మిస్టరీ వీడింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య వుండే మిలటరీ ఆయుధాల చోరీ రక్షణ రంగాన్ని షాక్‌కు గురిచేయ డం తెలిసిందే. దీనిపై విచారణ చేబట్టిన బొల్లారం పోలీసులు ఈ చోరీ వెనుక ఇదే రిజిమెంట్‌లో గతంలో పనిచేసి క్రమశిక్షణారాహిత్యం కింద బలవంతంగా పదవీ విరమణ పొందిన మల్లేష్ వున్నట్లు తేల్చి, అతని వద్ద నుంచి చోరీ అయిన తుపాకులు, తూటాలను జప్తు చేశారు. అయితే దీని వెనుక వున్న అసలు కథను వెలికి తీసేందుకు మల్లేష్‌ను పది రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించగా సంచలన విషయాలు వెలు గు చూశాయి. మొదటి నుంచి వ్యసనాలకు అలవాటుపడ్డ మల్లేష్ పదవీ విరమణ తరువాత వచ్చిన నగదుతో సొంతంగా ప్లాటు కొని ఇంటిని నిర్మించి వున్న డబ్బంతా ఖర్చు చేశాడు. దీంతో చేతిలో డబ్బులు లేకపోవడంతో ఏం చేయాలో తెలియక గతంలో తాను పనిచేసిన చోట వున్న ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని చోరీ చేసి, వాటిలో కొన్నింటిని గతంలో తాను బెంగాల్‌లో పనిచేసిన సమయంలో పరిచయమైన అ క్రమ ఆయుధ వ్యాపారి అవిదేవ్ అలియాస్ ఓబి (32)కు విక్రయించి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించాడు. మిగతా వాటితో తనకు పరిచయం వున్న సైనికులతో కలిసి బ్యాంకులను లూటీ చేయడం సంపన్నులను బెదిరించి దోపిడీలు చేసి ధనవంతుడిని కావాలని మల్లేష్ భావించాడు. త న పథకంలో భాగంగా గతంతో తనతో పాటు కలిసి పనిచేసి ప్రస్తుతం బొల్లారంలో ఆయుధగారం ఇంఛార్జిలుగా వున్న ఎపిలోని మార్కాపురం నివాసులు కొండూరి శేషులు (36). వినోద్ కుమార్ (34), మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌కు చెందిన ప్రవీణ్ (37)లతో సంప్రదించగా అం దుకు వారు కూడా అంగీకరించారు. ఇలా మల్లేష్ ఈ ముగ్గురి సహాయంతో బొల్లారంలోని మిలటరీ ఆయుధగారం నుంచి గత నెల 30వ తేదీ అర్థరాత్రి సమయంలో ఎకె 47, ఇన్సాస్ తుపాకలతో పాటు పిస్టోళ్లు వేల సంఖ్యలో బుల్లెట్లు దొంగిలించారు. ఆయుధాలు, మందు గుండు సామాగ్రి దొంగిలించిన తరువాత ప్రవీణ్‌కు మల్లేష్ లక్ష రూపాయలు ఇచ్చాడు. దీని తరువాత చోరీ గురించి బెంగాల్‌లోని ఓబికి సమాచారం ఇచా ్చడు. అతని మిత్రుడు బెంగాల్‌కే చెందిన బీర్బల్ షాకు కూడా చెప్పాడు. పిస్టోల్‌కు మూడు లక్షల రూపాయలు, ఇతర తుపాకులకు ఐదు లక్షల రూపాయలు ఇస్తానని ఓబి, మల్లేష్‌కు హామీ ఇచ్చాడు. 2025లో మల్లేష్ ఓబి నుంచి పది వేల రూపాయలకు ఒక తపంచా కొని తన ఇంట్లో భద్రంగా వుంచాడు. ఈ తపంచాను అతని వద్ద నుంచి జప్తు చేశారు. మిలటరీలో వున్న సమయంలోనే నాగర్‌కర్నూలు జిల్లాలో ఇతను రెండు చోట్ల దొంగతనాలకు పాల్పడి వాంటెడ్‌గా వున్నాడు. కాగా ఆయుధాలు, మందు గుండు చోరీ తరువాత వాటిని రహస్యంగా దాచే విషయంలో మల్లేష్‌కు అతని సోదరుడు మల్లిఖార్జున్ (39)తో పాటు నాగర్‌కర్నూలుకు చెందిన నిరంజన్ (39)లు సహాయం చేశారు. ఆయుధాల చోరీ విష యం మరుగున పడిన తరువాత వీటి సహాయంతో దోపిడీలు చేయాలని మల్లేష్ ముఠా నిర్ణయించింది. మిలటరీ ఆయుధాలు, మందు గుండు సామాగ్రి చోరీ ఘటనపై రక్షణ శాఖ తీవ్రంగా స్పందించి మొత్తం గుట్టును వెలికి తీయాలని పోలీసులను కోరడంతో బొల్లారం పోలీసులు భిన్న కోణాల్లో విచారించి ఈ గోల్‌మాల్‌ను రట్టు చేసి మొదట మల్లేష్‌ను ఆ తరువాత అతనికి సహకరించిన మిగతా ఏడుగురి అరెస్టు చేశారు. కాగా ఈ చోరీ వెనుక ఎలాంటి ఉగ్ర కుట్ర లేదని కమిషనర్ సుమతి తెలిపారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ తదితరులు పాల్గొన్నా రు.




మిలటరీ ఆయుధాలు చోరీ కేసులో ఏడుగురు నిందితుల వివరాలను వెల్లడిస్తున్న మల్కాజిగిరి కొత్వాల్ సుమతి

## వచ్చేసీజన్‌లో గౌరవెల్లి సాగునీరు

>> సామర్థ్యంతో నిర్మాణానికి తొలి ఒప్పందం కుదరగా దీని సామర్థ్యం గత ప్రభుత్వం 8.230 టిఎంసిలకు పెంచడంతో అవసరమైన అనుమతులు, క్లియరెన్సులు లేకపోవడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదనీ వివరించారు.ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.1,343.59 కోట్లు ఖర్చు చేశామనీ ఇందులో ధరల పెరుగుదలతో సహ నిర్మాణ పనులకు రూ.886.76 కోట్లు, భూసేకరణ, పునరావాసానికి రూ.456.83 కోట్లు వెచ్చించామనీ తెలిపారు. ప్రాజెక్టును పూర్తి చేయడానికి మరో రూ.114.389 కోట్లు అవసరమని సమీక్షలో వెల్లడించారు. పెండింగ్ భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు.జలాశయానికి సంబంధించిన రూ.1,457.979 కోట్ల సవరించిన అంచనాను తదుపరి మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించాలని ఉత్తమ్ సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షలో కలుగచేసుకొని గత ప్రభుత్వ హయాంలో ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండానే జలాశయ విస్తరణ చేపట్టడంతో ఈ అంశం జాతీయ హరిత ట్రైబ్యునల్‌కు చేరిందనీ, ప్రాజెక్టుకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలు, పర్యావరణ అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని వివరించారు. సీనియర్ న్యాయవాదుల సేవలను కూడా వినియోగించుకుంటున్నట్లు చెప్పారు.పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక, పర్యావరణ నిర్వహణ ప్రణాళిక, ప్రజాభిప్రాయ సేకరణ నివేదికలు, మూడు సీజన్లకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని పరివేశ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్లు అధికారులు వివరించారు. అక్టోబర్ 8న జరగనున్న పర్యావరణ అనుమతి ప్రతిపాదన పరిశీలన సమావేశానికి అవసరమైన పత్రాలన్నీ సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. సంబంధిత పర్యావరణ అధికారుల పరిశీలన, వారి ఆదేశాలకు అనుగుణంగా అనుమతుల ప్రక్రియ కొనసాగాల్సి ఉంది.అక్టోబర్ 16న ఎన్‌జీటీలో జరగనున్న విచారణకు ముందే తాజా న్యాయపరమైన పరిణామాలు, నవీకరించిన ప్రాజెక్టు రికార్డులను ట్రైబ్యునల్ ముందుంచాలని ఉత్తమ్ సూచించారు. ఇందుకోసం అడ్వకేట్ జనరల్, ప్రాజెక్టు తరఫు న్యాయవాదులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.జలాశయానికి అవసరమైన 3,870 ఎకరాల్లో ఇప్పటికే 3,850 ఎకరాలు సేకరించినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన 20 ఎకరాలకు సంబంధించిన పరిహారాన్ని హైదరాబాద్‌లోని భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపన అథారిటీ వద్ద జమ చేసినట్లు పేర్కొన్నారు. కాలువల కోసం చేపట్టాల్సిన భూసేకరణకు జిల్లాలవారీగా గడువులు నిర్ణయించాలని సూచించారు.నిర్వాసిత కుటుంబాల నుంచి అందిన పెండింగ్ వినతులను పరిశీలించి, సంబంధిత రికార్డులు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హత ఉన్న పునరావాస ప్రయోజనాలను త్వరగా అందించాలని మంత్రి ఆదేశించారు. పరిహారం, పునరావాస సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పంపిణీ కాలువల పనులకు అవసరమైన అంచనాలు, భూసేకరణ, టెండర్ల ప్రక్రియకు ఆచరణ సాధ్యమైన గడువులు నిర్ణయించాలని ఉత్తమ్ సూచించారు. వచ్చే సాగు సీజన్‌కు నీటిని అందించేలా కాలువల వ్యవస్థను సిద్ధం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. మిగిలిన ప్రధాన కాలువలు, పంపిణీ కాలువలు, అనుబంధ పనులకు సంబంధించిన రూ.88.89 కోట్ల సవరించిన అంచనాపై తదుపరి చర్యల కోసం చర్చించారు.సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్ బాబు, ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) మధుసూదన్ రావు, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్, భూసేకరణ,పునరావాసం, పునఃస్థాపన కమిషనర్ శివకుమార్ నాయుడు, సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి తదితర నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారత్ టాప్-4

**ఆసియా క్రీడల్లో ఇండియా పతకాల పంట**

### 85 మెడల్స్‌తో ముందంజ

### చైనా, జపాన్, కొరియా తర్వాత భారత్ ర్యాంకు

**ఐయిచినగోయా(జపాన్), అక్టోబరు 3:** ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు తమ సత్తాను చూపించారు. అన్ని విభాగాల్లో ఇతర దేశాలకు గట్టిపోటీ ఇస్తూ పతకాల పట్టికలో నాలుగోస్థానానికి భారత్‌ను చేర్చారు. ఇప్పటివరకూ చైనామొదటి స్థానంలో ఉంటే జపాన్‌రెండోస్థానం, కొరియా మూడోస్థానంలో ఉండగా భారత్ నాలుగోస్థానంలో నిలిచింది. పతకాల సంఖ్యాపరంగా మొత్తం 85 పతకాలను సాధించింది. వాటిలో పసిడి 21, వెండి 27, రజతం 37 పతకాలున్నాయి. చివరిగా భారత పురుషుల హాకీ టీమ్ 21వ స్వర్ణాన్ని సాధించింది. గడచిన నాలుగు రోజుల్లోనే పసిడి పతకాలతో భారత క్రీడాకారులు ర్యాలీ తీసారు. రెజ్లింగ్, హాకీ జట్లు రెండేసి పసిడిపతకాలు గెలిచాయి. ఇక భారత క్రికెట్‌టీమ్ మరో పతకం సాధించింది. ఈ ఏడాదిజరిగిన ఆసియా క్రీడోత్సవాల్లో భారత్ తన పతకాలసంఖ్యాపరంగా నాలుగోస్థానానికి చేరడంతో భారత్ క్రీడాభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. అయితేపతకాల పరంగా 2022 హాంగ్జౌ ఆసియా క్రీడలపతకాలతో పోలిస్తే తక్కువే అప్పట్లో 28 పసిడి, 38 వెండి, 40 రజతపతకాలను భారత్‌సాధించింది. 2022లో కూడా భారత్ నాలుగోస్థానంలోనే నిలిచింది. ఈసారి కూడా నాలుగోస్థానంలోనే నిలిచింది. ఆసియా క్రీడల చివరిరోజు నాలుగోస్థానంలో ఉన్న ఉజ్బెకిస్తాన్ పసిడిని సాధించలేకపోవడంతోఐదోస్థానానికే పరిమితం అయింది. ఇక చైనాపరంగా మొదటిస్థానంలో ఉంది. 169 పసిడి, 89 వెండి, 83 రజతపతకాలతో మొత్తం 341 పతకాలను సాధించింది. ఇక జపాన్‌పరంగా కూడా 83 పసిడి, 95 వెండి, 91 రజతపతకాలుసాధించి 269 మెడల్స్ రాబట్టింది. ఇక రిపబ్లిక్ ఆఫ్ కొరియాకూడా 39 పసిడి, 43 వెండి, 68 రజతం మెడల్స్‌తో 150 పతకాలు సాధిస్తే భారత్ మొత్తం 85 పతకాలతో నాలుగోస్థానంలోనిలిచింది. ఇక ఐదో ర్యాంకులో నిలిచిన ఉజ్బెకిస్తాన్ 21 పసిడి, 25 వెండి, 24 రజతపతకాలతో మొత్తం 70 మెడల్స్‌సాధించి ఐదోస్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. మొత్తం 41 దేశాలు పాల్గొంటే వీటిలో ఐదు దేశాలు ఒక్కపతకం కూడా సాధించలేకపోయాయి. భూటాన్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ తైమూర్ లెస్తే, మాల్దీవులు, పాలస్తీనా, యెమెన్ దేశాలు ఒక్క పతకం కూడా సాధించలేకపోయాయి, అత్యంత తక్కువ పతకాలు సాధించిన దేశాల్లో బంగారలదేశ్ రెండు, బ్రూనై దారుస్సలం రెండు, లావోపిపుల్స్ డెమొక్రటిక్ రిపబ్లిక్ రెండు, సిరియన్ అరబ్ రిపబ్లిక్ రెండుపతకాలతో సరిపెట్టుకున్నాయి. ఇంకా మైన్మార్‌ఐదు, మకావో చైనా ఆరు, కిర్గిజ్‌స్థాన్ 14, మంగోలియా 15, శ్రీలంక కేవలం మూడు, పాకిస్థాన్ 3, ఇరాక్ 10, తుర్క్మెనిస్తాన్ రెండు, ఆఫ్ఘనిస్తాన్ మూడు, ఓమన్ రెండు, కాంబోడియా నాలుగు, నేపాల్ రెండు,బంగ్లాదేశ్ ఒకటి చొప్పున గెలుచుకోవడం గమనార్హం.

## 22ఎ పరిష్కారం

>> తిరగకుండా పారదర్శకంగా, కాలపరిమితిలో ప్రక్రియ పూర్తి చేయాలని అర్హత ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, ప్రభుత్వానికి అమలు పురోగతిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు.ఏళ్ల తరబడి తమ సొంత ప్లాట్లను విక్రయించుకోలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిర్ణయం వల్ల ఉపశమనం లభిస్తుందని మంత్రి గారు స్పష్టం చేశారు. శనివారం నాడు రెవెన్యూ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 22ఎ సమస్యల పరిష్కారం కోసం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యే విధంగా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాకోణంలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని అమలు చేయాల్సిన కనీస బాధ్యత అధికారులపై ఉందని ఆ బాధ్యతను అధికారులు సరైన విధంగా నిర్వర్తిస్తే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అన్నారు. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అధికారులు చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా అమలు చేయాలని ఆదేశించారు. గత నెల 16వ తేదీన శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 22ఎ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలకు అనుగుణంగా సహచర మంత్రులతో చర్చించి 2ఎ తో ముడిపడి ఉన్న 10 నుంచి 12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. శాసనసభ లో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22ఎ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు.

## హుజూర్‌నగర్‌లోనే పోటీ చేస్తా: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదారబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** నియోజకవర్గ పునర్విభజనలో తుంగతుర్తి నియోజకవర్గం జనరల్ అభ్యర్థులు పోటి చేసేందుకు అనుకూలంగా ఉన్నా నేను అక్కడ నుంచి బరిలో ఉండనని తెలంగాణ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం విలేఖరులతో చిట్‌చాట్ చేస్తూ డీ లిమిటెషన్ జరిగితే తుంగతుర్తిలో పోటీ చేస్తారనే ప్రచా రాన్ని నిర్ధ్వంద్వంగా త్రోసిపుచ్చారు. హుజూర్‌నగర్ నుంచే రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానని ఖరాఖండిగా ప్రకటించారు. సామాజిక మాధ్య మాల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన జరిగినా వచ్చే రెండేళ్ల కాలపరిమితిలో అదిసాధ్యం కాదని అన్నారు. తుంగతుర్తిలోని తాను పుట్టిన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూడు బ్యారేజీల్లో మొత్తం డిజైన్ సమస్య అయితే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని అలాకాకుండా నిర్మాణ సంస్థల పరిధిలో ఏదైనా సమస్యలు ఉంటే వాళ్లే నిధులు ఖర్చు చేస్తారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## మహిళా సాధికారతతోనే వికసిత్ భారత్

### 'దిశా' సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 3, ప్రభాతవార్త :** అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో ముందుంచాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా దిశా కమిటీ ఛైర్‌పర్సన్ జి.కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తార్నకలోని సీఎస్ఐఆర్-ఐఐసీటీ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన దిశా కమిటీ సమావేశం జరిగింది. నగర అభివృద్ధి, మౌలిక వసతులు, ప్రజా సమస్యలు, కేంద్ర పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, తాగునీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.రహదారులు, రైల్వే పనులపై సమీబల్కంపేట ఎల్లమ్మ దేవాలయం-ఫతేనగర్ రైల్వే వంతెన ఇరుకుగా, శిథిలావస్థకు చేరినందున విస్తరణ లేదా పునర్నిర్మాణం కోసం ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. సనత్‌నగర్ యార్డు సమీప ఆర్‌యూబీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాణిగంజ్ బాంబే హోటల్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రైల్వే, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులతో సంయుక్త పరిశీలన నిర్వహించనున్నట్లు చెప్పారు.

లాలాగూడ, ఇందిరానగర్ ప్రాంతాల్లో ప్యాసేజ్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు రైల్వే అనుమతులు ఇవ్వాలని కోరారు.ఇళ్లు, పారిశుధ్యంపై దృష్టిహైదరాబాద్‌లోని అన్ని నియోజకవర్గాల్లో పేదల ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున స్థలాలు కేటాయించినట్లు వివరించారు. ప్రభుత్వ స్థలాలు, పార్కుల ఆక్రమణలపై తక్షణ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై భారం తగ్గించేందుకు నగరానికి నలువైపులా ఆధునిక వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. బోలక్‌పూర్‌లోని కాలుష్యకారక పరిశ్రమలు, స్క్రాప్ వ్యాపారాలను ఔటర్ పరిధికి తరలించాలని ఆదేశించారు. ఈవ్యర్థాల రీసైక్లింగ్‌ను విస్తృతం చేయాలని, 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు.

మహిళలకు ఉపాధి అవకాశాలుస్వయం సహాయక సంఘాల సభ్యుల సంఖ్యను 20 లక్షలకు పెంచాలని, సంఘాలకు రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు. పీఎం స్వనిధి, ముద్రా రుణాల లబ్ధిదారులతో ప్రత్యేక ఫీడ్‌బ్యాక్ సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు.గోదావరి, కృష్ణా జలాల సరఫరా, విద్యుత్ బకాయిలు, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగుల సహాయకుల కోసం షెల్టర్ హోమ్స్, చింతలబస్తీ తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న విద్యా, వైద్య భవనాల వినియోగంపైనా సమీక్షించారు. సమావేశంలో డీసీపీ డాక్టర్ లావణ్య, డీఆర్వో డాక్టర్ నారాయణ, సీపీవో డాక్టర్ సురేందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రాఫ్ట్ జాబితాపై ఆందోళన దేనికి!

### ఓటు హక్కు కాపాడుకునేందుకు అనేక దశలు
### వైరల్ వాదనల వల్ల అయోమయం
### ఓటరు గణన ప్రక్రియపై అవగాహన అవసరం

**ప్రభాతవార్త / న్యూస్‌నెట్‌వర్క్:** ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు గుర్తింపు సవరణ ప్రక్రియ జరుగుతోంది. 1950 నుంచి పరిశీలిస్తే ఇప్పటి వరకు 8 సార్లు ఓటర్ల ప్రత్యేక సవరణ జరిగింది. అయితే చివరి సారిగా 2002లో జరిగింది. ఆ తరువాత సుమారు 24 సంవత్సరాల తరువాత ప్రస్తుతం దశలవారీగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా ఉండేదుకు అనేక దశల్లో విచారణ నిర్వహిస్తారు. ముందుగా ఒక దశ తరువాత డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఇందులో పేరు లేకపోయినా, ఏదైనా నోటీసుల వచ్చినా ఓటు హక్కు కోల్పోతామన్న భయం అవసరం లేదు. సరిదిద్దుకోవడానికి ఇంకా అనేకదశలు ఉంటాయి. చివరకు తుదిజాబితాలో పేరు లేకపోయినా ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సెక్షన్ 24 కింద అప్పీల్ అందుబాటులో ఉంటుంది. ఒకసారి ఓటర్లు జాబితా సవరణ ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో తెలుసుకుందాం.

ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) స్పష్టమైన క్రమంలో సాగుతుంది. ఇది గణనతో మొదలవుతుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్తారు. ఎవరు ఎక్కడ నివసిస్తున్నారో తనిఖీ చేస్తారు, మరణాలను నమోదు చేస్తారు, మార్పులను రికార్డు చేస్తారు, తర్వాత వ్యత్యాసాలుగా కనిపించే సమాచారాన్ని సేకరిస్తారు. ఈ క్షేత్రస్థాయి పని కేవలం లాంఛనప్రాయం కాదు. ప్రస్తుత జాబితా ఇంకా క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవికతతో సరిపోతుందో లేదో పరీక్షించడం జరుగుతుంది.

గణన తర్వాత డ్రాఫ్ట్ జాబితా వస్తుంది. చనిపోయినట్లు, శాశ్వతంగా మారినట్లు, హాజరుకాని లేదా జాడలేని, లేదా బహుళంగా నమోదైనట్లు కనిపించే ఎంట్రీలు ఈ దశలో గుర్తిస్తాయి. దీనిని బట్టి డ్రాఫ్ట్ ప్రచురించబడుతుంది, రాజకీయ పార్టీలు తమ ఏజెంట్ల ద్వారా పూర్తి వివరాలు సేకరించేందుకు అవకాశం ఉంది. దావాలు, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చు. అవసరమైన చోట్ల నోటీసులు వెళ్తాయి. ప్రత్యేక పరిస్థితుల్లో విచారణలు జరుగుతాయి. ఈ దశల తర్వాతే తుది జాబితా రూపు దాల్చుతుంది. అప్పటికీ కూడా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నిర్ణయానికి వ్యతిరేకంగా సెక్షన్ 24 కింద అప్పీల్ అందుబాటులో ఉంటుంది.

ఆ క్రమం ముఖ్యం ఎందుకంటే ప్రతి దశ మునుపటి దశలో తప్పు జరిగి ఉండవచ్చు వాటిని పట్టుకుని సరిదిద్దడానికి అవకాశం ఉంటుంది. డ్రాఫ్ట్ ఎంట్రీ మధ్యలో ఉంటుంది, చివరలో కాదు. దాన్ని తుది తొలగింపుగా పరిగణించడం తర్వాత జరగాల్సిన ప్రతిదాన్ని విస్మరించడమే.

క్షేత్ర ధృవీకరణ అంతటా కొనసాగుతుంది. వ్యత్యాసానికి మరొక చూపు అవసరమైతే, బిఎస్ఓలు మళ్లీ ఇంటికి వెళ్లి, పత్రాలతో మరోసారి పరీక్షిస్తారు. కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ విచారణలు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవసరాన్ని తగ్గిస్తాయి. నిబంధనలు అనుమతించినప్పుడు కుటుంబ సభ్యులు ఓటర్ల తరఫున ప్రాతినిధ్యం వహించవచ్చు. కార్మికులు, రాత్రి షెల్టర్లలో ఉన్నవారు, నిరాశ్రయులు వంటి అధికారిక దశలు కష్టంగా అనిపించే వ్యక్తుల కోసం సహాయ కేంద్రాలు మరియు శిబిరాలు ఏర్పాటు చేయబడతాయి. ఈ ఏర్పాట్లు ప్రతి అన్ని సమస్యలకు పరిష్కారం కాకపోయినా ప్రక్రియను అందుబాటులో ఉంచే ప్రయత్నాన్ని చేస్తాయి.




కొత్త నమోదు పూర్తి పారదర్శకంగా సాగుతుంది. 18 ఏళ్లు నిండినవారు లేదా నమోదు చేసుకుని వారు ఎవరైనా జాబితాలో చేరాలంటే ఫారం 6 ద్వారా నమోదు చేసుకోవచ్చు. కొత్త ఓట్ల నమోదుకు ప్రతి సంవత్సరం నాలుగు అర్హత తేదీలు ఉన్నాయి జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో కొత్త ఓటర్లుగా చేరడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ఒక వ్యక్తి ఓటరు నమోదు కోసం పన్నెండు నెలలు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. తద్వారా దరఖాస్తుదారులు ప్రత్యేక ప్రక్రియ ప్రారంభించకుండా అవసరమైన సమాచారాన్ని ఒకేసారి అందించవచ్చు.

పేరు గుర్తు పెట్టబడిన లేదా లేని సాధారణ ఓటరు కోసం, ఆచరణాత్మక విషయం ఏమిటంటే డ్రాఫ్ట్ దశ చివరి మాట కాదు. రికార్డును సరిదిద్దడానికి లేదా నమోదు చేసుకోవడానికి ఇంకా మార్గాలు ఉన్నాయి. ప్రక్రియ మధ్య నుండి తీసిన ఒక పెద్ద సంఖ్యకు ప్రతిస్పందించడం కంటే ఆ మార్గాలను తెలుసుకోవడం మరింత ఉపయోగకరం. ఎన్నికల జాబితాలు ఒకేసారి రెండు పనులు చేస్తుంది... ప్రతి అర్హత ఉన్న వ్యక్తిని చేర్చాడం. ప్రజలు చనిపోయినా, మారినా లేదా ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదు చేసుకున్నా ఖచ్చితంగా గుర్తిసుంది. బహుళదశల పునర్విమర్శ ఈ రెండు పనులను కలిపి ఉంచే ప్రయత్నం జరుగుతుంది. అయితే అత్యధిక జనాభా కలిగిన మన దేశంలో ఈ సమయంలో కొన్ని తప్పులు జరగడం సర్వసాధారణం. ఇలాంటి వాటిని గుర్తించి సరిదిద్దడానికి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. వైరల్ అవుతున్న వివాదాలను పక్కన పెట్టి ఓటర్ల సవరణ ప్రక్రియకు సహకరిస్తే అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోరన్నది వాస్తవం.

## సర్కార్ దవఖానాకు వెళ్తే ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేదు

### రాష్ట్రంలో అధ్వానంగా ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితి
### 'ఆపరేషన్ బ్లూ కోడ్' పేరుతో టిఆర్ఎస్ హాస్పిటళ్ల సందర్శన
### తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, అక్టోబరు 3,ప్రభాతవార్త:** రేవంత్ రెడ్డి రాక్షస పాలనలో రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌లోని ఎస్ఎన్‌సీయూలో సీలింగ్ కూలిన ఘటనపై 'ఎక్స్' వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటన మరవక ముందే భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సీలింగ్ కూలిందని.. ప్రజల ప్రాణాల పట్ల ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ ఘటనతో అర్థం చేసుకోవచ్చన్నారు. సీలింగ్ కూలిన సమయంలో వార్డులో అదృష్టవశాత్తూ పిల్లలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. లేదంటే ఈ ప్రభుత్వం పట్టిలేనితనానికి మరికొంత మంది పసికందులు బలయ్యేవారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో సర్కార్ దవాఖానాకు వెళ్తే ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. 'మాట్లాడితే ప్రజా పాలనంటూ గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి.. ఇదేనా మీ ప్రజా పాలన? మీ చేతగానీతనం కారణం గానే సర్కార్ దవాఖానాలు ఇంత అధ్వాన్నంగా తయారయ్యాయి' అని ధ్వజమెత్తారు. హాస్పిటల్స్‌లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, రోగులకు కనీస సౌకర్యాలు, మందులు లేని పరిస్థితి ఉందన్నారు.

బెడ్లు లేక వీల్ చైర్ లో చికిత్స చేసే దౌర్భాగ్య స్థితికి తీసుకొచ్చారని మండి పడ్డారు. చేతగానీ కాంగ్రెస్ పాలన కారణంగా ప్రభుత్వ హాస్పిటల్స్ ఎంత దయనీయంగా ఉన్నాయో త్వరలోనే బయటపెడతామని చెప్పారు. ఆపరేషన్ బ్లూ కోడ్ పేరుతో తెలంగాణ రక్షణ సేన నాయకులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శిస్తారని..ప్రభుత్వ వైఫల్యం కారణంగా అక్కడ ఎలాంటి దయనీయ పరిస్థితులు ఉన్నాయో ప్రజల ముందుంచుతామని చెప్పారు.

## భారత్‌కు యేటా 40 కొత్త యుద్ధ విమానాలు అవసరం

### ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఫైటర్ జెట్ స్క్వాడ్రన్ల సంఖ్య మరింత తగ్గకుడా ఉండాలంటే ప్రతీ ఏడాది భారత్‌కు 36 నుంచి 40 కొత్త యుద్ధ విమానాలు అవసమరని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. ఇది సుమారు రెండు ఫైటర్ స్క్వాడ్రన్లకు సమానమని చెప్పారు. ప్రస్తుతం ఈ లోటును పూడ్చుకుంటూనే కొత్తగా మరిన్ని యుద్ధవిమానాలను చేర్చాల్సి ఉంటుందని చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ డేకు ముందు నిర్వహించిన వార్షిక మీడియా సమావేశంలో ఏపీ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రక్షణ రంగంలోని ప్రాజెక్టుల్లో జాప్యం వైమానికదళ కార్యాచరణ సామర్థ్యంపై పడుతోందని ఆయన అన్నారు. టెక్నికల్ డిలే అంటే టెక్నాలజీని తిరస్కరించడమే అని అన్నారు. అభివృద్ధి, ఉత్పత్తి ప్రక్రియలు ఎక్కువ కాలం కొనసాగితే, అప్పటికే ప్రత్యర్థులు ఆ టెక్నాలజీని అధిగమించే అవకాశం ఉందని అన్నారు. ఫైటర్ జెట్ స్క్వాడ్ల కొరతను అధిగమించేందుకు తేజస్ ఎంకె1ఎ, తేజస్‌ఎంకె2, 114 విమానాల ఎంఆర్‌ఎఫ్ఎ ప్రాజెక్ట్, ఎఎంసిఎ వంటి కార్యక్రమాలు అవసరమని అన్నారు. ఎఎంసిఎ లేదా ఇతర ప్రాజెక్టుల్లో జాప్యం ఏర్పడితే ప్రత్యామ్నాయ యుద్ధ విమానాల వైపు చూడాల్సి వస్తోందని ఆయన అన్నారు. రష్యా తయారీ 5వ జనరేషన్ ఎస్‌యూ57పై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. 114 రాఫెల్ జెట్ల కొనుగోలు ఒప్పందం ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఖరారయ్యే అవకాశం ఉదని అన్నారు. ధర, ఇతర కీలక అంశాలపై చర్చలు కొనసాగుతున్నట్లు చెప్పారు. పాకిస్తాన్‌చైనా 5వ తరం యుద్ధ విమానాల విషయంలో సహకారం భారత్‌కు ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ఇదే సమయంలో ఆయా విమానాలను పాకిస్తాన్ తన యుద్ధవ్యవస్థలతో పూర్తిస్థాయిలో అనుసంధానం చేసుకోకపోతే లాభం ఉండదని చెప్పారు. థియేటర్ కమాండ్‌ల ఏర్పాటుపై ఎయిర్‌ఫోర్స్ వ్యతిరేకంగా లేదని, అయితే దాన్ని ఎలా, ఏ క్రమంలో అమలు చేయాలన్న దానిపై జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎదురైన అనుభవాల తర్వాత ఈ అంశంపై చర్చల్లో మార్పు వచ్చిందని తెలిపారు. భారత్‌కు మొత్తం 42 స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు అవసరం. ప్రస్తుతం భారత్ వద్ద 29 ఉన్నాయి. సాధారణంగా ఒక్క స్క్వాడ్రన్‌లో 18 యుద్ధ విమానాలు ఉంటాయి.

## 49 మంది గుర్తింపు, 12 మంది గెంటివేత

## హైదరాబాద్‌లో అక్రమంగా ఉన్న విదేశీయులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** జంట నగరాలలో అక్రమంగా వుంటున్న విదేశీయులను గుర్తించేందుకు స్పెషల్ బ్రాంచి పోలీసులు స్పె షల్ డ్రైవ్ చేబట్టారు. నగర వ్యాప్తంగా నెల రోజులుగా సాగుతున్న ఈ డ్రైవ్‌లో ఇప్పటి వరకు 49 మంది అక్రమంగా వుంటున్నట్లు గుర్తించగా ఇందులో 12 మందిని వారి దేశాలకు గెంటివేయగా మిగతా వారిని సంగారెడ్డిలోని హోల్డింగ్ సెంటర్‌కు తరలించారు. హైదరాబాద్‌లో అక్రమం గా వుంటున్న విదేశీయుల్లో అనేక మంది నేరాలకు పాల్పడడం, మాదకద్రవ్యాల స్మగ్లర్లుగా మారడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడ ం, స్థానిక నేరస్తులతో చేతులు కలపడం వల్ల ఆయా ప్రాంతాలలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా నివసిస్తున్న, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న విదేశీయులను గుర్తించడానికి పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేబ ట్టారు. ఇందులో భాగంగా విదేశీయుల వివరాల సమగ్ర పరిశీలన, వీసా నిబంధనల అమలు, అక్రమ కార్యకలాపాల అడ్డుకట్టతో పాటు చట్టప రమైన బాధ్యతలపై ప్రజలు, వసతి గృహాల నిర్వాహకులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో ఇప్పటివ రకు వీసా నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఉంటున్న 49మంది విదేశీయులను గుర్తించి, అందులో 12 మందిని వారి దేశాలకు బలవం తంగా గెంటివేశారు. మిగతా వారిని వారి స్వదేశాలకు పంపించే ప్రక్రియ వేగంగా సాగుతోంది. విదేశీయులు అక్రమంగా వున్న ప్రాంతాలు పోలీసు స్టేషన్ల వారిగా ఇలా వున్నాయి. టోలిచౌకిలో 30, ంగర్ హౌస్‌లో ఆరుగురు, మెహదీపట్నంలో ఆరుగురు, రాజేంద్రనగర్‌లో ముగ్గురు, బంజారాహిల్స్ లో ఇద్దరు, సైఫాబాద్, గుడిమల్కాపూర్‌లో ఇద్దరు పట్టుబడ్డారు. తనిఖీల క్రమంలో ఒక విదేశీయుడి వద్ద 250 గ్రాముల గంజా యి పట్టుబడింది. అక్రమంగా వుంటున్న వారు ఆసుపత్రులకు వచ్చే విదేశీ రోగులకు అనువాదకులుగా, మధ్యవర్తులుగా పనిచేస్తున్నట్లు తేలింది. వీరు రోగుల నుండి భారీగా రుసుము వసూలు చేయడమే కాకుండా, ఆసుపత్రి బిల్లులో దాదాపు 15 వరకు కమిషన్ పొందుతున్నట్లు గుర్తిం చారు.వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తేలింది. పర్యాటక వీసాపై వచ్చి గడువు ముగిసిన తర్వాత కూడా ఉంటున్న కెన్యా దేశస్తురాలు వ్యభిచారం చేస్తూ దొరికిపోయింది. మరో విదేశీయుడు మత్తుకు బానిసగా మారాడు. రాజేంద్రనగర్ పరిధిలో స్టూడెంట్ వీసాపై వచ్చి 2018, నుండి అక్రమంగా ఉంటున్న సౌత్ సుడాన్‌కు చెందిన ముగ్గురు వారికి గంజాయికి బానిసలుగా మారారు. కాగా విదేశీయులకు ఆశ్రయం ఇస్తున్న వారు కచ్చితంగా పోలీసుల సూచనలు పాటించాలని కమిషనర్ సజ్జన్నర్ కోరారు. లేని పక్షంలో వారిపైనా కఠిన చర్యలు వుంటాయని ఆయ న హెచ్చరించారు.

## మూడో క్వార్టర్‌లో రూ.13 వేల కోట్ల రుణం

### 6న రూ.2,500 కోట్లు సేకరణ
### రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర సర్కార్ ఇండెంట్

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** ప్రస్తుత 2026-27లో అక్టోబరు నుండి డిసెంబరు వరకూ కలిగిన మూడో త్రైమాసికంలో రూ.13 వేల కోట్ల రుణాన్ని సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,500 కోట్ల అప్పు తీసుకోనున్నట్లు ఇండెంట్‌లో పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈనెల 6న నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను ఈ వేలం వేయడం ద్వారా ఆ రుణాన్ని సేకరించనుంది.



రాయ్‌పూర్‌లో జరిగిన ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న మహిళా మావోయిస్టులు

## మహిళా మావోయిస్టులకు బాలీవుడ్‌లో అవకాశం

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** ఇంతకాలం అడవుల్లో వుంటూ ఆయుధాలు పట్టి పోలీసులతో పోరాడి, ఇటీవలే లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిన మహిళా మావోయిస్టులకు బాలీవుడ్‌లో నటించే అవకాశం దక్కింది. ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో రాయ్‌పూర్‌లో ఇటీవ ల జరిగిన చేనేత దినోత్సవ కార్యక్రమంలో లొంగిపోయిన మహిళా మావోయిస్టులు పాల్గొని ర్యాంప్ వాక్ చేశారు. రాష్ట్ర గ్రామోద్యోగ్ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీరంతా సంప్రదాయ వస్త్రాలు ధరించి గిరిజన సంస్కృతిని చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర స ర్కారు టీవీల్లో ప్రసారం చేయగా జాతీయ ఛానళ్లలోనూ ప్రసారమయ్యాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బెంగాల్ 1947 చిత్ర దర్శకుడు ఆకాష్ ఆదిత్య లామా రాయ్‌పూర్ వెళ్లి ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న మహిళా మావోయిస్టులను కలిశారు. తన తదుపరి చి త్రంలో వీరికి అవకాశం కల్పించేందుకు ఆయన అంగీకరించారు. 1994లో బస్తర్ ప్రాంతంలో జరిగిన ఒక సున్నితమైన వాస్తవ ఘటన ఆధారం గా తాను తీస్తున్న సినిమాలో వీరికి అవకాశం ఇస్తున్నట్లు లామా తెలిపారు. మావోయిస్టుల ప్రభావం వున్న రోజుల్లో ఆయా ప్రాంతాలలో జీవి ంచిన మహిళల అనుభవాలను సమాజానికి చెప్పేందుకు గతంలో ఇదే ప్రాంతంలో వున్న వీరిని ఎంపిక చేయడం ఆనందంగా వుందని ఆయన తెలిపారు. వచ్చే డిసెంబరు నెలలో బస్తర్‌లో షూటింగ్ ప్రారంభిస్తానని ఆయన తెలిపారు. కాగా ఈ పరిణామంపై ఛత్తీస్‌ఘడ్ సిఎం విష్ణుదేవ్ సాయి హర్షం వ్యక్తం చేశారు. హింసను వీడిన వారికి ఇలాంటి అవకాశాలు రావడం, వారి పునరావాసానికి దోహద పడుతుందని ఆయన తెలిపారు.

### బొల్లారం ఘటనలో విస్తుపోయే వాస్తవాలు
### రక్షణ శాఖ తుపాకులు, తూటాల చోరీ
### ఘటనలో నలుగురు సైనికుల హస్తం
### చోరీ ఆయుధాలను అమ్మేందుకు
### అక్రమ ఆయుధ డీలర్‌తో మంతనాలు

# అంగట్లో మిలటరీ ఆయుధాలు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** రక్షణ శాఖ క్రమశిక్షణకు, త్యాగానికి మారుపేరుగా వుండడం తెలిసిందే. దేశ సరిహద్దుల్లో ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్, చైనా సరిహద్దుల్లో కఠినమైన పరిస్థితుల్లో ప్రాణాలను కూడా లెక్క చేయకుండా సైనికుల పోరాటం నిత్యం మీడియాలో వస్తూ నే వున్నాయి. అయితే బొల్లారంలో మిలటరీ ఆయుధగారంలో చోరీ అయిన ఆయుధాలు, మందుగుండు సామాగ్రి ఉదంతంలో నలుగురు సైని కుల హస్తం వెలుగు చూడడం రక్షణ శాఖతో పాటు పోలీసు శాఖను సైతం షాక్‌కు గురిచేసింది. ఇందులో ముగ్గురు సర్వీసులో వుండగా ఒకత ను బలవంతంగా పదవీ విరమణ పొందాడు. దొంగిలించిన ఆయుధాలు, మందుగుండు సామాగ్రిలో కొన్నింటిని బెంగాల్‌లోని అక్రమ ఆయుధ డీలర్‌కు అమ్మాలని నలుగురు సైనికులు పథకం పన్నడంతో పాటు మిగతా వాటిని వాడి బ్యాంకులు, డబ్బున్న వారిని లూటీ చేయాలని వ్యూ హాలు రచించారు. వీరి వ్యూహాలు బెడిసికొట్టి దొరికిపోయారు కానీ లేకుంటే కచ్చితంగా ఘోరాలు జరిగివుండేవనడంలో ఎలాంటి సందేహం లే దు. కట్టుదిట్టమైన భద్రత వుండే హైదరాబాద్‌లోని మిలటరీ ఏరియాలోనే పరిస్థితి ఇలావుంటే ఉగ్రవాదులు, చొరబాట్లకు నిలయంగా వుండే కాశ్మీర్, చైనా సరిహద్దుల్లో ఎలా వుంటాయోనని రక్షణ రంగ నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారం మిలటరీ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ ఘటనలో మాజీ హవల్దార్ మల్లేష్‌తో పా టు సర్వీసులో వున్న మరో ముగ్గురు సైనికులు వుండడం రక్షణ శాఖలోని డొల్లతనాన్ని ఎత్తి చూపింది. దక్షిణాది రాష్ట్రాలలో రక్షణ శాఖ స్థావ రాలలో ఇంతవరకు ఆయుధాల మిస్సి ంగ్ ఘటనలు వున్నా భారీగా చోరీ ఘటనలు లేవు. కొన్ని ఘటనల్లో తమ వద్ద వున్న పిస్టోళ్లతో కొందరు పారిపోయినా వారిని వెంటనే పోలీసులు పట్టుకున్నారు. అయితే దీనికి భిన్నంగా బొల్లారం ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ కేసుకు స్కెచ్ వేసిన మల్లేష్ అతనికి సహకరించిన సైనికులు శేషులు, వినోద్ కుమార్, ప్రవీణ్ పెద్ద పథకమే వేశారు. ఎకె 47, ఇన్సాస్ తుపాకులను బెంగాల్‌లో అక్రమ ఆయుధ డీలర్‌కు ఒక్కోదాన్ని ఐదేసి లక్షల రూ పాయలకు అమ్మాలని నిర్ణయించారు. బెంగాల్ బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రం. బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక కార్య కలాపాలు ఎక్కువగా వుండగా, జిహాదీల ప్రమేయం కూ డా విపరీతంగా వుంది.

ఇలాంటి పరిస్థితుల్లో మి లటరీ ఆయుధాలు వారి చేతుల్లో పడితే పరిస్థితి తీవ్రంగా వు ంటుందనేది కాదనలేని వాస్తవం. దీంతో పాటు మిలటరీ పిస్టోళ్లతో బ్యాంకులతో పాటు సంపన్న వర్గాలను లూటీ చేయాలని మల్లేష్ ముఠా పథకం రచించింది. ఒకవేళ వీరి పథకం అమలయి వుంటే దేశ చరిత్రలో దోపిడీలు , దొంగతనాల్లో తొలిసారిగా సైనికుల హస్తం వుండేది. మల్లేష్ సర్వీసులో వుండగానే అక్రమంగా తపంచా కొని తాను వుండే నాగర్‌కర్నూలు లో రెండు దొంగతనాలకు పాల్పడినట్లు వెలుగు చూసింది. మల్లేష్ పథకం పురిట్లోనే బెడిసికొట్టడంతో అందరు దొరికిపోయారు.

### సరిహద్దుల్లో మిలటరీ ఆయుధగారాలు భద్రమేనా?

ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో మిలటరీ ఆయుధాలను దొంగిలించి వాటిని అక్రమ ఆయుధ డీలర్‌కు అమ్మేందుకు నలుగురు సైనికులు ప్రయ త్నించిన ఘటన రక్షణ రంగాన్ని షాక్‌కు గురిచేయగా కాశ్మీర్, చైనా సరిహద్దుల్లో పదుల సంఖ్యలో గల మిలటరీ ఆయుధ గారాల భద్రతపై ఇప్పుడు నీలినీడలు కమ్ముకున్నాయనిఇ విమర్శలు వస్తున్నాయి. సరిహద్దుల్లో ఉగ్రవాదులు, చొరబాటుదారులతో ఎవరైనా సైనికులు మిలాఖత్ అయి తే పరిస్థితి ఏమిటనే దానికి రక్షణ శాఖ సమాధానం చెప్పాల్సి వుంది. గతంలో నక్సల్స్ స్థావరాలలో కోవర్టు ఆపరేషన్లు జరిగినట్లుగా సరిహ ద్దుల్లో సైనిక స్థావరాలలో జరిగితే భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వుంటుందని రక్షణ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. బొల్లారం ఘటనను ర క్షణ శాఖ తీవ్రంగా పరిగణించాలని వారంటున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ఇల్లందు మునిసిపాలిటీ కార్యాలయం, కొత్తగూడెం జిల్లా
నోటీస్ Roc No. F1/126/2026, ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తేది : 03.10.2026
పనుల యొక్క పేరు: ఇల్లందు మునిసిపాలిటీ, DRCC వద్ద ఘన వ్యర్థాల నిర్వహణ యొక్క మెషీనరీల థర్డ్‌పార్టీ ఆపరేటింగ్ మరియు యాజమాన్యానికి, జంతు జనన నియంత్రణ-కం-యాంటీ రాబిస్ వేక్సినేషన్ (శునకాల గర్భ నిరోధం) మరియు ఆ మునిసిపాలిటీలో మునిసిపల్ ఉద్యానవనాల నిర్వహణ నిమిత్తం ఆసక్తి వ్యక్తీకరణ (EOI) ఆహ్వానిస్తోంది.
గమనిక: పైన పేర్కొన్న పనులకు ఆహ్వానించబడిన కొటేషన్ రేట్ యూనిట్‌లకు సంబంధించి గంట చొప్పున, సంఖ్యలు, లీటర్‌లు, జాబ్ పని, రోజు ఒక్కంటికి, కెజీలు, చ.మీటరు వగైరాలు ప్రతి ఒక్క ఐటమ్‌కు పేర్కొనవలెను.
ఆసక్తిగల కాంట్రాక్టర్/ఏజెన్సీ వారి డాక్యుమెంట్‌లను సీల్డ్ కవర్‌లలో (EOI)ను మరియు కొటేషన్‌ను ఆహ్వానించే క్రింది సంతకందారునికి 05.10.2026 తేదీ నుండి 07.10.2026 సా.4.30 గం. వరకు దాఖలు చేయవచ్చును. కొటేషన్ (EOI) తెరచు తేదీ: 07.10.2026 సా.5.00 గం. దాఖలైన సీల్డ్ టెండర్లు సంబంధిత కోటెడ్ సంస్థల సమక్షంలో తెరువబడును మరియు తదుపరి వివరాలకు మునిసిపల్ కమిషనర్, ఇల్లందు మునిసిపాలిటీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారిని సంప్రదించండి. కాంటాక్ట్ వివరాలు: ఇల్లందు మునిసిపాలిటీ, మొబైల్ నం: 9849905883. సం/- కమిషనర్, ఇల్లందు మునిసిపాలిటీ
DIPR.No.11101-PP/CL/Advt/1/2026-27, తేది: 03.10.2026

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి "తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ" అధ్యక్షులు శ్రీ చుండి శోభన్‌బాబు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) చుండి శోభన్‌బాబు, అధ్యక్షులు (2) శ్రీ చుండి శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి (3) శ్రీ గజ్జెల రమేష్, కోశాధికారి లు ప్రధాన కార్యవర్గ సభ్యులు మరియు పార్టీ ప్రధాన కార్యాలయము డోర్ నెం: 10-157/1, మల్కాజ్‌గిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ -500 047. సదరు పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, మొదటి అంతస్తు, టిటిసిపి భవనము, ఎ.సి.గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజులలోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు "తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ" ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేసే ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.
తేది : 03-10-2026 సం/- అధ్యక్షులు : తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ

**టిజి..టిఎంఆర్ఎస్ ఆశించిన ఫలితాలు సాధించేనా?**

రాష్ట్రంలో నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సర్కారు ఏర్పాటు చేసిన టిజి..టిఎంఆర్ఎస్‌పై ఎన్నో ఆశలు వున్నాయి. ట్రాఫిక్ నిర్వహణ అంటే, కేవలం చలానాలు వసూలుచేయడమే కాకుండా, శాస్త్రీయపద్ధతుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం, అత్యవసర వైద్యసాయం అందించడమే లక్ష్యంగా టిజి..టిఎంఆర్ఎస్‌ను ఏర్పాటైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడిచే రోడ్ సేఫ్టీ అథారిటీ పరిధిలోనే ఈకొత్త విభాగం పనిచేస్తుంది. విభాగం అదనపు డిజిపి లేదా ఐజి స్థాయి అధికారి నేతృత్వంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుంది. రాష్ట్రంలోని 32వేలకిలోమీటర్ల కంటే ఎక్కువ ఉన్న రహదారులు, 1.8కోట్లకు పైగా ఉన్నవాహనాల రాకపోకలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. రోడ్డు రవాణాతోపాటు మెట్రో, రైల్వే భద్రతను కూడా ఈవిభాగానికే అప్పగించారు. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఈవిభాగం పోలీసులు పనిచేయాల్సి వుంటుంది. బాధితులప్రాణాలు కాపాడేందుకు ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఒక రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్‌ను నియమిస్తారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించడం వీరి బాధ్యత. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు, 50 కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉన్న హైవేలపై స్పీడ్ గన్‌లు, అత్యాధునిక కెమెరాలతో కూడిన హైవే పెట్రోలింగ్ యూనిట్లు నిరంతరం పహారా కాస్తాయి. కొత్త విభాగం నిర్వహణకోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటుచేశారు. పోలీసులువసూలు చేసే ట్రాఫిక్ జరిమానాల మొత్తంలో 40 శాతాన్ని నేరుగా ఈ నిధికే మళ్లిస్తారు. ఈ నిధులను సిబ్బంది శిక్షణ, అధునాతన సాంకేతికత, పెట్రోలింగ్ వాహనాలు, అత్యవసర రోడ్డు మరమ్మతుల కోసమే ఉపయోగిస్తారు.

# పాతకు పాతర- కొత్తకు జాతర!

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

తెలంగాణలో రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్‌ను సవ్యంగా సాగేలా చేసేందుకు, వాహనదారులు క్రమశిక్షణతో వుండేందుకు, అతి వేగంగా వెళ్లే వాహనాలకు కట్టడి చేసేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (టిజి..టిఎంఆర్ఎస్)పై ఎన్నో ఆశలు మరెన్నో ఆకాంక్షలు నెలకొన్నాయి. దేశంలో ఎక్కువ సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు అనేకం తెలంగాణలో వుండడం గమనార్హం. ఇదే సమయంలో పట్టణీకరణ పెరుగుతున్న నగరాలు, ట్రాఫిక్ సమస్య హెచ్చుగా వున్న నగరాలు సైతం తెలంగాణలో ఎక్కువగా వున్నాయి. వీటన్నింటికి శాస్త్రీయంగా పరిష్కారం కనుగొనేందుకు టిజి..టిఎంఆర్ఎస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సర్కారు ప్రకటించినా రాష్ట్రంలో ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటైన రోడ్ సేఫ్టీ అథారిటిని పాలకులు ఎందుకు పనికిరాని విభాగంగా మార్చిన ఉదంతాన్ని ప్రజలు ఇంకా మరచిపోలేకపోతున్నారు. ఎంతో మంచి ఉద్దేశంతో 1984లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఏర్పాటు చేసిన ఈ విభాగం నేడు లూప్‌లైన్‌లో పనిచేసే సీనియర్ ఐపిఎస్ అధికారులకు పునరావాస కేంద్రంగా మారింది. టిజి.. టిఎంఆర్ఎస్ విభాగం ఏర్పాటు వెనుక సర్కారు ఉద్దేశాలు ఉన్నతంగానే వున్నా క్షేత్రస్థాయిలో ఏ మేరకు ఫలితాలు వస్తాయనేది ఆయా ప్రాంతాల అధికారుల పనితీరుపై, సాటి సర్కారీ విభాగాల సహకారంపై ఆధారపడి వుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. టిజి..టిఎంఆర్ఎస్ విభాగం ఏర్పాటు విషయం అలావుంచితే 1984లో ఏర్పాటైన రోడ్ సేఫ్టీ అథారిటీ గురించి కొన్ని అంశాలను పరిశీలిస్తే అప్పట్లో సిఎంగా వున్న ఎన్టీఆర్ వద్ద సిఎంఒ పేషీ బాస్‌గా వున్న రాఘవేంద్ర రావు తన స్వస్థలం విజయవాడకు వెళ్లిన సమయంలో స్కూటర్‌పై ప్రయాణిస్తుండగా ప్రైవేటు సిటీ బస్సు ఢీకొనడంతో మరణించారు. ఈ ఘటన ఎన్టీఆర్‌ను కలచివేసింది. దీంతో ఆయన హుటాహుటిన మంత్రులతో పాటు సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్‌లతో కలిసి విజయవాడ వెళ్లి ఈ ప్రమాదంపై ఆరా తీశారు.

రాష్ట్రంలో ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా వుండేందుకు ఆయన వెంటనే రోడ్ సేఫ్టీ అథారిటీని ఏర్పాటు చేశారు. ఆరంభం నుంచే ఈ విభాగానికి పోలీసు విభాగంలోని కొందరు అధికారులతో పాటు రవాణా శాఖ అధికారుల నుంచిఅనేక కారణాల వల్ల సహకారం కరువవడంతో నామ్‌కే వాస్తేగా మారింది. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ విభాగం లూప్‌లైన్ పోస్టింగులకు కేరాఫ్‌గా మారింది. డిజి స్థాయి అధికారులను ఈ విభాగం బాస్‌లుగా నియమించినా



క్షేత్రస్థాయి సిబ్బంది సహా కార్యాలయ సిబ్బంది కూడా లేకపోవడంతో ఇటువంటి విభాగం ఒకటి వుంది...అన్నట్లుగా తయారయ్యింది. ఈ విభాగం బాస్‌లుగా ప్రస్తుత బాపట్ల ఎంపి విశ్రాంత డిజిపి కృష్ణ ప్రసాద్ సహా రవి గుప్తా, అంజనీ కుమార్ వంటి దిగ్గజ పోలీసు అధికారులు పనిచేశారు. ఇప్పుడు ఉభయ రాష్ట్రాల్లోనూ ఈ విభాగాలు వున్నా ఎటువంటి ప్రయోజనం లేకుండా వుంది. ఈ విభాగాల కోసం మొదట ఉమ్మడి ఎపి ఇప్పుడు ఉభయ రాష్ట్రాలు కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నా నయాపైసా ప్రయోజనం కలగలేదని విమర్శలు వున్నాయి. ఈవిభాగం గురించి రోడ్ లేదు. సేఫ్టీ లేదు అనే సెటైర్లు వున్నాయి. ఇక తాజా విషయానికి వస్తే రాష్ట్రంలో ట్రాఫిక్ వ్యవస్థను చక్కదిద్దేందుకు టిజి ..టిఎంఆర్ఎస్‌ను సర్కారు ఏర్పాటు చేసింది. ఇక రాష్ట్రంలోరోడ్డు భద్రత నానాటికీ తీసికట్టుగా వుండడంతో ఈ విభాగాన్ని సర్కారు ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ట్రాఫిక్ గురించి పరిశీలిస్తే అంతా గజిబిజిగా వుందనేది తెలిసిందే. ఇతరప్రాంతాల విషయం అలావుంచితే గ్రేటర్ పరిధిలో ఇది మరింత తీవ్రంగా వుంది. గ్రేటర్ పరిధిలో ఇది వరకటితో పోలిస్తే గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ విభాగం పరిపుష్టిగానే వుంది. తగినంత సిబ్బంది కూడా వున్నారు. అయితే ట్రాఫిక్ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వుందని చెప్పాలి. సిటీ ట్రాఫిక్‌ను పట్టి పీడిస్తున్న సమస్యల్లో మొదటిది చౌరస్తాలు, బస్ స్టేషన్ల వద్ద ఆక్రమణలు. ఈ సమస్య రాష్ట్రంలోని అన్ని పట్టణాలలోనూ ఎక్కువగా వుంది. వీరికి ఆయా ప్రాంతాల రాజకీయ నేతల మద్దతు వుండడం విశేషం. ప్రధాన బస్ స్టేషన్లతో పాటు చౌరస్తాలలో తోపుడు బళ్లతో పాటు ఆటోల అక్రమ పార్కింగ్ మరో సమస్య. కొన్నిచోట్ల పోలీసు స్టేషన్ల సమీపంలో గల బస్‌స్టేషన్లు, చౌరస్తాలలోనూ ఈ సమస్య అధికంగా వుంది. నగరంలోని మెహదీపట్నం చౌరస్తాలో పోలీసు స్టేషన్ పక్కన ఆర్టీసీ డిపో నుంచి బస్‌స్టాండ్‌కు వచ్చే మార్గం చిన్నదిగా వుండగా ఈ మార్గంలో ఉదయం నుంచి అర్ధరాత్రి దాటే వరకు వరుసగా తోపుడుబళ్లను ఏర్పాటు చేసికొందరు వ్యాపారాలు దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో తోపుడు బళ్లను తొలగించాలని గతంలో పలువురు ట్రాఫిక్ అధి కారులు ప్రయత్నించగా వారంతా హఠాత్తుగా బదిలీ అయ్యారు. రేతీబౌలి మార్గంలో వున్న షాపింగ్‌మాల్స్ బయట పదుల సంఖ్యలో తోపుడు బళ్లు, కార్లు, ఇతర వాహనాలు గంటల తరబడి నిలిచి వుండడం వల్ల టోలిచౌకి మార్గంలో ప్రయాణం సాగించాలంటేనే వాహనదారులకు నరకంగా వుంది. కోఠి నుంచి వుమెన్స్ కాలేజి బస్ స్టాప్ మార్గంలో ఒకవైపు ఫుట్‌పాత్ ఖాళీగా వుండగా రెండవ వైపు ఫుట్‌పాత్ వ్యాపారుల ఆక్రమణలో వుంది. అమీర్‌పేట్ చౌరస్తాలో ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులు ఆక్రమించి దర్జాగా వ్యాపారాలు సాగించడం వల్ల పాదచారులకు దారిలేకుండాపోయింది. ఇక నగరంలోని పేరొందిన గుడిమల్కాపూర్ పూల, కూరగాయల మార్కెట్లు, కొత్తపేట్, మలక్‌పేట్ మార్కెట్ బయట ఫుట్‌పాత్‌ల ఆక్రమణ ఒక మాఫియాగా మారింది. చారిత్రాత్మక చార్మినార్ నుంచి అటు మదీనా వరకు ఇటు శాలిబండ వరకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణ మరింత దారుణంగా వుంది. రాష్ట్రంలో గడచిన పదేళ్ల కాలంలో జనాభా విపరీతంగా పెరిగింది. రహదారుల వైశాల్యం కూడా పెరిగింది. దీంతో పాటు రహదారుల ఆక్రమణలు, వాహనాల రాకపోకలూ, ప్రమాదాలు పెరిగాయి. రాష్ట్రంలో ఏటా ఎనిమిది వేలమంది వరకు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తుండగా 60 వేల మందికి పైగా గాయపడుతున్నారు. ఇక చౌరస్తాలతో పాటు బస్ స్టేషన్లలో ఆక్రమణల వల్ల బస్సులు నిలిపేందుకు దారిలేక రోడ్డు మధ్యన నిలపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈసమస్య ట్రాఫిక్ పోలీసులు ముందుగా ప్రత్యేక దృష్టి సారించాల్సి వుంది. ఇక ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువగా వుంటున్నాయి. ఆక్రమణల విషయంలో గతంలో కొందరు ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారులు కఠినంగా వ్యవహరిస్తే వారిని నెలల తరబడి విఆర్‌లో వుంచిపోస్టింగులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిన ఘటనలూ వున్నాయి. కొన్నిసార్లు నేతల ఒత్తిళ్ల వల్ల డిసిపిస్థాయి అధికారులు సైతం విఆర్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్‌కు చికిత్స చేసేందుకు మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఆపరేషన్ రోప్‌ను ఏర్పాటు చేసినా ఇది పూర్తిస్థాయిలో అమలు కాలేక డీలాపడింది. ●

# ‘జాట్’ ఆట మొదలు!

రాష్ట్రం: పంజాబ్

**ఎ.వి.వి ప్రసాద్**

కష్టాల కడలిలో ఎదురీదుతున్న కాంగ్రెస్ రెండు రోజుల క్రితం హఠాత్తుగా పంజాబ్‌లో పార్టీకెప్టెన్‌ను మార్చేసింది. దాదాపు నాలుగున్నర సంవత్సరాలుగా పిసిసి చీఫ్‌గా ఉన్న అమరిందర్ సింగ్ రాజా వారింగ్ స్థానంలో పర్గత్ సింగ్‌ను కొత్తగా నియమించింది. ఇది ఆశ్చర్యకరమైన విషయం కాకపోయినా ఆలోచించాల్సి నపరిణామమే. కొంత కాలం నుంచి వారింగ్‌ను తొలగించాలనే డిమాండ్ పార్టీ నాయకుల నుంచి వచ్చినా, అధిష్ఠానం వినీవిననట్లు వదిలేసింది. దానికి ప్రధాన కారణం వారింగ్‌కు రాహుల్ గాంధీతోగల సాన్నిహిత్యమే. సరిగ్గా నెల రోజులక్రితం పార్టీ ఇన్చార్జి భూపేష్ భగేల్‌ను తొలగించి సచిన్ పైలట్‌కు బాధ్యతలు అప్పగించినట్లుగా పిసిసి పగ్గాలను ప్రస్తుతం పర్గత్ సింగ్ చేతిలో పెట్టింది. రాష్ట్రంలో మరో కీలకనేత, మాజీ సిఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీతో వారింగ్‌కు విభేదాలు తారాస్థాయికి చేరడంతో గత రెండేళ్లుగా పార్టీ నాయకత్వాన్ని మార్చాలనే డిమాండ్ కార్యకర్తల నుంచి వినిపిస్తూనే ఉంది. మరో సీనియర్ నేత సుఖ్‌జిందర్ సింగ్‌తో కూడా వారింగ్ కు విభేదాలే అంటారు. రాహుల్‌కు చేరువకావడంతో మిగిలిన నేతలను వారింగ్ లెక్కజేయడం లేదనీ, ఆ కారణంగా పంజాబ్ కాంగ్రెస్ అనేక వర్గాలుగా చీలిపోయిందనీ అంటారు. వారింగ్‌ను తొలగించడం చన్నీని ప్రసన్నం చేసుకోనడానికే అని కూడా వినిపిస్తోంది. గత జూలైలో పార్టీ ప్రచార కమిటీ బాధ్యతలను చన్నీకి అప్పగించారు. వారింగ్ పిసిసి చీఫ్‌గా ఉండగా తాను ప్రచార బాధ్యతలు తీసుకోలేనని చన్నీ వ్యతిరేకించారనీ, ఆ సమయంలోనే వారింగ్ తొలగింపుపై అధిష్ఠానం చన్నీకి హామీ ఇచ్చిందనీ తెలుస్తోంది. రాజీనామా తర్వాత వారింగ్ మీడియాతో మాట్లాడుతూ‘చన్నీ సాహెబ్ గెలిచారు’ అంటూ చేసిన వ్యాఖ్య ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చన్నీకే పిసిసి బాధ్యతలు అప్పగించవచ్చని తొలుత వినిపించినా, చివరికి ఆయనకు సన్నిహితుడుగా పేరున్న పర్గత్ సింగ్‌కు లభించింది. చన్నీ సిఎంగా ఉన్నప్పుడు పర్గత్ ఆయన కేబినెట్ లో ఉన్నారు. ఆయనకే ఇప్పుడు పార్టీ పగ్గాలు అప్పగించడం వల్ల చన్నీ వర్గానిదే ఇక పైచేయి అవుతుంది. ప్రస్తుతం ఆప్ ముఖ్యమంత్రిగా ఉన్న భగవంత్ సింగ్ మాన్ గాని, బిజెపి చీఫ్‌గా ఉన్న కేవల్ సింగ్ ధిల్లాన్ గాని జాట్ సిక్కు వర్గానికే చెందిన వారు కావడంతో, అదే వర్గానికి చెందిన పర్గత్‌ను కాంగ్రెస్ నియమించినట్లుగా తెలుస్తోంది. సిక్కులలో జాట్‌లు కీలకం గనుక ఈసారి జరిగే అసెంబ్లీ పోరు ప్రధానంగా జాట్ నాయకుల మధ్యనే ఉంటుందని చెప్పవచ్చు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పర్గత్ సింగ్ జమ్మూకాశ్మీర్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా కూడాఉన్నారు. కాశ్మీర్ కాంగ్రెస్‌లో వర్గ పోరును నియంత్రించడంలో గట్టి చర్యలు తీసుకొన్నారనే పేరు ఉండడంతో వారింగ్ పంజాబ్ నాయకత్వం స్వీకరించడానికి అది తోడ్పడిందని చెప్పవచ్చు. గొప్ప హాకీప్లేయర్‌గా కూడా వారింగ్‌కు చక్కని పేరుంది. రెండు సార్లు ఒలింపిక్స్‌లో కెప్టెన్ బాధ్యతలుచేపట్టడమే గాక అప్పట్లో అర్జున అవార్డు, పద్మశ్రీ కూడా సాధించారు. పంజాబ్ హాకీ జట్లకు శిక్షణ ఇచ్చిన పేరు కూడా ఆయనకే సొంతం. ఐదారు నెలల్లో జరిగే ఎన్నికలకు పార్టీనేతలను సిద్ధం చేయగలరనే నమ్మకం తోనే నాయకత్వ బాధ్యతలను అధిష్ఠానం ఆయనకు అప్పగించిందని తెలుస్తోంది. జనవరి తర్వాత ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్‌తో పాటు పంజాబ్ లో కూడా ఎన్నిలు జరగనున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆప్ పరిస్థితి కూడా అంతంత మాత్రమే కావడంతో వ్యూహరచన జాగ్రత్తగా చేస్తే కాంగ్రెస్‌కు విజయావకాశాలు మెరుగు పడతాయి. 117 సీట్లున్న అసెంబ్లీలో ఆప్ కు 92 సీట్లుండగా, కాంగ్రెస్‌కు ప్రస్తుతం 18 మాత్రమే ఉన్నాయి. అసెంబ్లీలో ఆప్‌కు అధిక శాతం సీట్లు ఉన్నా ‘స్థానబలం’ తక్కువేనని చెప్పాలి. ఆప్‌కు ఉన్న 42 శాతం ఓట్లలో కనీసం 15 శాతం కాంగ్రెస్ తనవైపు తిప్పుకో గలిగితే విజయంచేకూరవచ్చు. సిక్కులలో జాట్‌వర్గం కీలకం గనుక, ఆవర్గానికే పార్టీపగ్గాలు అప్పగించారు గనుక ఈసారికాంగ్రెస్ ఓట్ల శాతం బాగా పెరగవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. బిజెపికి ప్రస్తుతం 6శాతం ఓట్లతో రెండు సీట్లుమాత్రమే ఉన్నాయి. శిరోమణి అకాలీదళ్ (ఎస్ఎడి)తో కలిసి బిజెపి పోటీ చేస్తే సీట్లు పెరగవచ్చుకానీ అధికారయోగం పట్టకపోవచ్చు. ఒంటరిగానే పోటీ చేస్తామని బిజెపి ఒక వంక ప్రకటిస్తూ మరోవంక ఎస్ఎడితో చర్చలు జరుపుతోంది. చన్నీ, ప్రతాప్ సింగ్ బజ్వా, సుఖ్‌జిందర్ సింగ్, వారింగ్‌లను ఒకే ఎన్నికల వ్యూహంలోకి పర్గత్ తీసుకురాగలిగితే ఓట్ల శాతం కాంగ్రెస్‌కు బాగా పెరుగుతుంది. 2022లో కోల్పోయిన సంప్రదాయ ఓట్లను తిరిగి సాధించడానికి కూడా కాంగ్రెస్ కృషి చేయవలసి ఉంటుంది. ప్రచార కార్యక్రమాలలో కూడా అంతర్గత విభేదాల కారణంగా కాంగ్రెస్ మిగిలిన పార్టీల కంటే చాలా వెనుకబడి ఉంది. వచ్చే మూడు నాలుగు నెలల్లో పార్టీలోని వర్గ పోరును నియంత్రించడమేగాక ప్రచారకార్యక్రమాలు ఉధృతం చేయవలసిన బాధ్యతఇప్పుడు పర్గత్ పైనేఉంది. ఆయన ఎంత సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నది టిక్కెట్ల పంపిణీ సమయంలో స్పష్టమవుతుంది. ఎస్ఎడి తిరిగిబలపడితే, దానితో బిజెపి జతకడితే పరిస్థితి మారిపోవచ్చు. జాట్ సిక్కులు ఒకే పార్టీకి శాశ్వత ఓటు బ్యాంకు కాదు కనుక ఆ ఓట్లను కాంగ్రెస్ ఎక్కువగా ఆకర్షించ వచ్చు. గత ఎన్నికల్లో జాట్ ఓట్లు ఆప్‌కు 38 శాతం, కాంగ్రెస్‌కు 28 శాతం లభించాయి. బిజెపికి ఒక్కశాతం మాత్రమేఉన్నాయి. ఈ పరిస్థితిలో ఆప్ నుంచి జాట్ ఓట్లను కాంగ్రెస్ ఆకర్షించగలిగితే విజయం నల్లేరుపై నడక అవుతుంది. అయితే అన్ని పార్టీలు జాట్ ఓట్లపైనే ఎక్కువ ఆధారపడడంతో కాంగ్రెస్ తన ఆటను ఎంత వరకు రక్తి కట్టించగలదో చూడాలి. జాట్ ఓట్లతో పాటు ఇతర వర్గాల ఓట్లను రాబట్టడంలో పర్గత్ ఎంతవరకు సఫలీకృతులవుతారన్నది కూడా కీలకమే. ●



పర్గత్ సింగ్

# మండుతున్న మధ్యప్రాచ్యం!

దేశం: అమెరికా

**గన్ని మోహన్**

ఇరాన్‌పై మళ్లీ భారీ దాడులకు ట్రంప్ సిద్ధమవుతున్నారా అంటే ప్రస్తుత కార్యాచరణ అవుననేజవాబు వస్తోంది. ఇరాన్‌పై మళ్లీ భారీ స్థాయిలో వైమానిక దాడులు చేపట్టే అంశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిశీలిస్తున్నట్లు ఈ చర్యలు స్పష్టంచేస్తున్నాయి. అంటే మధ్యప్రాచ్యంలో మళ్లీ అమెరికా తన మిత్రదేశంతో కలిసి తీవ్రస్థాయిలో మంటలు మండించేందుకు సిద్ధం అవుతున్నట్లు ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి. అమెరికా సైన్యం మధ్యప్రాచ్యంలోకి మూడు విమాన వాహక నౌకలు, యుద్ధ నౌకలను తరలిం చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ చర్య పూర్తి స్థాయిలో అమలైతే దాదాపు20వేల మంది సైనికులు, 150వరకు యుద్ధ విమానాలు ఈ ప్రాంతంలో మోహరిస్తాయి. రాబోయే వారాల్లోట్రంప్, అమెరికా సైనిక కమాండర్లకు మరింత వ్యూహాత్మక వెసులుబాటు కల్పించడమే ఈ ప్రణాళిక ఉద్దేశమని స్పష్టం అవుతోంది. మూడుక్యారియర్ స్ట్రైక్ గ్రూపులు మధ్యప్రాచ్యానికి చేరితే పెద్ద సంఖ్యలో యుద్ధ విమానాలు, క్షిపణులను ప్రయోగించగల డిస్ట్రాయర్లు, వేలాది నావికులు, మెరైన్లు ఈ ప్రాంతంలో మకాంవేస్తారు. ఇరాన్ యుద్ధం కీలక దశలో ఉన్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై కనీవినీ ఎరుగని రీతిలో దాడులు చేస్తామని, ప్రపంచ చిత్రపటంలో ఇక ఇరాన్ కనుమరుగవుతుందని హెచ్చరికలు బాహాటంగానే చేస్తూ వస్తున్నారు. అయితే స్వదేశంలో తనకు పెరుగుతున్న వ్యతిరేకత, రేటింగ్ తిరోగమనం వంటి వాటితో వెనుకంజ వేసిన ట్రంప్ మధ్యంతర ఎన్నికల అనంతరం ఇరాన్‌పని పట్టాలన్న మంకుపట్టుతో ఉన్న సంగతి తెలియంది కాదు. దీనికితోడు మరో వైపునుంచి ఇజ్రాయెల్ శాయశక్తులా అమెరికాపై ఒత్తిడి పెంచుతూనే వస్తోంది. ఇరాన్ అణువ్యవస్థలు మొత్తం ధ్వంసంచేయడం లక్ష్యమే అన్న ఈ రెండుదేశాలు రానురాను మధ్యప్రాచ్యం మండించేందుకు సిద్ధం అవుతుండటంతో ఇప్పుడు మరో ప్రపంచ యుద్ధం తథ్యమా అన్న వాతావరణాన్ని ఇరుదేశాధినేతలు తెచ్చిపెట్టారు. నవంబర్‌మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై అమెరికాబాంబు దాడులను మరింత తీవ్రతరం చేయడం తప్పదన్న ట్రంప్ హెచ్చరికలకు అనుగుణంగానే భారీ ఎత్తున నౌకలు, యుద్ధవిమానాలు, ఆయుధ సామగ్రి వంటివాటిని తరలిస్తుండటం చూస్తుంటే ఇరాన్‌పై ముప్పేటదాడిచేయాలన్న వ్యూహమే కనిపిస్తోంది. ఇందుకోసం తగినంతగా ఆయుధ నిల్వలను గత కొన్ని నెలలుగా అమెరికా తిరిగి భర్తీ చేసుకుంటోంది కూడా. ప్రతి విమాన వాహక నౌకతోపాటు ప్రత్యేక వైమానిక విభాగం, యుద్ధ నౌకల బృందం ఉంటుంది. వీటికి అనుబంధంగా ఉండే డిస్ట్రాయర్లు దాడి సామర్థ్యంతో పాటు గగనతల, క్షిపణి రక్షణ వ్యవస్థలను కూడా అందిస్తాయి. దీంతోఇరాన్, గల్ఫ్ ప్రాంతంచుట్టూ అమెరికా చేపట్టగల సైనిక చర్యలకు అదనపు బలం చేకూరనుంది. అమెరికా ఇప్పటికే మధ్య ప్రాచ్యంలో సుమారు 50వేల మంది సైనికులను మోహరించిందని మధ్య ప్రాచ్య దేశాల అంచనా. ఈ సైనిక కదలికల్లో కొంత భాగం ఇప్పటికే నెలల తరబడి మోహరించిన బలగాలను ప్రత్యామ్నాయ బలగాలతో మార్చే ప్రక్రియ కూడా కావచ్చని తెలుస్తోంది. వీటిలో జార్జిబుష్ నౌక మార్చిలో వర్జీనియా నుంచి బయలుదేరింది. జార్జివాషింగ్టన్ నౌక మే నెలలోనే జపాన్లోని తన స్థావరం నుంచి బయలుదేరి ఆగస్టులో మధ్యప్రాచ్యానికి చేరుకుంది. మరోవైపు అబ్రహాం లింకన్ సుదీర్ఘ ప్రాంతీయ మోహరింపు అనంతరం శాన్‌డియాగోకు తిరుగు ప్రయాణంలోఉంది. మెరైన్ కార్ప్స్‌లో కూడా ఇదే తరహా బలగాల మార్పిడిని పరిశీలిస్తున్నారు. మూడు నౌకలతో కూడిన మాకిన్‌ఐలాండ్ యాంఫిబియజ్ రెడీ గ్రూప్ అంటే భూజలచరాల్లో కూడా యుద్ధ సామర్థ్యం ఉన్న గ్రూప్ ఇటీవల కాలిఫోర్నియా నుంచి బయలుదేరింది. ఇది మార్చినుంచి మధ్య ప్రాచ్యంలో ఉన్న బాక్సర్‌యాంఫిబియస్ రెడీ గ్రూప్‌లో చేరుతుంది. ఒక్కో గ్రూపులో 4వేల మందికిపైగా నావికులు, మెరైన్లు ఉంటారు. అందువల్ల కనిపిస్తున్న సైనిక బలగాల పెరుగుదలలో కొంత భాగం కొత్తగా బలగాలను పెంచడం కాకుండా సాధారణ సైనిక మోహరింపు మార్పిడి కూడా కావచ్చని అధికారులు పైకిచెపుతున్నా ఇరాన్‌కోసమేనని కొట్టిపారేయలేం. అయినప్పటికీ ప్రస్తుత సమయంలో ఈ కదలికలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ట్రంప్ ఇజ్రాయెల్తో కలిసి ఫిబ్రవరి 28న ఇరాన్పై యుద్ధాన్ని ప్రారంభించారు. వేసవిలో కొంతకాలం దాడులు నిలిచిపోవడంతో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకుఅవకాశం ఏర్పడింది. అయితే ఆప్రయత్నాలు విఫలమయ్యాయి. అనంతరం అడపాదడపా దాడులు తిరిగి ప్రారంభమయ్యాయి. దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంఅమెరికానౌకలు, యుద్ధ విమానాలు, సైనిక సిబ్బందిపై ఒత్తిడిని పెంచింది. 800 మందికి పైగా అమెరికా సైనికులు గాయపడగా, కనీసం 19మంది మరణించారు. అమెరికా సైనిక స్థావరాలు, విమానాలు కూడా దెబ్బతిన్నాయి. యుద్ధం కారణంగా అమెరికాకుఇప్పటికే దశాబ్దాల బిలియన్ డాలర్లవ్యయం ఏర్పడటంతోపాటు సుదీర్ఘ కాలం మోహరించిన బలగాలనిర్వహణ, సిబ్బంది మనోధైర్యంపై కూడా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా విమాన వాహక నౌకల కదలికలు రెండు లక్ష్యాలను ఏకకాలంలో నెరవేర్చే అవకాశంఉంది. ఒకవైపు అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నా సైనిక సామర్థ్యాన్ని సిద్ధంగాఉంచడం, మరోవైపు ట్రంప్ మళ్లీ ఇరాన్‌పై దాడులు చేయాలని నిర్ణయిస్తే వేగంగా చర్యలు చేపట్టేందుకు సన్నద్ధంగా ఉండటం. మధ్యంతర ఎన్నికల తర్వాత కొత్తగా భారీ దాడులు చేపట్టేందుకు ఇప్పటివరకు ట్రూత్‌లో పోస్టులు చేయడమే కాని ప్రభుత్వపరంగా అధికారిక ప్రకటనలేదు. అదే జరిగితే ఇక మూడో ప్రపంచ యుద్ధం తరహా యుద్ధ వాతావరణం మధ్యప్రాచ్యాన్ని చుట్టేస్తుందని చెప్పకతప్పదు. ●



డొనాల్డ్ ట్రంప్

# ప్లాస్టిక్ రసాయనాల ప్రాణాంతక వల

**నందూరి రవిశంకర్**

ఆధునిక మానవ జీవితం ప్లాస్టిక్‌తో విడదీయరాని విధంగా ముడిపడిపోయింది. మనం ఉదయం లేచిన క్షణం నుండి రాత్రి పడుకునే వరకు ఉపయోగించే ప్రతి వస్తువులోనూ ఏదో ఒక రూపంలో ప్లాస్టిక్ అంతర్భాగమైంది. అయితే మనం ఎంతో సౌకర్యవంతంగా భావిస్తున్న ఈ ప్లాస్టిక్ వెనుక ఒక భయంకరమైన, నిశ్శబ్ద ప్రాణాంతక ప్రపంచం దాగి ఉందనే చేదు నిజం ఎన్విరాన్‌మెంటల్ జస్టిస్ ఫౌండేషన్ విడుదల చేసిన నివేదిక ద్వారా మరోసారి బాహాటమైంది. మనం తినే ఆహారాన్ని ప్యాక్ చేసే కంటైనర్ల నుండి, ధరించే దుస్తులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, చివరికి ఆసుపత్రులలో వాడే పరిశుభ్రమైన వైద్య సామగ్రి వరకు ప్రతిదానిలోనూ నిండియున్న రసాయనాలు మానవ మనుగడకే తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయి. ఎన్విరాన్‌మెంటల్ జస్టిస్ ఫౌండేషన్ అధ్యయనం ప్రకారం, ఆహారాన్ని ప్యాక్ చేయడానికి, బట్టలు, బొమ్మలు, ఇతర గృహ వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులను తయారు చేయడానికి ఉపయోగించే ప్లాస్టిక్ రసాయనాలలో ఏకంగా 93 శాతం మానవ ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తున్నాయి. రోజువారీ జీవితంలో ప్రజలు ఉపయోగించే ఐదురకాల ప్రధాన ప్లాస్టిక్‌లను విశ్లేషించిన ఈసంస్థ, విస్తుపోయే వాస్తవాలను ప్రపంచం ముందుకు తెచ్చింది. మనం తినే ఆహారం, తాగే నీటితో నేరుగా స్పర్శ కలిగే ప్లాస్టిక్ ఉత్పత్తులలో సుమారు 92 శాతం రసాయనాలు అత్యంత ప్రమాదకరమైనవిగాతేలాయి. పసి పిల్లలు అమాయకంగా నోట్లో పెట్టుకొని ఆడుకునే బొమ్మలలో దాదాపు 89శాతం అధిక ప్రమాదకర ప్లాస్టిక్‌లతో రూపుదిద్దుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పిల్లల బొమ్మలలో 90 శాతం ప్లాస్టిక్‌తోనే తయారవుతున్నాయని అంచనా. మనం రోజూ ధరించే దుస్తులలో సుమారు 93 శాతం ప్రమాదకరమైన రసాయనాలతో రూపుదిద్దుకుంటున్నాయి. నేడు లభిస్తున్న వస్త్రాలలో 60 శాతం వరకు ప్లాస్టిక్ ఆధారిత సింథటిక్ ఫ్యాబ్రిక్‌లతోనే తయారవుతున్నాయి. బాటిల్ నీరు, వంటసామగ్రి, భోజన పాత్రలు, తోట పని పరికరాలు, టాయిలెట్ సామగ్రి, కార్యాలయ వస్తువులు వంటి 92శాతం కంటే ఎక్కువ గృహోపకరణాలలో అత్యంత విషపూరిత రసాయనాలు ఉన్నాయి. అత్యంత శుభ్రమైనవిగా, ప్రాణరక్షకాలుగా భావించే వైద్య సంబంధ ప్లాస్టిక్ పరికరాలలో కూడా 93 శాతం ప్రమాదకర రసాయనాలే ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. అత్యంత విచారకరమైన విషయమేమిటంటే, మనం అనునిత్యం ఉపయోగించే ప్లాస్టిక్ ఉత్పత్తులలోని రసాయనాల కూర్పుగురించి ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి కూడా పూర్తిస్థాయి సమాచారం లేదు. ప్రజలు నిత్యం వాడే ప్లాస్టిక్‌లలోని 3,552 రసాయనాలలో సుమారు 80 శాతం రసాయనాల ప్రమాదాన్ని స్పష్టంగా నిర్ధారించే డేటా లేదా సమాచారం లభ్యం కావడం లేదు. వినియోగదారులురోజూవాడే ఉత్పత్తులలో ఉన్న చాలా రసాయనాల పేర్లు, వాటి లోపలి రసాయన నిష్పత్తులు అసలు బహిరంగంగా తెలియవు. 2024లో అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం చేపట్టిన సమగ్ర అధ్యయనంలో పరిశోధకులు ప్లాస్టిక్‌లో దాదాపు 16,000 రసాయనాలను గుర్తించారు. వీరి పరిశోధనలో దాదాపు 4,200 రసాయ నాలు మానవ ఆరోగ్యానికి, పర్యావరణ వ్యవస్థకు ప్రత్య క్షంగా అత్యంత ప్రమాదకరమైనవిగా నిర్ధారించబడ్డాయి. మిగిలిన 10,000 కంటే ఎక్కువ రసాయనాలకు సం బంధించి ఎలాంటి భద్రతా సమాచారం, డేటా అందుబాటు లో లేకపోవడం శాస్త్రరంగాన్ని సైతం విస్మయానికి గురి చేస్తోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా రసాయన పరిశ్రమల వద్ద 3,25,000 సింథటిక్ రసాయనాలు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిలో గరిష్టంగా 20శాతం రసాయనాలకు సంబంధించిన విశ్లేషణ లేదా సమాచారం మాత్రమే మార్కెట్‌లో అందుబాటులో ఉంది. ప్లాస్టిక్ రసాయనాల వల్లమానవ శరీరానికి జరిగే నష్టం ఊహాకందనిది. ప్లాస్టిక్ కంటైనర్లు ప్యాకేజింగ్ ద్వారా ఆహారంలోకి చేరే పిఎఫ్ఎఎస్, థాలేట్స్ వంటి అత్యంత ప్రమాదకరమైన విషపదార్థాలు నేరుగా మానవ శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ రసాయనాలు మానవ కణాలలో జన్యుపరమైన మార్పులకు కారణమవుతూ, రకరకాల క్యాన్సర్ వ్యాధులకు దారితీస్తున్నాయి. ప్లాస్టిక్‌లో వాడే థాలేట్స్ అనే రసాయనం వల్ల సంభవించే గుండె జబ్బుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా వేలాది మంది అకాల మరణం చెందుతున్నారు. పిఎఫ్ఎఎస్ రసాయనం కలిగించే విపరీతమైన అనారోగ్యాల కారణంగా ఒక్క అమెరికాలోనే ఏటా అనేక బిలియన్ డాలర్ల వైద్య ఖర్చులు అవుతున్నాయని లెక్కలు చెబుతున్నాయి. ప్లాస్టిక్ రసాయనాలు మానవ శరీరంలోని నాచురల్ హార్మోన్ల వ్యవస్థకు అంతరాయం కలిగిస్తాయి. దీని ఫలితంగా విపరీతమైన ఊబకాయం, తక్కువ బరువుతో శిశువులు జన్మించడం, గర్భధారణ సమయంలో మహిళల్లో మధుమేహం, పిల్లలలో పుట్టుకతో వచ్చేలోపాలు, తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలు పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతినడం వంటి దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. నేటి సమాజంలో వినియోగదారుడికి ప్లాస్టిక్ తప్పించుకునేప్రత్యామ్నాయం లేకుండా పోయింది. ఉదాహరణకు, అమెరికా సూపర్ మార్కెట్లలో విక్రయించే 80 శాతం కంటే ఎక్కువ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు ఒకేసారి వాడి పారేసే ప్లాస్టిక్‌లలోనే చుట్టి రావడం దీని వ్యాప్తికి అద్దంపడుతోంది. వంటగదిలోని గిన్నెలు, పాత్రలు, ఆహారం దాచే బాక్సులు, లంచ్ బాక్సులు, ఫర్నీచర్ వరకూ ప్రతి ఉత్పత్తిలోనూ రసాయన సమ్మేళనాలు దాగి ఉన్నాయి. భవిష్యత్తులో ఈ పరిస్థితి మరింత భయానకంగా మారనుంది. ప్రస్తుతం ప్రపంచంలో ప్రతి ఏటా 430 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ప్లాస్టిక్ ఉత్పత్తులు తయారవుతున్నాయి. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, రాబోయే 2050నాటికి ఈ ప్లాస్టిక్ ఉత్పత్తి రెట్టింపు కంటే ఎక్కువ స్థాయికి పెరుగుతుంది. దాంతో పాటు మరో రెండు బిలియన్ మెట్రిక్ టన్నుల రసాయన ప్లాస్టిక్ సంకలితాలు పర్యావరణంలోకి, మానవ ఆహార గొలుసులోకి వచ్చి చేరుతాయి. ప్లాస్టిక్ రసాయనాల వల్ల ముంచుకొస్తున్న ఈ ప్రపంచ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని అరికట్టడానికి ప్రపంచ దేశాలు, ప్రభుత్వాలు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. ప్లాస్టిక్ సింథటిక్ ఉత్పత్తులలో ఉపయోగించే ప్రతి రసాయనం పేరును, దాని తీవ్రతను కచ్చితంగా ప్యాకింగ్‌పై నమోదు చేసేలా చట్టపరమైన నిబంధనలు తీసుకురావాలి. ప్రమాదకరమని తేలిన4,200కుపైగా రసాయనాలను, పీఎఫ్ఎఎస్, థాలేట్స్ వంటి కాంపౌండ్లను వినియోగ వస్తువులలో వాడకుండా అంతర్జాతీయ స్థాయిలో నిషేధించాలి. భద్రతా డేటా లేని రసాయనాలను మార్కెట్లోకి అనుమతించకూడదు. ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌కు బదులుగా గాజు, మట్టి, స్టెయిన్‌లెస్ స్టీల్, మరియు బయోడిగ్రేడబుల్ సహజ సిద్ధమైన ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తేవాలి. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లు, కంటైనర్లలో ప్యాక్ చేయడం, మైక్రోవేవ్‌లో ప్లాస్టిక్ పాత్రలను వాడటం, పిల్లలకు విషపూరిత ప్లాస్టిక్ బొమ్మలను కొనివ్వడంవంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. మానవ పురోగతి పేరుతో మనం సృష్టించుకున్న ప్లాస్టిక్‌భూతం, ఇప్పుడు మన ఉనికినే ప్రశ్నిస్తోంది. నిశ్శబ్దంగా మన శరీరాల్లోకి ప్రవేశిస్తూ తరతరాలఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న ఈ విష రసాయనాల వల నుండి బయటపడకపోతే, రాబోయే తరాలకు మనం అందించేది ప్లాస్టిక్ రహిత భవిష్యత్తు కాదు, కోలుకోలేని అనారోగ్యాల శ్మశాన వాటిక మాత్రమే. ఇప్పటికైనా ప్రపంచ నేతలు, పాలకులు, రసాయన పరిశ్రమలు స్పందించి కఠినమైన నిబంధనలతో ప్లాస్టిక్ విషసంస్కృతికి అడ్డుకట్ట వేయాలి. ●



# టర్కీ డ్రగ్ కింగ్‌పిన్‌ను భారత్‌కు తీసుకొచ్చాం!

## కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** టర్కీలో ఉంటున్న డ్రగ్స్ అక్రమ వ్యాపారి నవ్‌ప్రీత్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం ఇండియా తీసుకువచ్చింది. ఈ మేరకు టర్కీ ప్రభుత్వాన్ని కేంద్రం ఒప్పించింది. ఈ విషయాన్ని కేంద్రం హోం మంత్రి అమిత్ షా శనివారం వెల్లడించారు. మోడీ అధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అక్రమ డ్రగ్స్ వినియోగాన్ని ఎంతమాత్రం సహించబోదన్నారు. 2029లోపు దేశంలో డ్రగ్స్ ముఠాలను అంతం చేయాలనేది మోడీ ప్రభుత్వ లక్ష్యమని అమిత్ షా అన్నారు. ఇప్పటికే నవ్‌ప్రీత్ సింగ్‌ను ఇండియా తీసుకొచ్చామని, ప్రస్తుతం అతడిని విచారిస్తున్నామని అమిత్ షా తెలిపారు. నవ్‌ప్రీత్ అంతర్జాతీయ డ్రగ్స్ డీలర్. ఆఫ్ఘనిస్తాన్ నుంచి హెరాయిన్ సహా విలువైన, అత్యంత ప్రమాదకరమైన డ్రగ్స్‌ను అతడు ఇండియా, టర్కీలకు సరఫరా చేస్తుంటాడు. ఇందుకోసం పెద్ద నెట్‌వర్క్ నిర్వహిస్తున్నాడు. అక్రమ డ్రగ్స్ వ్యాపారంలో ఎప్పటినుంచో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇండియాకు కూడా భారీ స్థాయిలో నిషేధిత మత్తు పదార్థాల్ని రవాణా చేస్తుంటాడు. ఇండియన్ అయిన అతడు ఇక్కడి నుంచి టర్కీ పారిపోయాడు. అక్కడ నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించుకున్న నవ్‌ప్రీత్ సింగ్ టర్కీలో నవాబ్ విర్క్‌గా చెలామణి అవుతున్నాడు. దొంగ పత్రాలతో టర్కీ పౌరసత్వం తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో అతడి స్థావరాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అతడిని ఇండియా తీసుకొచ్చేందుకు ప్రయత్నించింది. ఈ అంశంపై టర్కీ ప్రభుత్వంతో చర్చలు జరిపింది. దీనికి టర్కీ అంగీకరించింది. దీంతో అతడిని కేంద్రం ఇండియా తీసుకొచ్చింది. నవ్‌ప్రీత్ సింగ్ చేసిన నేరాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. నవ్‌ప్రీత్ సింగ్ ఇండియాకు అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తుండగా ఇండియాలో అతడి దగ్గరి బంధువు ప్రభ్‌దీప్ సింగ్ ఈ డ్రగ్స్ రవాణా, వ్యాపారంలో పాలుపంచుకుంటాడు. ప్రభ్‌దీప్ సింగ్‌ను గత మే లోనే దర్యాప్తు సంస్థలు ఇండియా తీసుకొచ్చాయి. అతడిపై రెడ్ నోటీస్ ఉండటంతో అజార్‌బైజాన్‌లో పట్టుబడ్డాడు. దీంతో ఢిల్లీ పోలీసులు, సీబీఐ, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ కలిసి అతడిని ఇండియా తీసుకొచ్చాయి.

## సుప్రీం జడ్జిలకే దిగువకోర్టు న్యాయమూర్తి సలహాలా?

### ఆగ్రహం వ్యక్తంచేసిన సుప్రీం బెంచ్ న్యాయమూర్తులు



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** సాధారణంగా దిగువ న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు దిశానిర్దేశం చేయడం, ఆదేశాలు జారీ చేయడం చూస్తుంటాం. ఎవరైనా ట్రయల్ కోర్టు జడ్జి దేశ అత్యున్నత న్యాయస్థానానికే సలహాలు ఇస్తే ఎలా ఉంటుంది సరిగ్గా అలాంటి అరుదైన, విస్తుపోయే ఘటనే ఇటీవలి విచారణలో చోటుచేసుకుంది. బెయిల్ ఎప్పుడు ఇవ్వాలి ఎప్పుడు ఇవ్వకూడదు అనే అంశంపై సుప్రీంకోర్టుకే ఉచిత సలహా ఇచ్చిన ఒక అదనపు జిల్లా కోర్టు సెషన్స్ న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ తరహా వ్యాఖ్యలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, దీనిపై వెంటనే తగిన వివరణ ఇవ్వాలని సదరు జడ్జిని ఆదేశించింది. విచారణ గడువు పెంపు కోసం లేఖ పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాస్ (బారాసత్) మూడో కోర్టుకు చెందిన అదనపు జిల్లా , సెషన్స్ జడ్జి ఈ వింత పరిస్థితికి కారణమయ్యారు. గత ఐదేళ్లుగా జైలులోనే విచారణ ఎదుర్కొంటున్న ఒక నిందితుడి బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు గత మే 11న తిరస్కరించింది. కేసు విచారణ చాలా నెమ్మదిగా సాగుతుండటంతో, రాబోయే మూడు నెలల్లోనే విచారణను పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. నిర్దేశిత సమయంలో విచారణ పూర్తి కాకపోవడంతో, మరికొంత సమయం కావాలంటూ అగస్టు 11న సదరు జడ్జి సుప్రీంకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. ఆ లేఖ వరకు బాగానే ఉన్నా, అందులోని చివరి రెండు పేరాల్లో బెయిల్ సూత్రాలపై సుప్రీంకోర్టుకే సలహాలు ఇస్తూ రాయడమే వివాదానికి మూలమైంది. జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుటకు ఈ లేఖ వచ్చింది. లేఖలోని అంశాలను చదివిన ధర్మాసనం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. కేసు విచారణకు అదనపు సమయం కోరుతూ ఒక జడ్జి లేఖ రాసిన తీరు తమను ఎంతగానో కలచివేసిందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ కోర్టు ఎప్పుడు బెయిల్ ఇవ్వాలి, ఎప్పుడు ఇవ్వకూడదనే విషయంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్ సలహాలు ఇవ్వడం ఏమాత్రం తగదని స్పష్టం చేశారు. లేఖలోని చివరి రెండు పేరాల్లో రాసిన వ్యాఖ్యలు అసందర్భంగా, ఆమోదయోగ్యం కాని రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ల్యాండ్ మార్క్ తీర్పులు చెప్పే అత్యున్నత స్థానంలో ఉన్న కోర్టుకే దిగువ కోర్టు జడ్జి సలహాలు ఇవ్వడంపై సుప్రీంకోర్టు సీరియస్‌గా స్పందించింది. ఆ లేఖలోని వివాదాస్పద వ్యాఖ్యలని తీవ్రంగా పరిగణిస్తూ, అసలు అటువంటి వ్యాఖ్యలు ఎందుకు రాయాల్సి వచ్చిందో సదరు ప్రిసైడింగ్ ఆఫీసర్ నుంచి తక్షణమే తగిన వివరణ సేకరించాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పరిణామం ఇప్పుడు న్యాయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## దళిత మహిళా అభ్యర్థిపై డిఎంకె స్టాలిన్ వ్యాఖ్యల దుమారం

### తీవ్ర నిరసన ప్రకటించిన టివికె



**చెన్నై, అక్టోబరు 3:** తమిళనాడులో డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ధరాపురం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికార టీవీకే అభ్యర్థి సత్యభామను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక దళిత మహిళా అభ్యర్థిని బాడీ షేమింగ్ చేశారంటూ అధికార పార్టీ మండిపోతోంది. స్టాలిన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ధరాపురం ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్టాలిన్, అధికార టీవీకేపై హార్స్ ట్రేడింగ్ ఆరోపణలు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తరఫున ధరాపురం నుంచి గెలిచిన సత్యభామ, కొద్ది వారాలకే తన పదవికి రాజీనామా చేసి టీవీకేలో చేరారు. ఇప్పుడు అదే స్థానం నుంచి టీవీకే అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆమె పార్టీ మార్పు వెనుక డబ్బు ప్రమేయం ఉందని ఆరోపిస్తూ స్టాలిన్ ప్రసంగించారు. “నిజానికి వ్యతిరేకంగా పనిచేసిన వారి అభ్యర్థిని ఇప్పుడు మీరంతా సూట్‌కేస్‌భామ అని పిలుస్తున్నారు. ఆమెకు పల్టీభామ అని మరో పేరు కూడా ఉంది. ఆ శరీరాకృతితో ఆమె ఎలా పల్టీ కొట్టారో నాకు అర్థం కావడం లేదని స్టాలిన్ వ్యాఖ్యానించారు. సత్యభామ శరీరాకృతిపై స్టాలిన్ చేసిన ఈ వ్యాఖ్యలపై టీవీకే తీవ్రంగా స్పందించింది. ఇది మహిళలను, దళిత సమాజాన్ని అవమానించడమేనని ఆ పార్టీ నేత, ఆరోగ్య మంత్రి అరుణ్ రాజ్ మండిపడ్డారు. స్టాలిన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఈ వివాదంపై స్పందించేందుకు డీఎంకే నేతలు నిరాకరించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏఐఏడీఎంకేకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో, అధికార పార్టీపై బేరసారాల ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే.

## ముదురుతున్న కాంగ్రెస్ సిజెపి మాటల యుద్ధం!



**ముంబయి, అక్టోబరు 3:** ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల తర్వాత, సీజేపీకాంగ్రెస్ మధ్య వివాదం చెలరేగింది. సీజే పీలోని నేతలు లిబ రల్ ఎకోసిస్టమ్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అభి జిత్ దీప్కేను లక్ష్యంగా చేసుకుని ఓ వర్గం ప్రచారం చేస్తోందని, సీజేపీ కో కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా మండిపడ్డారు. రాంకా ఎక్స్‌లో స్పందిస్తూ సెల్ఫ్ డిక్లేర్డ్ లిబరల్ ఎకో సిస్టమ్ అభిజీత్ దీప్కేను విమర్శించేందుకు యాక్టివేట్ అయిందని ఆరోపించారు. చాలా కాలం తర్వాత లక్షలాది భారతీయుల ఊహల్ని దీప్కే ఆకర్షించడాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. ఆ వర్గం ఎక్స్‌లోనే పనిచేస్తూ, తామే ప్రజాస్వామ్యానికి ఏకైక రక్షకులమని భావిస్తోందని విమర్శించారు. రాంకా వ్యాఖ్యల్ని సౌరవ్ దాస్ సమర్థించారు. బీజేపీకి చెందిన వారు కాకుండా మరో పార్టీకి చెందిన కొందరు భారత్, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మాదే అని భావిస్తున్నారని ఆరోపించారు. వారిని సెల్ఫ్ డిక్లేర్డ్ లిబరల్స్, రాజ్యాంగానికి సెల్ఫ్ డిక్లేర్డ్ థేకేదార్లు అంటూ సెటైర్లు వేశారు. ఈ వ్యవస్థ బీజేపీ ఎకోసిస్టమ్ కన్నా తీవ్రంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. డివైడ్ అండ్ రూల్ తరహా రాజకీయాలతో ప్రజల్ని విభజించలేరని అన్నారు. రాంకా, దాస్‌లు తమ వ్యాఖ్యల్లో ఏ పార్టీ పేరును ప్రస్తావించలేదు. అయినప్పటికీ ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఉద్దేశించినవిగా ఉన్నాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కౌంటర్ అటాక్ మొదలుపెట్టింది.

# ఫ్లైదుబాయి ఘటన ఉగ్రవాద చర్యలే!

## ధ్రువీకరించిన ఎమిరేట్స్ ప్రాసిక్యూటర్లు



**దుబాయి, అక్టోబరు 3:** సంచలనం సృష్టించిన ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న విమానంలో భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై సహ పైలట్ (కోపైలట్) హామామ్ అల్ హామామీ జరిపిన దాడి ఒక “ఉగ్రవాద చర్య“ అని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రాసిక్యూటర్లు శనివారం సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ బోయింగ్ 737 విమానం గాల్లో ఉండగా ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. విమానం సుమారు 34,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో, కోపైలట్ హామామ్ అల్ హామామీ తన ఉగ్ర ప్రణాళికను అమలు చేసేందుకు సిద్ధమయ్యాడు. కాక్‌పిట్‌లో ఉన్న క్రాష్ యాక్స్ విపత్కర పరిస్థితుల్లో వాడే గొడ్డలి తీసుకుని కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి తెగబడ్డాడు. ఆ సమయంలో విమానం నియంత్రణ కోల్పోయి నిమిషానికి 23,000 అడుగుల వేగంతో కిందకి పడిపోవడం ప్రారంభించింది. క్షణాల్లో 15,600 అడుగుల ఎత్తుకు చేరుకుంది. అయితే, ప్రాణాపాయ స్థితిలోనూ కెప్టెన్ స్మిత్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. కోపైలట్‌తో పోరాడుతూనే కాక్‌పిట్ డోర్‌ను తెరిచారు. దీంతో విమాన సిబ్బంది, ప్రయాణికులు వెంటనే స్పందించి కోపైలట్‌ను పట్టుకుని బంధించారు. ఆ సమయంలో విమానంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు పైలట్ల సహాయంతో కెప్టెన్ స్మిత్ విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ నగరంలో సురక్షితంగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. కెప్టెన్ సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై యూఏఈ అటార్నీ జనరల్ హామద్ సైఫ్ అల్ షమ్సీ ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. ఈ దాడి వెనుక ఉన్న ఉగ్రవాద సంబంధాలపై ప్రత్యేక బృందం విచారణ జరుపుతోంది. నిందితుడు హామామ్ అల్ హామామీ సొంత దేశమైన ఒమన్‌లోనే తీవ్రవాద భావజాలం కారణంగా విమానాలు నడపకుండా నిషేధానికి గురైనట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. చాలాకాలం సిరియాలో గడిపిన హామామ్, అక్కడ ఉగ్రవాద భావజాలానికి ఆకర్షితుడై, ఆ తర్వాత యూఏఈకి వచ్చినట్లు తెలుస్తోంది. కేవలం 8 నెలల క్రితమే ఫ్లైదుబాయ్‌లో చేరిన హామామ్, అంతకుముందు ఒమన్ ఎయిర్, రాయల్ ఎయిర్ మరోక్ సంస్థల్లో పనిచేశాడు. ఘటన జరిగిన కొన్ని గంటల ముందు అతని సోషల్ మీడియా ఖాతాల్లో ఉగ్రవాదానికి సంబంధించిన పోస్టులు కనిపించాయి.

ఇజ్రాయెల్ విమానాన్ని జూమ్ చేస్తూ తీసిన వీడియో, అల్‌ఖైదా నాయకుడు అల్‌జవహరీ చిత్రాలు, మక్కా, మదీనా, జెరూసలేం పవిత్ర స్థలాలతో కూడిన ఏఐజనరేటెడ్ చిత్రాన్ని పోస్ట్ చేయడం అతని ఉగ్రవాద ఆలోచనా విధానానికి అద్దం పడుతోంది. ప్రస్తుతం హామామ్ నేపథ్యం, అతని ఉగ్రవాద సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ క్లిష్ట సమయంలో సహకరించిన సౌదీ అరేబియా అధికారులకు యూఏఈ కృతజ్ఞతలు తెలిపింది.

## కెప్టెన్‌స్మిత్‌ను స్వయంగా కలిసి పరామర్శించిన ఎమిరేట్స్ యువరాజు



**దుబాయి, అక్టోబరు 3:** ప్రాణాలను లెక్కచేయకుండా విమానంలోని 174 మందిని కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను దుబాయ్ యువరాజు షేక్ హామ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. దుబాయ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న స్మిత్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్మిత్‌ను కలిసిన అనంతరం యువరాజు ఆయన ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్మిత్‌పై తమకు పూర్తి గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు. యూఏఈ నాయకత్వం కూడా ఆయనను గర్వంగా చూస్తోందని చెప్పారు. స్మిత్ యూఏఈ విలువలకు ప్రతీకగా నిలిచారని యువరాజు పేర్కొన్నారు. దయ, శాంతి, మానవ ప్రాణాలకు విలువ ఇచ్చే దేశంగా యూఏఈ నిలుస్తుందని చెప్పారు. స్మిత్‌తో మాట్లాడుతున్న ఫొటోలను యువరాజు సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న దృశ్యాలు కూడా అందులో కనిపించాయి. విమానంలో సహ పైలట్ దాడి చేయడంతో స్మిత్ తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన సహ పైలట్‌ను అడ్డుకునేందుకు ఆయన గాయాలతో వీరోచితంగా పోరాడారు. అనంతరం కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనలో విమానంలోని 174 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడటంలో స్మిత్ కీలక పాత్ర పోషించారు. గాయాల మధ్య కూడా ఆయన చూపిన ధైర్యంపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి.

## మిగ్23 విమానంపైకి ఎక్కి లవ్లీ విద్యార్థుల నిరసన



**జలంధర్, అక్టోబరు 4:** పంజాబ్‌లోని జలంధర్‌లో ఉన్న లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో సెప్టెంబర్ 27, 28వ తేదీన విధ్వంసం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. వర్సిటీకి చెందిన ఓ అమ్మాయిని బయటి వ్యక్తులు రేప్ చేశారన్న ఆరోపణలపై అక్కడ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. క్యాంపస్‌లో ఉన్న ఓ యుద్ధ ట్యాంకర్‌తో పాటు మిగ్23 యుద్ధ విమానంపైకి విద్యార్థులు ఎక్కి నిరసన చేపట్టారు. అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నది. అత్యాచారానికి పాల్పడిన బయటి వ్యక్తులను అరెస్టు చేయాలని కోరుతూ విద్యార్థులు భారీ విధ్వంసాన్ని సృష్టించారు. వర్సిటీలో ఉన్న ఫర్నీచర్, వాహనాలకు నిప్పు పెట్టారు. అయితే ఆ సమయంలో మిగ్23పైకి ఓ బాలుడు ఎక్కాడు. ఆ ఫొటో, వీడియోలు వైరల్ అయ్యాయి. ఆ కేసులో ఆ చిన్నారిని అరెస్టు చేసినట్లు జలంధర్ పోలీసులు చెప్పారు. ఆ కుర్రాడు హిమాచల్ ప్రదేశ్‌లోని మండీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఎల్‌పీయూ విధ్వంసం కేసులో అరెస్టు అయిన వారిలో వర్సిటీ విద్యార్థులు ఏమ్స్ దహియా, ఆశుతోష్, అంత్రిక్ష దత్, సాహిల్ సింగ్, కృష్ణ కుమార్, భవిష్య కరణ్ ఉన్నారు. పిజా డెలివరీ బాయ్స్ గగన్‌దీప్, జస్మీత్ కుమార్ కూడా అరెస్టు అయినవారిలో ఉన్నారు. లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీలో జరిగని విధ్వంసానికి కారణమైన 40 మందిని గుర్తించారు. దాంట్లో బీబీఏ విద్యార్థి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఫర్హాత్ దేవ్ ఉన్నాడు. అతనికి ఇన్‌స్టాగ్రామ్‌లో 21 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. నిరసన సమయంలో ఫర్హాత్ వీడియోలు వైరల్ అయ్యాయి. అయితే అతన్ని ఇంకా అరెస్టు చేయలేదని పోలీసులు చెప్పారు. అత్యాచారానికి గురైన బాధితురాలిని ఇంకా గుర్తించలేదని జలంధర్ రేంజ్ డీఐజీ నవీన్ సింగ్లా తెలిపారు. వర్సిటీ స్టాఫ్, స్టూడెంట్స్, వార్డెన్లు.. అందర్నీ ప్రశ్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

## జిన్‌పింగ్ ఆరోగ్యంపై మరోసారి కలకలం!

బీజింగ్, అక్టోబరు 3: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్యంపై అంతర్జాతీయ స్థాయిలో మరోసారి చర్చ మొదలైంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన వాషింగ్టన్ సమ్మిట్ సందర్భంగా చైనా అధికారులు చేసిన కొన్ని అసాధారణ ఏర్పాట్లు ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. 73 ఏళ్ల జిన్‌పింగ్ తీవ్రమైన అలసటతో ఉన్నారని, పర్యటన మధ్యలో ఆయనకు ప్రత్యేక విశ్రాంతి అవసరమైందంటూ గ్లోబల్ మీడియాలో కథనాలు సంచలనం సృష్టిస్తున్నాయి. రెండు అగ్రదేశాల అగ్రనేతల భేటీలో ముందెన్నడూ లేని విధంగా షెడ్యూల్‌ను కుదించడం, స్పెషల్ బ్రేక్స్ ఇవ్వడంపై దౌత్య వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ఐదు గంటల గ్యాప్ ప్రత్యేక గది ఏర్పాటు సమ్మిట్ సమయంలో జిన్‌పింగ్ విశ్రాంతి కోసం వైట్ హౌస్ వెస్ట్ వింగ్‌లో ఒక ప్రైవేట్ రూమ్‌ను కేటాయించాలని చైనా ప్రతినిధులు కోరినట్లు సమాచారం. ఆ గదిలోకి కేవలం ఆయన భార్య పెంగ్ లియువాన్‌ను మాత్రమే అనుమతించారు. చైనా ప్రతినిధి బృందంలోని కీలక అధికారులకు కూడా అక్కడ ప్రవేశం లేకపోవడం గమనార్హం. అంతేకాకుండా, ట్రంప్‌తో ముందుగా అనుకున్న వర్కింగ్ లంచ్‌ను కూడా రద్దు చేయించి, దాదాపు ఐదు గంటల పాటు జిన్‌పింగ్‌కు ఖాళీ సమయం ఇచ్చేలా షెడ్యూల్ మార్చారు. అమెరికా నేషనల్ ఆర్కైవ్స్ సందర్శనను కూడా కేవలం 10 నిమిషాలకే కుదించడం, ఆయన ఎక్కువసేపు నుంచోలేకపోవడమే కారణమనే ప్రచారం జరుగుతోంది. అమెరికాలో అడుగుపెట్టిన సమయం నుంచి జిన్‌పింగ్ శారీరక కదలికలను నిపుణులు నిశితంగా పరిశీలించారు. విమానం మెట్లు దిగేటప్పుడు ఆయన ఒకచేతితో భార్య చేయి పట్టుకుని, మరోచేతితో విమానం సైడ్ రైలింగ్‌ను గట్టిగా పట్టుకుని నడవడం కనిపించింది.

## కాంగ్రెస్ నిరసనలన్నీ ఒకే డిజిటల్ వేదికపైకి...

## సత్యాగ్రహ పోర్టల్ ప్రారంభించిన రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కొత్త డిజిటల్ వేదికను మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా పలు సమస్యలపై ప్రజలు, విద్యార్థులు, రైతులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, ఇతర వర్గాలు చేపడుతున్న నిరసనలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో సత్యాగ్రహ పేరుతో ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మహాత్మా గాంధీ జయంతి తర్వాతి రోజున ఈ సత్యాగ్రహ డిజిటల్ వేదికను రాహుల్ గాంధీ ప్రారంభించడం గమనార్హం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. అయితే చాలా సందర్భాల్లో ఆయా పోరాటాలు విడివిడిగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఉద్యమాలను ఒకే చోటికి తీసుకురావడమే సత్యాగ్రహ వేదిక ఉద్దేశమని తెలిపారు. ఈ సత్యాగ్రహ పోర్టల్‌లో తమ నిరసనలు, ఉద్యమానికి సంబంధించిన వివరాలను ప్రజలు నమోదు చేసుకోవచ్చని రాహుల్ గాంధీ సూచించారు. ఉద్యమం ఏ అంశంపై జరుగుతోంది.. ఎవరు నిర్వహిస్తున్నారు వంటి వివరాలను నమోదు చేస్తే అవి డిజిటల్ మ్యాప్‌లో కనిపించేలా ఈ సత్యాగ్రహ వేదికను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ ప్లాట్‌ఫామ్‌లో 150కిపైగా వివరాలు నమోదైనట్లు తెలుస్తోంది. భూమి సమస్యలు, మహిళల హక్కులు, దళితులు, ఓబీసీల హక్కులు, విద్య, పరీక్షలు వంటి అంశాలపై దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ తెలిపారు. ఇలాంటి ఉద్యమాలన్నింటినీ ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి.. ఒకే అంశంపై పోరాడుతున్న ఇతర వ్యక్తులు, సంఘాలతో వారిని అనుసంధానం చేయడమే లక్ష్యమని రాహుల్ గాంధీ వివరించారు. మీరు కూడా ఏదైనా అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే మీ కథను పంచుకోండి. మీ నిరసన ఈ మ్యాప్‌లో చోటు పొందుతుంది. మీలాంటి సమస్యపై ఎవరు పోరాడుతున్నారో కూడా తెలుసుకోవచ్చు అని రాహుల్ గాంధీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా సత్యాన్ని అణచివేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. వివిధ ప్రాంతాల్లో అనేక నిరసనలు జరుగుతున్నాయని, వాటిని ఒకచోట చేర్చి సంబంధిత ఉద్యమకారులతో కలిసి పనిచేయాలనేది తన ఉద్దేశమని వీడియో సందేశంలో రాహుల్ గాంధీ తెలిపారు. మహాత్మా గాంధీని ప్రస్తావిస్తూ సత్యమే మన గొప్ప ఆయుధమని, అయితే సత్యం పక్షాన ప్రజలంతా కలిసి నిలబడటం మరింత శక్తివంతమైనదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తమ సమస్యలపై పోరాడుతున్న వారు సత్యాగ్రహవెబ్‌సైట్‌లో ఫారం నింపి తమ ఉద్యమాన్ని నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

## సమాజ్‌వాది కాంగ్రెస్‌మధ్య సీట్ల లొల్లి



**లక్నో, అక్టోబరు 3:** ఉత్తర్ ప్రదేశ్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల వేళ సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) కాంగ్రెస్ మధ్య సీట్ల లెక్కల్లో విభేదాలు తలెత్తుతున్నాయి. రెండు పార్టీల మధ్య సీట్ల బేరాలు కుదరడం లేదు. కాంగ్రెస్ ఎక్కువ సీట్లను డిమాండ్ చేయడంపై ఎస్పీ నేతలు ఫైర్ అవుతున్నారు. రాష్ట్రంలోని 403 స్థానాల్లో కనీసం 150 సీట్లలో పోటీ చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ప్రతిపాదనను ఎస్పీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తాజాగా కాంగ్రెస్ తీరుపై ఎస్పీ ఎంపీ ఎస్పీ సింగ్ పటేల్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్‌కు 150 సీట్లు ఇవ్వడం అటుంచి, 50 సీట్లు కూడా ఇవ్వడం పెద్ద విషయమే అని అన్నారు. యూపీలో కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో ఉన్న బలం, ఎంపీలుఎమ్మెల్యేల సంఖ్యను పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ యూపీ ఇన్‌చార్జ్ రాజేంద్ర పాల్ గౌతమ్ ఇటీవల మాట్లాడుతూ 2027 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలనుకుంటోంది అని అన్నారు. 403 సీట్లలో 50 శాతం సీట్లకు కాంగ్రెస్ హక్కుదారుగా ఉందని ఆయన అన్నారు. సీట్ల పంపకంపై అక్టోబర్‌లో క్లారిటీ రావొచ్చని అన్నారు. కాంగ్రెస్ ఈ ప్రతిపాదన ఎస్పీ నేతలకు రుచించడం లేదు. ఎస్పీ సింగ్ పటేల్ రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. రాయ్‌బరేలీలో తొలుత పోటీ చేయడానికి సిద్ధపడలేదని, అఖిలేష్ యాదవ్ ఒప్పించడంతో చివరకు పోటీ చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ అక్కడి నుంచి పోటీ చేయకపోతే ఎస్పీ పోటీ చేసేదని అన్నారు. కాంగ్రెస్‌కు గత ఎంపీ ఎన్నికల్లో ఎస్పీ వల్ల ప్రయోజనం చేకూరిందని అన్నారు.

## యువతిని వివస్త్రనుచేసి దాడిచేసిన బౌన్సర్లు

**గువాహతి, అక్టోబరు 3:** అసోం రాజధాని గువాహటిలోని ఒక ప్రముఖ నైట్‌క్లబ్‌లో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. ఖానాపారా ప్రాంతంలోని లోకల్స్ కేఫ్ అండ్ లాంజ్‌లో గురువారం రాత్రి ఓ మహిళను వివస్త్రను చేసి, అమానుషంగా దాడి చేశారు. ఈ దాడిలో క్లబ్ బౌన్సర్లు కూడా పాల్గొన్నట్లు అక్కడున్న వారు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ వీడియోలో బాధితురాలు బట్టలు లేకుండా నేలపై పడి ఉండగా, ఇద్దరు మహిళలు ఆమెను కాలితో తన్నడం స్పష్టంగా కనిపించింది. వారి పక్కనే కొంతమంది పురుషులు కూడా ఉన్నారు. క్లబ్‌లోని నాలుగో అంతస్తు నుంచి ఆమెను బలవంతంగా కింద పార్కింగ్ ప్రాంతానికి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక వర్గాల సమాచారం ప్రకారం, క్లబ్‌లో ముందుగా ఆమెను నేలపైకి తోసేసి, బట్టలు విప్పి దాడి చేశారు.

ఈ దాడిలో స్త్రీ, పురుష బౌన్సర్లు ఉన్నారని అంటున్నారు. అయితే ఈ గొడవకు దారితీసిన కారణాలు, దాడికి ముందు ఏం జరిగిందనే దానిపై స్పష్టత లేదు. బాధితురాలి వివరాలు కూడా తెలియరాలేదు. ఈ ఘటనపై మీడియా ప్రతినిధులు నైట్‌క్లబ్‌కు వెళ్లగా, అది మూసివేసి ఉంది. క్లబ్ యాజమాన్యం నుంచి ఎవరూ మాట్లాడటానికి ముందుకు రాలేదు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# సంక్షిప్త వార్తలు

## 43వ అంతస్తు నుంచి దూకి యువకుడి మృతి

నోయిడా, అక్టోబరు 3: నోయిడా సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. దాదాపు 25 ఏళ్ల వయసున్న ఓ యువకుడు సెక్టార్ 94లోని సూపర్‌నోవా భవనంలోని 43వ అంతస్తు నుంచి దూకి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని హర్యానాలోని మానేసర్‌కు చెందిన సంభవ్ జైన్‌గా పోలీసులు గుర్తించారు. శుక్రవారం భవనంలోని ఓ ఎయిర్‌బీఎన్‌బీలో బస చేసిన అతడు శనివారం మధ్యాహ్నం బయటకు వెళ్లాల్సి ఉంది. అంతలోనే ఈ ఘటన జరిగింది. ఘటన సమయంలో మరో వ్యక్తి అతడిని ఆపేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. రైలింగ్ వద్ద నుంచి వెనక్కి లాగేందుకు ప్రయత్నించినా సంభవ్ వినలేదని చెప్పారు.

## అమెరికాలో హిందూ ఆలయంపై దుండగుల దాడి



**గ్రేటర్ క్లీవ్‌ల్యాండ్, అక్టోబరు 3:** అమెరికాలోని ఓ హిందూ ఆలయంపై దుండగులు దాడికి పాల్పడ్డారు. ఒహాయో రాష్ట్రంలోని గ్రేటర్ క్లీవ్‌ల్యాండ్ ప్రాంతంలో ఉన్న శ్రీ స్వామినారాయణ్ హిందూ టెంపుల్ వడ్తాళ్‌ధామ్‌పై శుక్రవారం మధ్యాహ్నం ఇటుకలతో దాడి చేశారు. ఆలయ భవనానికి నష్టం వాటిల్లింది. కిటికీలు ధ్వంసమయ్యాయి. ఘటన జరిగిన సమయంలో ఆలయంలో పూజారులు, కొందరు భక్తులు ఉన్నారు. అయితే ఎవరికైనా గాయాలయ్యాయా? లేదా? అన్నది స్పష్టంగా తెలియలేదు.

## దోడా వైద్యకళాశాలలో బురఖా వివాదం



**జమ్ము, అక్టోబరు 3:** జమ్మూకశ్మీర్ లోని దోడా ప్రభుత్వ వైద్య కళాశాలలో బురఖా వివాదం చెలరేగింది. గైనకాలజీ విభాగంలోని లేబర్ రూమ్‌లోకి బురఖా ధరించిన తమను అనుమతించలేదని ఆరోపిస్తూ నర్సింగ్ ఇంటర్న్‌లు, విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం స్పందించింది. విచారణకు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. సెప్టెంబర్ 30న కొందరు నర్సింగ్ విద్యార్థినులు విధులకు హాజరయ్యారు. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ మధు చిబ్, బురఖా ధరించిన కారణంగా తమను లేబర్ రూమ్‌లోకి రాకుండా అడ్డుకున్నారని విద్యార్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## శివాన్‌జిలిస్‌కు బ్రేకప్ చెప్పిన ఎలాన్ మస్క్



**న్యూయార్కు, అక్టోబరు 3:** టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్, ఆయన భాగస్వామి, టెక్ ఎగ్జిక్యూటివ్ శివాన్ జిలిస్‌తో తన సంబంధానికి ముగింపు పలికారు. ఈ విషయాన్ని శివాన్ జిలిస్ స్వయంగా ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండానే మస్క్ ఈ బంధాన్ని ముగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ మధ్య జరిగిన టెక్స్ట్ సంభాషణల స్క్రీన్‌షాట్‌లను కూడా ఆమె పంచుకున్నారు. వారం రోజుల వ్యవధిలో ప్రేమ నుంచి వీడ్కోలుకు రావడం చాలా కష్టం. కానీ కొన్నిసార్లు ఇలాగే జరుగుతుందని శివాన్ జిలిస్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## బాలీవుడ్ నటి నుస్రత్ భరూచాకు ప్రమాదం



**బాలి, అక్టోబరు 3:** బాలీవుడ్ నటి నుస్రత్ భరూచా ఇండోనేషియాలోని బాలిలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆమె వెన్నెముకకు ఫ్రాక్చర్ అయినట్లు ఆమె ప్రతినిధుల బృందం అధికారికంగా ప్రకటించింది. పని నిమిత్తం వెళ్లిన ట్రిప్‌లో ఈ ప్రమాదం జరగ్గా, ఆమెను వెంటనే బాలిలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్ ద్వారా నుస్రత్‌ను ముంబైకి తీసుకొచ్చారు. నుస్రత్ భరూచా బాలిలో ఒక వర్క్‌కమ్‌హాలిడే ట్రిప్‌లో ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాలి ఆసుపత్రిలో ప్రాథమిక పరీక్షల అనంతరం, ఆమె వెన్నెముకకు సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు.

# ‘కామన్ పాస్’తో బస్సెక్కిన మంత్రులు

## ప్రజాభవన్ నుంచి బస్సులో బేగంపేట మెట్రోస్టేషన్ తర్వాత జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దాకా రైలు..

### రవాణా అనుసంధానంపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్న డి.సిఎం భట్టి, మంత్రులు పొన్నం, వివేక్, అజారుద్దీన్, పలువురు ఎమ్మెల్యేలు



ఆర్టీసీ బస్సులో కామన్ పాస్‌తో ప్రయాణిస్తున్న డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ తదితరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 3, ప్రభాతవార్త:** ప్రజారవాణాను బలోపేతం చేయడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌తో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రయాణించారు. ప్రజాభవన్ నుంచి ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్న వారు, అక్కడి నుంచి మెట్రోలో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు, అనంతరం ఆర్టీసీ బస్సులో సచివాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడమే పరిష్కారమన్నారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమ, ఖర్చు ఆదా అవుతాయన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజారవాణా వైపు ఆకర్షించేందుకు ఆర్టీసీ, మెట్రో సేవలను మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈ ప్రయత్నమన్నారు. ప్రయాణికులతో మంత్రులు నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం, రవాణా అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్‌ను మరింత మెరుగుపరుస్తామన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజారవాణా కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రయాణికులపై ఎక్కువ భారం పడకుండా మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించడం లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. ఫస్ట్ మైల్ నుంచి లాస్ట్ మైల్ వరకు సులభమైన కనెక్టివిటీని అందించేందుకు చేపట్టిన సంస్కరణల్లో భాగంగా ఆర్టీసీ మెట్రో పాస్‌ను తీసుకొచ్చామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు 15 మంది మంత్రులకు భట్టి విక్రమార్క కామన్ పాస్‌లను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, శ్రీగణేష్, ఎమ్మెల్సీలు, ఎంపీలు, టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

# నాలుగోసారి అధికారానికి బిజెపి ఓట్ల తొలగింపు కుట్రలు

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్,అక్టోబరు 3,ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను అడ్డం పెట్టుకొని ఓట్లు తొలగించి నాలుగోసారి అధికారం నిలుపుకోవడానికి బిజెపి ఓట్ల తొలగింపు కుట్రలు చేస్తూ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేస్తోందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు ఆరోపించారు. శనివారం విలేఖరులతో మాట్లా డుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, కొత్తగా మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కర్ణా టకలో పదిహేనువేల ఓట్లు ఎందుకు తీసివేశారో సమాధానం ఇవ్వడం లేదని సర్ ప్రక్రియతో దేశ వ్యాప్తంగా 13కోట్ల ఓట్లు ఇప్పటివరకు తొలగించారనీ ఇలా నాలుగోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు.ఎన్‌డిఎ ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌ను తన గుప్పిట్లో పెట్టుకుందని విమర్శించారు. జనాభాలెక్కలు చేపట్టారుకానీ ఓబిసిల గణన విషయంలో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఒబిసి చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో ఆదివారం సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. సభకు అందరూ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు వస్తున్నారని ఆయన తెలిపారు. శంషాబాద్ సభ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఒబిసి గణన డిమాండ్ చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తూ పర్యటన చేస్తానని ప్రకటించారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలని ఆయన అధికారంలోకి వస్తే బిసిలకు రాజ్యాధికారంలో వాటా లభిస్తోందని చెప్పారు. సెన్సెస్‌లో కేంద్రం ఒబిసి ల కాలం చేర్చే వరకు పోరాటాన్ని కొనసాగించాలని హితవు చెప్పారు.

# భద్రాద్రి థర్మల్‌లో సాంకేతిక లోపం

### 15.5 కోట్ల యూనిట్ల విద్యుత్‌కు బ్రేక్

### 24 రోజులుగా మూడో యూనిట్‌లో నిలిచిన ఉత్పత్తి

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరత, సాంకేతిక సమస్యలతో పలు యూనిట్లు మూతపడుతుండటంతో విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మరోపక్క ఎల్‌నినో నేపథ్యంలో విద్యుత్‌కు డిమాండ్ పెరగడంతో రాష్ట్ర పంపిణీ సంస్థలు అంతర్జాతీయ ఎక్ఛేంజీలో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లా మణుగూరు సమీపంలోని ప్రతిష్ఠాత్మక భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ మూడో యూనిట్లో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. యూనిట్ 3కి చెందిన రోటర్ ఎక్సైటర్లో సాంకేతిక లోపం తలెత్తడంతో గత 24 రోజులుగా ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోజుకు 270 మెగావాట్ల సామర్థం కలిగిన ఈ ప్లాంట్లో ఉత్పత్తి ఆగిపోవడంతో ఈ 24 రోజుల వ్యవధిలోనే సుమారు 15.5 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి గండిపడింది. అత్యంత కీలకమైన ఈ పరికరంలో తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన స్పేర్ పార్ట్స్, విడి పరికరాలు రావడానికి మరో 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉందని ఇంజనీరింగ్ వర్గాలు వెల్లడించాయి. మరమ్మతులు పూర్తయితే తప్ప మూడో యూనిట్లో ఉత్పత్తి పునరుద్ధరణ సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ అంతరాయం ఉన్నప్పటికీ, ప్లాంట్లోని మిగిలిన 1, 2, 4వ యూనిట్లు పూర్తిస్థాయిలో పనిచేస్తుండటంతో రోజుకు 810 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతోంది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్కు ఎలాంటి కొరత రాకుండా మిగిలిన యూనిట్లను సమర్థవంతంగా నడుపుతూ గ్రిడ్ కు సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# నెలాఖరుకు యాదాద్రి థర్మల్ ఐదో యూనిట్

### తెలంగాణ ఉత్పత్తి సంస్థ సిఎండి డాక్టర్ హారీశ్

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్‌కు డిమాండ్ భారీగా పెరుగుతోందని తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ సిఎండి డాక్టర్ హారీష్ తెలిపారు. ఈ డిమాండ్‌ను అధిగమించేందుకు రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలను పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందులో భాగంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదో యూనిట్‌ను ఈ నెలాఖరుకల్లా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు యాదాద్రి థర్మల్ కేంద్రంలోని ఐదో యూనిట్‌లో యాష్ హ్యాండ్లింగ్, కోల్ హ్యాండ్లింగ్, బాయిలర్, టర్బైన్ విభాగాలను ఆయన బీహెచ్‌ఈఎల్ డైరెక్టర్ తజిందర్‌గుప్తాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ హారీష్ మాట్లాడుతూ పెండింగ్ పనులను వేగవంతం చేయడంతో పాటు, యూనిట్ 5 సింక్రనైజేషన్‌ను ఈనెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు

. రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని, యాదాద్రిలోని నాలుగు యూనిట్లను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించడంతో పాటు ఐదో యూనిట్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# వయసు పైబడింది.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో, లేదో!

### ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ (చాంద్రాయణగుట్ట), అక్టోబరు 3, ప్రభాతవార్త :** రాష్ట్ర రాజకీయాలలో తనదైన ముద్రవేసుకున్న ఆల్ ఇండియా మజ్లిస్- ఏ-ఇత్తేహాదుల్ ముస్లీమీన్ పార్టీ (మజ్లిస్) చాంద్రాయణగుట్ట నియోజక వర్గ శాసనసభ్యులు, శాసనసభలో మజ్లిస్ ఫ్లోర్‌లీడర్ అక్బ రుద్దీన్ ఒవైసీ తన రాజకీయ జీవితంపై అసక్తికర, సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తాను పోటీ చేస్తానో లేదో తెలియదన్నారు. ఆ కోరిక కూడా లేదన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

శుక్రవారం రాత్రి బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఒవైసీ కేజీ టూ పీజీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు చర్చణీయాంశంగా మారాయి. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తన వ్యక్తిగత జీవితం, విద్యాభ్యాసం, రాజకీయ జీవితంపై ఆసక్తికరంగా ప్రసంగించారు. ‘నాకు వయస్సు పైబడుతుంది, ముసలోడిని అవుతున్నా, వచ్చే ఎన్నికలలో పోటీ చేస్తానో లేదో తెలయదన్ని ..అసలు పోటీ చేయాలనే ఆలోచన కూడా తనకు లేదని స్పష్టం చేశారు. అయితే తనకు ఒక పాత కోరిక ఉంది. మీరు ఇంటర్మీ డియట్ చదివారు. డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబిబిఎస్ ఏదైనా చదవండి అయితే నేనే మీ వెంటే ఉండి ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్‌లుగా తయ్యారు చేస్తానన్నారు. మీరంతా చదువుతారు కదూ...అంటూ విద్యార్థులను ప్రశ్నించారు. తాను 10+2 వరకు మాత్రమే చదువుకున్నా...రాజకీయాలలో ప్రజల పక్షాన సమస్యలపై తన గొంతను బలంగా వినిపించానన్నారు. అది రాష్ట్ర సీఎంకు సమాధానం చెప్పే స్థాయికి ఎదిగిందన్నారు. విద్యార్థులు తమ ఆత్మ విశ్వాసాన్ని, పట్టుదలను పెంపొందించుకోవాలని, అందుకు తన అనుభవాలను వారితో పంచుకున్నారు. అయితే ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన సంచలన వ్యాఖ్యలతో రాబోయే శాసనసభ ఎన్నికలలో చాంద్రాయణగుట్ట శాసనసభ నియోజక వర్గానికి మజ్లిస్ పార్టీ అభ్యర్థి ఎవరన్నది ప్రస్తుతం చర్చణీయాంశంగా మారింది. ఈ క్రమంలో ప్రధానంగా అతని కుమారుడు డాక్టర్ నూరుద్దీన్ ఒవైసీ పేరు బలంగా వినిపిస్తోంది.

# మాతృ భాషే మనకు శ్వాస.. మరువరాదు

### సంస్కృతి పరిరక్షణకు ధర్మపీఠంలా తెలుగు విశ్వవిద్యాలయం:

### ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరబాద్ (నాంపల్లి), అక్టోబరు 3, ప్రభాతవార్త:** తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలు కేవలం డిగ్రీల కర్మాగారాలు కాకుండా తెలుగుభాషా సంస్కృతులకు ప్రేరణ కేంద్రాలుగా తెలుగుజాతికి సాంస్కృతిక ధర్మ పీఠాలుగా వర్ధిల్లాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. మాతృభాష శ్వాసలాంటిదని భాషపోతే శ్వాసపోతుందన్నారు. తెలుగు కన్న అమ్మభాషగా వెలుగుతూ ఉండాలని, తల్లిదండ్రులు పిల్లలకు విధిగా తెలుగుభాష ప్రాచీన కళలను నేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ తమ మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోరాదని స్పష్టం చేశారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవావిభాగం ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికిగాను ఎంపికైన ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎం.వెంకయ్యనాయుడు రిజిస్ట్రారు ఆచార్య కోట్ల హనుమంతరావుతో కలిసి ఎంపికైన 12మంది ప్రముఖులను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారంతోపాటు ఒక్కొక్కరికి 30,116 రూపాయల నగదును బహూకరించి ప్రసంగించారు. పొట్టి శ్రీరాములు, సురవరం ప్రతాపరెడ్డి ఇరువురు మహనీ యులని, వారిపేర్లమీద తెలుగు విశ్వవిద్యాలయాలు కొనసాగడంతో వారిపేర్ల చిరస్థాయిగా నిలిచిపోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతిభా పురస్కారాలు అందించడమంటే కేవలం ఆయా వ్యక్తులను సత్కరించడమేకాదు ఆయారంగాల్లో విశేష కృషిచేసి తమ ప్రతిభా విశేషాలతో సమాజాన్ని ప్రభావితం చేస్తున్నతీరు సృజనాత్మకత నేటితరానికి, భావితరానికి మరింత స్ఫూర్తినివ్వాలన్నది ముఖ్యోద్దేశమన్నారు. మనం ఎంత అభివృద్ధి చెందినా సాంకేతికంగా విప్లవాలు సాధించినా మన మూలాలను మరచిపోరాదని హితవుపలికారు. ప్రాథమిక విద్యలో తెలుగుభాషకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని ఉభయ తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కృత్రిమ మేధస్సును ఉపయోగించి తెలుగుభాషను డిజిటల్ మాధ్యమాల్లో విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, జానపదకళలు, ఆయాప్రాంతాల మాండలికాలపై మరింత లోతైన పరిశోధనలు జరగాలని ఎం.వెంకయ్యానాయుడు సూచించారు.

రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు స్వాగతోపన్యాసం కావించి పురస్కార గ్రహీతలను వేదికపైకి ఆహ్వానించి తెలుగు విశ్వవిద్యాలయం భాష సాహిత్యరంగాలకు చేస్తున్న కృషిని వివరించారు. నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో పురస్కార ఎంపిక విధానాన్ని, పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారిలో కోట్ల వెంకటేశ్వరరెడ్డి కవితా విభాగం; ఆచార్య ఎన్.భక్త వత్సలరెడ్డి విమర్శ; కూరెళ్ల శ్రీనివాస్ చిత్రలేఖనం; ఎ.ఎస్.ప్రకాష్ శిల్పం; డా.హెచ్.అనిత నృత్యం; దుద్దు సీతారామయ్య సంగీతం; డా.వై.నాగే శ్వరరావు పత్రికారంగం; సురభి వెంగమాంబ నాటక రం గం, తూర్పాటి సాలమ్మ జానపదకళారంగం; డా. ఎం. వి.పట్వర్ధన్ అవధానం; ఆచార్య కాత్యాయని విద్మహే ఉత్తమ రచయిత్రి; కస్తూరి మురళీకృష్ణ నవల విభాగంలో ఉన్నారు.




శనివారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారితో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, వర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు

# బియ్యం ఇవ్వండి లేదా ఆస్తులు కోల్పోవడానికి సిద్ధపడండి

### 5న సివిల్ సప్లైస్ అధికారులకు ప్రత్యేక శిక్షణ

### రైస్‌మిల్ మొండి బకాయిదారుల కట్టడికి కొత్త కఠినచట్టాలు

### పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



శనివారం పౌర సరఫరాల కార్యాలయంలో సిఎంఆర్ మొండి బకాయి రైసు మిల్లర్లపై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్ అక్టోబరు 3,ప్రభాతవార్త:** బియ్యం మొండిబకాయి రైస్ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని తిరిగి ఇవ్వండి, లేదా మీ ఆస్తులను కోల్పోవడానికి సిద్ధపడండి అంటూ సివిల్ సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టమైన హెచ్చరిక చేశారు. సివిల్ సప్లయ్ కార్యాలయంలో సిఎంఆర్ మొండిబకాయి రైసుమిల్లర్లపై సమీక్ష చేస్తూ ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వానికి ధాన్యం ఇవ్వకుండా బకా యి పడ్డ రైస్ మిల్లర్లకు నుంచి ధాన్యం రాబట్టకోవడానికి రెవెన్యూ రికవరీ చట్టంతో డబ్బు వసూలు చేయడానికి పౌర సరఫరాల శాఖ ఒక స్పెషల్ డ్రైవ్ ప్రారంభించబోతుందని తెలిపారు. చట్టపరంగా ఆస్తులను ఎలాంటి లోపాలు లేకుండా జప్తు చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పౌర సరఫరాల అధికారులకు ఈ నెల 5 నుండి డాక్టర్ మర్రిచెన్నారెడ్డి ఇన్‌స్టిట్యూట్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందనీ వివరిం చారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ జమచేయాలనీ ఒకవేళ సరుకు లేకపోతే ప్రస్తుత కనీస మద్దతు ధరతో చెల్లించాలని ఆయన సూచించారు. ప్రజల డబ్బుతో కొన్న ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించాలని చూసే మిల్లర్లను లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త చట్టాలు తీసుకొస్తున్నామని తెలిపారు. అధికారుల తనిఖీలలో గోదాముల్లో ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలితే, వెంటనే శాఖ షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై మిల్లర్లు సమాధానం చెప్పడానికి కేవలం ఏడు రోజుల గడువు మాత్రమే ఇవ్వాలని, ఆ తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామనీ తెలిపారు.

ఈ గడువులోగా మిల్లర్లు స్పందించకపోతే, రైస్ మిల్ యంత్రాలు, వాహనాలు, బ్యాంకు అకౌంట్ల వంటి ఆస్తులను జప్తు చేయాలని జిల్లా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేస్తామనీ తెలిపారు. ఈ ఆస్తులను అమ్మినా ప్రభుత్వ నష్టం తీరకపోతే, ఆ మిల్లర్ల భూములు, ఇళ్లు వంటి స్థిరాస్తులను కూడా సీజ్ చేసి బహిరంగ వేలం వేయాలని దిశ కింది స్థాయి ఉద్యోగులకు నిర్దేశించారు.ఎక్కడా ఎలాంటి తప్పులు జరగకుండా ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయడానికి, అధికారులకు ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ ఇస్తామనీ చెప్పారు.

ఏ చర్య తీసుకున్నా అది చట్టబద్ధంగా ఉండేలా, రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడటమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం.పక్కాగా తనిఖీలు ఎలా చేయాలి, పంచ నామాలు ఎలా రాయాలి, వీడియో ఆధారాలను ఎలా సేకరించాలి అనే విషయాలపై డిప్యూటీ తహసీల్దార్లు , అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్లకు ఫీల్డ్ ట్రైనింగ్ ఇస్తున్నారు.అదే సమయంలో, బకాయిలు ఎంత ఉన్నాయో కచ్చితంగా లెక్కించడం, రికవరీ రికార్డులను నిర్వహించడంపై అసిస్టెంట్ మేనేజర్లు, జిల్లా మేనేజర్లకుకూడా ట్రైనింగ్ ఇస్తున్నారు. బకాయి పడ్డ మిల్లర్ల ఆస్తులను గుర్తించి వెంటనే జప్తు చేయడానికి, రెవెన్యూ అధికారులతో ఎలా కలిసి పని చేయాలనే దానిపై జిల్లా సివిల్ సప్లైస్ ఆఫీసర్లకు కూడా సూచనలు ఇస్తున్నారు.రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటూ, బకాయి పడ్డ మిల్లర్ల ఆస్తులపై ఎలాంటి సంకోచం లేకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోగలరు.

# మహారాష్ట్రలో భూకంపం.. మద్నూర్‌లో స్వల్ప ప్రకంపనలు

### హింగోలి కేంద్రంగా రిక్టర్‌స్కేల్‌పై 4.2 మాగ్నిట్యూడ్ నమోదు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని హింగోలి జిల్లా కేంద్రంగా శనివారం ఉదయం భూకంపం సంభవించింది. ఒకే రోజు రెండుసార్లు భూమి కంపించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీని ప్రభావంతో తెలంగాణ సరిహద్దు మండలమైన మద్నూర్ లో స్వల్ప ప్రకంపనలు అనిపించినట్లు స్థానికులు తెలిపారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ఉదయం 7:46 గంటలకు రిక్టర్ స్కేల్‌పై 4.2 మాగ్నిట్యూడ్ తీవ్రతతో భూకంపం సంభవించినట్లు ధృవీకరించింది. భూకంప కేంద్రం హింగోలిలో 7 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించారు. దీని ప్రకంపనలు నాందేడ్, దేగ్లూర్, బిలోలి ప్రాంతాలతో పాటు ఉమ్మడినిజామాబాద్ జిల్లాకు చెందిన మద్నూర్ మండలం వరకు వ్యాపించాయి. ఒక్కసారి భూమి వూగిపోయినట్లు అనిపించినట్లు కొందరు స్థానికులు తెలిపారు. హింగోలిలో ఈ సంవత్సరం 19సార్లు భూకంపం సంభవించింది. అదులో రెండు సార్లు 4.5మాగ్నిట్యూడ్‌లకు అధికంగా సంభవించింది. 14సార్లు 3నుంచి4 మాగ్నిట్యూడ్‌లలో భూకంపం వచ్చింది.ఒక సారి 2నుంచి 3 మధ్యలో రిక్టర్‌స్కేల్‌పై మాగ్నిట్యూడ్‌లో సంభవించింది.హింగోలిలో దశాబ్దకాలంలో 54సార్లు భూకంపం సంభవించింది. ఇందులో మాగ్నిట్యూడ్ 6సార్లు నాలుగుమాగ్నిట్యూడ్‌లకంటె అధికంగా భూమి కంపించింది. 12 వారాల కింద పర్భనీలో కూడా రిక్టర్‌స్కేల్‌పై 4.2 మాగ్నిట్యూడ్‌లలో భూకంపం వచ్చినట్లు నమోదైంది.

# పారదర్శకంగా ఉన్న ఓటర్ల జాబితాకు ‘సర్’ పరీక్ష

### ఎవరి ఓట్లు ఉంచాలన్నది బిజెపి కార్యాలయం నుంచి లిస్ట్

### ఇసి జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి: సినీనటుడు ప్రకాశ్‌రాజ్

**హైదరాబాద్, అక్టోబరు 3,ప్రభాతవార్త:** పారదర్శకంగా ఉన్న ఓటర్ల జాబితాకు ‘సర్’ అనే పరీక్ష పెట్టా రని ఓటర్ల జాబితాలో ఎవరి ఓట్లు ఉంచాలన్నది బిజెపి కార్యాలయం నుంచి లిస్ట్ వెళ్తోందని నటుడు ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకాశ్‌రాజ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఇసి, కేంద్రప్రభుత్వంపై ఆయన పలు విమర్శలు గుప్పించారు. ఇసి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలనిసర్ పేరుతో ప్రజలు తాము బతికి ఉన్నామని నిరూపించుకోవాల్సి న పరిస్థితి కల్పించారని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వల్ల దేశవ్యాప్తంగా ఏం జరిగిందో అందరికీ తెలుసని, 13 కోట్ల మంది ఓటర్లు అనర్హులయ్యారన్నారు. ఇసి తీసుకున్న నిర్ణయం తప్పని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ప్రకాశ్‌రాజ్ డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసే కమిటీ నిబంధనలు మార్చాలని, 2023 నుంచి ఈసీ తీసుకున్న నిర్ణయాలపై సుప్రీంకోర్టు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్‌కుమార్, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలపై కేసు పెట్టాలని ప్రకాశ్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈసీలో ఇద్దరు కమిషనర్‌లు చెప్పింది భిన్నాభిప్రాయమా, జ్ఞానేశ్‌కుమార్ ఒక్కరే చెప్పింది సరైందా అని, ఈసీ యాప్ ఎందుకు మార్చాల్సి వచ్చిందని అని ప్రకాష్‌రాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**ప్రజలు ఇంటివద్ద లేకుంటే ఓటు తొలగిస్తారా?**

బతికుండగానే కొందరి ఓట్లు తొలగించారని ఫిర్యాదులు వస్తున్నాయని అక్రమ చొరబాటు దారులు ఉంటే ఇన్నేళ్లుగా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చొరబాట్లపై కేంద్ర హోంశాఖ ఇన్నేళ్లుగా ఏం చర్యలు చేపట్టిందని ఓటర్ల షిఫ్టింగ్ జరిగితే మొత్తంగా ఓటర్ల సంఖ్య తగ్గకూడదన్నారు. ప్రజలు ఇంటివద్ద లేకుంటే వెంటనే ఓటును తొలగిస్తారా అని మండిపడ్డారు. పేదలు, దళితులు, ఆదివాసీలు, ముస్లింల ఓట్లు తొలగించడమే వాళ్ల ప్రధాన అజెండా అని ప్రకాశ్ రాజ్ విమర్శించారు. ఈసీని బీజేపీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎందుకు సమర్థిస్తున్నారని బీజేపీతో ఉన్నంత మాత్రాన ఈసీని ప్రశ్నించటం మానేస్తారా? అని ఎద్దేవా చేశారు.



శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సినీనటుడు ప్రకాశ్‌రాజ్

# రాజ్యాంగ వ్యవస్థను కించపరచడం మంచి పద్ధతి కాదు

### బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** రాజ్యాంగబద్ధ సంస్థకు అధిపతిగా ఉన్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి) జ్ఞానేశ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు, రాజకీయ విశ్లేషకుడు ప్రకాశ్ రాజ్ తీరును బిజెపి తెలంగాణ రాష్ట్ర శాఖ తీవ్రంగా తప్పుబట్టింది. సోషల్ మీడియాలో మాత్రమే కనిపించే ‘కాక్రోచ్ జనతా పార్టీ’తో పాటు ఇతర రాజకీయ పార్టీలను ఉద్దేశించి ప్రకాశ్ రాజ్ మాట్లాడిన ఒక వీడియో ఇటీవల వెలుగులోకి వచ్చింది. అందులో ఆయన “మొన్ననే మనం వినాయక నిమజ్జనం చేసుకున్నాం కదా, ఇప్పుడు సిఈసి జ్ఞానేశ్ కుమార్‌ను సైతం అలాగే నిమజ్జనం చేయాల్సిన సమయం వచ్చిందని మాట్లాడినట్లుగా ఉంది. ఈ వ్యాఖ్యలపై బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌ఛార్జ్ ఎన్.వి. సుభాష్ తీవ్రంగా ఖండించారు. ప్రకాశ్ రాజ్ లాంటి పెద్ద నటుడు ఇంత దిగజారి మాట్లాడటం ఏమాత్రం సరికాదని ఆయన అన్నారు. ఎన్నికల కమిషన్‌ను విమర్శించే హక్కు ఎవరికైనా ఉండొచ్చు గానీ, సిఈసిని తీసుకెళ్లి విగ్రహ నిమజ్జనంతో పోల్చడం ద్వారా ఆయన రాజకీయ విమర్శల హద్దులు దాటి ఒక రాజ్యాంగ వ్యవస్థను కించపరిచారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అర్థవంతమైన చర్చలు జరగాలి తప్ప, ఇలాంటి హేళనలు, వెటకారాలు తగవని హితవు పలికారు. పెద్ద నటుడైనంత మాత్రాన రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని ఇష్టం వచ్చినట్లు గేలి చేసే లైసెన్స్ ఎవరికీ రాదని సుభాష్ స్పష్టం చేశారు. వినాయక నిమజ్జనం అనేది ఎంతో పవిత్రమైన సాంస్కృతిక, మతపరమైన సంప్రదాయమని, అలాంటి పవిత్రమైన అంశాన్ని తెచ్చి సిఈసిపై రాజకీయ దాడికి వాడటం అత్యంత గర్హనీయమని సుభాష్ అన్నారు. ప్రకాశ్ రాజ్ వామపక్ష భావజాలం ఉన్న వ్యక్తి కావొచ్చు.. అయితే అది ఆయన వ్యక్తిగత విషయమని పేర్కొన్నారు. కాని రాజకీయ విభేదాల కోసం ప్రజల విశ్వాసాలను గానీ, రాజ్యాంగబద్ధమైన పదవిని గానీ చులకన చేసి మాట్లాడకూడదని హెచ్చరించారు.



శనివారం సచివాలయంలో బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సిఎం సంజయ్‌జాబు

## 10 నుండి 18వ తేదీ వరకు ఘనంగా బతుకమ్మ వేడుకలు

### ఏర్పాట్లపై సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు.

## ఆటో కార్మికుల సంక్షేమానికి త్వరలో బోర్డు

### ఆటోఛార్జీని కిలోమీటర్‌కు రూ.14కు పెంచాం

### ప్రజాభవన్‌లో ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులకు ఆత్మీయ విందు ఇచ్చిన డిప్యూటీ సిఎం భట్టి

**హైదరాబాద్,అక్టోబరు3,ప్రభాతవార్త:** ఆటో కార్మికులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలన్నింటినీ మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలనే అజెండాగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శనివారం రాత్రి ప్రజాభవన్‌లో హైదరాబాద్ నగర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆత్మీయ విందు ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆటో సంఘాల నాయకులతో భోజనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఆటో డ్రైవర్ల సమస్యలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లోతుగా అధ్యయనం చేసి కేబినెట్ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఆటో ఛార్జీల పెంపుపై డ్రైవర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం.. కేబినెట్‌లో చర్చించి కిలోమీటర్‌కు రూ.11గా ఉన్న ఛార్జీని రూ.14కు పెంచుతూ జీఓ జారీ చేసిందన్నారు. రవాణా రంగంలో దాదాపు 20 లక్షల కార్మిక కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని చెప్పారు. చట్టసభల్లో చర్చించి, అవసరమైన నిధులు కేటాయించే ప్రక్రియను పూర్తి చేసి త్వరలోనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## రబీలో తక్కువ నీటి పంటలు వేయాలి

### 29 వేల క్వింటాళ్ల విత్తనాల పంపిణీ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రానున్న యాసంగిలో రైతులు స్వల్పకాలంలో పండే, తక్కువ నీరు వినియోగించే పంటలను సాగు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు అధిక డిమాండ్ ఉన్న పప్పుధాన్యాలు, నూనె గింజల పంటల వైపు మళ్లాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లో శనివారం రైతు నేస్తంలో పాల్గొని రబీకి సంబంధించి రూ.52 కోట్ల సబ్సిడీతో 29 వేల క్వింటాళ్ల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వల ఆధారంగా రైతుల పంటలను కాపాడేలా, నీటి పారుదల ప్రణాళికను జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో రూపొందించి, సక్రమంగా అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల అవసరాలు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వేరుశనగలో నూతన విత్తన రకాలను శాస్త్రవేత్తలు రూపొందించి, రైతుల ఆదాయం పెంపునకు తోడ్పడాలని చెప్పారు. రైతులు తమకున్న సాగునీటి అవకాశాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు.

## యూరోప్ నుంచి 10 కోట్ల బ్యారెళ్ల ముడిచమురు మార్కెట్‌లోకి

**ప్యారిస్, అక్టోబరు 3:** ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన ధరలు, సరఫరా ఆందోళనల నేపథ్యంలో జీ7 దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి నేపథ్యంలో జీ7 దేశాలు తమ అత్యవసర నిల్వల నుంచి 10 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు, డీజిల్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయడానికి అంగీకరించాయి. ఈ విడుదలను అంతర్జాతీయ ఇంధన సంస్థ సమన్వయంతో చేపట్టనున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు, ప్రస్తుత జీ7 అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అధ్యక్షతన జరిగిన వీడియో సమావేశం అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. నిల్వల విడుదల వెంటనే ప్రారంభమై నాలుగు నెలల పాటు కొనసాగనుంది. తొలి 20 రోజుల్లో గణనీయమైన పరిమాణంలో డీజిల్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలని జీ7 నిర్ణయించింది. ఇంధన ధరలు పెరగడంతో అమెరికాలోనూ డీజిల్ ధరలపై ఒత్తిడి పెరిగింది. దీంతో ట్రంప్ ప్రభుత్వం యూరప్ దేశాలు తమ అత్యవసర డీజిల్ నిల్వలను విడుదల చేయాలని కోరింది. అమెరికా డీజిల్ ఎగుమతులపై ఆంక్షలు విధించే అవకాశం ఉందన్న హెచ్చరికలు కూడా వెలువడ్డాయి. అలాంటి చర్య యూరప్‌లో ఇంధన సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో, జీ7 దేశాలు సమన్వయంతో నిల్వలను విడుదల చేయడానికి అంగీకరించాయి. ఇంధన ఎగుమతులపై ఆంక్షలు ఉండవు. జీ7 దేశాలు అత్యవసర నిల్వల నుంచి చమురు, డీజిల్‌ను విడుదల చేయడంతో పాటు మరో కీలక హామీ ఇచ్చాయి. పరస్పరం ఇంధనం, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించకూడదని అంగీకరించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సరఫరా ఒత్తిడి మరింత పెరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జీ7 సంయుక్త ప్రకటనలో పేర్కొంది. అవసరమైతే మరిన్ని డీజిల్ నిల్వలను విడుదల చేసే అంశాన్ని కూడా రానున్న రోజుల్లో చర్చించనున్నట్లు తెలిపింది.

# ఆ 4 రాష్ట్రాల్లో బ్యాలట్‌తో ఎన్నికలకు వెళ్లగలరా?

●కాంగ్రెస్ సిఎంలారా.. మీరు రాజీనామా చేసి రండి● జ్ఞానేశ్‌కుమార్‌కు, బిజెపికి ఏం సంబంధం?●సిఇసి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ : కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,అక్టోబరు 3, ప్రభాతవార్త:** కేంద్ర ఎన్నికల కమిషన్‌పైన, ఈవిఎం యంత్రాలపై పదేపదే ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఈవిఎంల వల్లే కాంగ్రెస్ పార్టీ కేరళ, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ రాష్ట్రాల్లో గెలిచింది కదా? మరి ఆ నాలుగు రాష్ట్రాల సిఎంలు రాజీనామా చేసి కాంగ్రెస్ ప్రభుత్వాలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో మళ్లీ ఎన్నికల్లోకి వెళ్లేందుకు సిద్ధమా? పదేపదే ఈవిఎంల గురించి, సర్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు దమ్ముంటే నా సవాల్‌ను స్వీకరించాలి అని అన్నారు. ప్రపంచమంతా కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్య సాహసాలను కొనియాడతుంటే రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు కనీసం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసిన వ్యక్తి సామాజికవర్గం ఓట్లు పోతాయోననే భయంతోనే కాంగ్రెస్ నేతలు నోరు మెదపడం లేదన్నారు. స్మిత్ మచ్చార్ సాహసం, తెగువ తెలిసినా స్పందించని వాళ్లంతా తన దృష్టిలో దేశద్రోహులు, దిమాగే నక్సల్సేనని అన్నారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, సంగప్ప, శ్రీవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యాంశాలు.. దిల్‌సుక్‌నగర్‌లో సంతోషీమాత దేవాలయంలో దాడి హేయనీయం. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్న ప్రభుత్వం పట్టించు కోవడం లేదు. దాడి చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ప్రభుత్వం పద్ధతి మార్చుకుని దాడి చేసిన వాళ్లపై కఠినాతికఠినంగా వ్యవహరించాలన్నారు. లేకపోతే యువత రోడ్లపైకి వచ్చి తిరగబడితే వాళ్లను ఆపే పరిస్థితి ఉండదు. ఆలయాలపై దాడుల ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సిఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు, బిజెపికి ఏం సంబంధం? అంటూ ప్రశ్నించారు. ఆయన ఎన్‌డిఏ మంత్రి కాదు... సిఈసి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అన్నారు. అసలు ఇండీ కూటమికి జనాదరణ లేదు. వాళ్ల ఆందోళన కార్యక్రమాలకు పట్టుమని పది మంది కూడా రావడం లేదన్నారు. ముంబై, ఢిల్లీలో జరిగిన ఆందోళనలకు జనం పెద్దగా రాకపోవడమే నిదర్శనం అన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా సిపిఎం దొంగ ఓట్లను తొలగించడంవల్లే కేరళలో అధికారంలోకి వచ్చామని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చెప్పారు కదా. మరి దీనికి కాంగ్రెస్ నేతలు ఏమంటారు? ఈవిఎంలపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస నేతలకు సవాల్ విసురుతున్నా. కాంగ్రెస్ పాలిత సిఎంలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయించండి. బ్యాలెట్‌తో ఎన్నికల్లోకి వెళదాం అన్నారు. ఎవరు గెలుస్తారో చూద్దాం. బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ 6 గ్యారంటీలపైఉద్యమాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని సిబిఐకి ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వం లేఖ రాయలేదన్నారు. కెసిఆర్ కుటుంబానికి పూర్వమే చింతమడకలో వందల ఎకరాలున్నాయనడం పెద్ద జోక్. ఆనాడు వాళ్లకు అసలు హైదరాబాద్‌లో అసలు ఇల్లే లేదు. అధికారంలోకి వచ్చాకే ఇన్ని హోటళ్లు, ఆస్తులు ఎట్లా వచ్చాయన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లోనూ బిజెపి గెలుపు తథ్యం అన్నారు. కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్య సాహసాలను ప్రపంచమంతా కొనియాడుతుందని, మోడీ నేరుగా వీడియో కాల్ చేసి మచ్చార్‌తో మాట్లాడి అభినందించారు.



శనివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

## 9న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు

### పదేళ్ల తర్వాత తొలిసారిగా ఎన్నికలు

### ఆధిపత్యం కోసం హోరాహోరీ పోరు

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ నెల 9న గుర్తింపు సంఘం యూనియన్ ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పదేళ్ల తర్వాత తొలిసారిగా జరుగుతున్న ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. ఈ ఎన్నికల్లో 39 వేల మందికి పైగా కార్మికులు రహస్య బ్యాలెట్ విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హోరా హోరీగా జరుగుతున్న ఈ గుర్తింపు సంఘం ఎన్నికల బరిలో 12 కార్మిక సంఘాలు ఉన్నాయి.

ఇప్పటికే వీటికి ఎన్నికల గుర్తులను కూడా కేటాయించారు. ఆన్ డ్యూటీ సిబ్బంది కోసం ఈ నెల 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ నిర్వహించి, 17వ తేదీన తుది ఫలితాలను ప్రకటించానున్నారు. కాగా ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇవి కేవలం కార్మిక సంఘాల మధ్య జరిగే ఎన్నికలు మాత్రమే కాదు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక సమీకరణాలకు దారి తీస్తుంటాయి. కార్మిక సమస్యల పరిష్కారం కంటే, రాజకీయ పార్టీల వ్యూహాలు, ఆధిపత్య పోరు ఈ ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయనేది బహిరంగ రహస్యం. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎంల మధ్య ఈ ఎన్నికలు పెద్ద సమస్య తెచ్చిపెట్టాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయు), సీపీఎం అనుబంధ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), అశ్వథామరెడ్డి వర్గంతో పాటు, మరికొన్ని సంఘాలు ఒకే తాటిపైకి వచ్చి కూటమిగా ఏర్పడ్డాయి. మరోవైపు సీపీఐ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) మాత్రం తనదారి తానే అన్నట్టు వ్యవహరిస్తోంది.

తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎండియు), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) వంటి ఇతర సంఘాలతో జత కట్టింది. ఈ ఎన్నికల్లో టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ సర్వీసులో విలీనం చేయడం, పదవీ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచడం, 2017, 2021 బకాయిలను చెల్లించడంతో పాటు, ఏప్రిల్ 1, 2025 నుంచి వేతన సవరణలను అమలు చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, కుటుంబ వైద్య కవరేజీని విస్తరించడం, ఏకరీతి బదిలీ విధానాన్ని ఏర్పాటు చేయడం, అద్దె బస్సులను నియంత్రిస్తూ బస్సుల సంఖ్యను పెంచడం, సహజ మరణాల విషయంలో రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించడం వంటివి ప్రధాన డిమాండ్లతో ఆర్టీసీ కార్మిక సంఘాలు ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి.

## తెలంగాణలో దసరా సెలవులు ఖరారు

### పాఠశాలలకు 13 రోజులు, కాలేజీలకు 12 రోజులు

**హైదరాబాద్,అక్టోబరు3,ప్రభాతవార్త:** తెలంగాణలోని విద్యార్థులకు దసరా పండుగ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవుల తేదీలను శనివారం ప్రకటించింది. ఈసారి పాఠశాలలకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. విద్యాశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు 13 రోజుల పాటు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి.ఇక జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియట్) విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజులు సెలవులు ప్రకటించారు. వీరికి అక్టోబర్ 22న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్1 (ఎస్ఏ1) పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు అక్టోబర్ 9వ తేదీతో ముగియనున్నాయి. అదే రోజున జరగాల్సిన 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్చారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

## వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

### పెట్టుబడుల ఆకర్షణ, ప్రభుత్వ భూముల విలువ పెంపుపై దృష్టి

### పర్యాటక రంగాన్ని కీలక ఆదాయ వనరుగా తీర్చిదిద్దాలి: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

### సమావేశానికి హాజరైన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



శనివారం సచివాలయంలో వనరుల సమీకరణపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు

**హైదరాబాద్,అక్టోబరు3,ప్రభాతవార్త:** రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. హిల్ట్ పాలసీ అమలు, పర్యాటక రంగంలో పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన వనరుల సమీకరణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సివిల్ సప్లై, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వ భూములను సమర్థవంతంగా వినియోగించుకోవడం, వాటి విలువను పెంచడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం, పర్యాటక రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదనపు ఆదాయ వనరులను గుర్తించడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించే ప్రాజెక్టులను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులు, భూముల ద్వారా గరిష్ఠ ఆర్థిక ప్రయోజనం పొందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. హిల్ట్ పాలసీలో ఎలాంటి అభ్యంతరాలు లేని పార్కులకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన క్లియరెన్స్ ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని వేగంగా సమీకరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. హిల్ట్ పాలసీపై పరిశ్రమలకు మరింత అవగాహన కల్పించేందుకు ఆరు పార్కుల్లో మంత్రుల ఆధ్వర్యంలో రోడ్‌షోలు నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రాజెక్టులను సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టులకు అనువైన ప్రాంతాలను గుర్తించి, పెట్టుబడిదారులను ఆకర్షించేలా ప్రతిపాదనలు రూపొందించాలని భట్టి ఆదేశించారు.రాష్ట్రంలోని చారిత్రక కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు పిపిపి విధానంలో 11 కోటలకు బిడ్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. టైగర్ టూరిజం కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలని భట్టి ఆదేశించారు. నిజాంసాగర్‌లోని నిజాం గెస్ట్‌హౌస్‌ను పర్యాటక అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో పర్యాటక మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు కారవాన్ పార్కుల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్ ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, వివిధ శాఖల ఉన్నత అధికారులు శశాంక, కృష్ణ భాస్కర్, ఇలంబర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి విశ్వవిద్యాలయంలోనూ స్టార్టప్‌లు, ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ సెంటర్

### జెఎన్‌టియుహెచ్‌లో వేడుకగా రీచ్ 2026 సదస్సు

### ఉపాధి లక్ష్యమే ఉన్నతవిద్య పరమార్థం కావాలి: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,అక్టోబరు3,ప్రభాతవార్త:** తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో శనివారం కుకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన రీచ్-2026 (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు. విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్ లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్ట్‌లు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం" ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని



వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, టీజీసీహెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ విసి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ విసి ప్రొఫెసర్ ఎం. కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంలతో పాటు వివిధ వర్సిటీల ఉపకులపతులు, 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. విద్యార్థులకు, పారిశ్రామిక అవసరాలకు ఉన్న వ్యత్యాసాన్ని కేవలం చర్చించడమే కాకుండా పూర్తిగా తుడిచిపెట్టేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు చేయి చేయి కలపాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు.

## ప్రాణం తీసిన పొలం పంచాయితి

### తహసీల్దార్ కార్యాలయంలోని చెట్టుకు ఉరేసుకున్న రైతు

**కోయిల్‌కొండ, అక్టోబరు 3, ప్రభాతవార్త :** తహసీల్దార్ కార్యాలయంలోని చెట్టుకు పసుల లావప్ప (50) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండలో శనివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే..పార్పల్లి శివారులోని సర్వే నంబర్ 211లోని వ్యవసాయ భూమికి సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు తహశీల్దార్ తెలిపారు. దయ్యాలి లక్ష్మయ్య, పసుల చంద్రశేఖర్, పసుల విష్ణు, దయ్యాల రామకృష్ణ అనే వ్యక్తులు వ్యవసాయ భూమిలోకి ప్రవేశించి హద్దు రాళ్లను తొలగించేందుకు ప్రయత్నించడం, పంటకు నష్టం కలిగించడం, తన తండ్రిపై దాడికి ప్రయత్నించడం, బెదిరింపులకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా, మృతుడు రాసినట్లు పేర్కొంటున్న సూసైడ్ నోట్‌లో కొందరి పేర్లు ఉన్నట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఆ నోట్‌లో పేర్కొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు పోలీసులను కోరినట్లు వివరించారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలం, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు సర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించినట్లు తహశీల్దార్ తెలిపారు. 1954-55 ఖస్రా పహాణీ ప్రకారం సర్వే నంబర్ 211లో మొత్తం 18.39 ఎకరాల పట్టా భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉండగా, టిప్పన్ ఆధారంగా నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో 17.39 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించిన భౌతిక స్వాధీన అంశంపై కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సర్వే నంబర్ లో పేర్కొన్న భూమికి మృతుడికి ఎటువంటి సంబంధం లేదని తహశీల్దార్ వివరించారు. మృతుడి కుటుంబ వివరాలు విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం మృతుడు పసుల లావప్ప పార్పల్లి గ్రామానికి చెందినవారని, ఆయనకు కనకమ్మ, మంజుల అనే ఇద్దరు భార్యలు మృతి చెందినట్లు తహశీల్దార్ తెలిపారు. వేణుగోపాల్, కుర్మయ్య, గంగాధర్ అనే ముగ్గురు కుమారులు, నాగేశ్వరమ్మ అనే కుమార్తె ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని తహశీల్దార్ దీపక్‌రావు తెలిపారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, పోస్టుమార్టం నివేదిక, రెవెన్యూ రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

## ఎండలు తీవ్రం.. వానలు మాయం

### 37 డిగ్రీలకుపైగా పెరిగిన ఉష్ణోగ్రతలు

### 25 జిల్లాల్లో 36 డిగ్రీలు పైగా.. రాష్ట్రంలో 19 శాతం లోటుతో ముగిసిన నైరుతి

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్ లోటు వర్షపాతంతో ముగిసింది. జూన్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు సాధారణ వర్షపాతం 740.6 మి.మీ ఉండాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 శాతం లోటు ఏర్పడగా, శనివారం నాటికి అది 19 శాతానికి చేరినట్లు రాష్ట్ర ప్రణాళిక సంఘం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 38 తగ్గుదల 2025 నైరుతి సీజన్‌లో తెలంగాణ వ్యాప్తంగా 988.3 మి.మీ విస్తార వర్షాలు కురవగా, ఈ ఏడాది గత నెలాఖరు నాటికి ఏకంగా 38 శాతం మేర వర్షపాతం పడిపోయింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం వల్లే రుతుపవనాల కదలికలు బలహీనపడి వర్షాలు తగ్గుముఖం పట్టాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. నెలవారీ వర్షపాతం వివరాలు చూస్తే జూన్‌లో సాధారణం 130.3 మిల్లీమీర్లుకు గాను 12 లోటుతో 115.3 మిల్లీమీటర్లు, జూలైలో సాధారణం 227.4 మిల్లీమీటర్లుకు 1 శాతం లోటుతో 224 మిల్లీమీటర్లు, ఆగస్టులో సాధారణం 215.8 మిల్లీమీటర్లుకు అత్యధికంగా 38 లోటుతో 134.5 మిల్లీమీటర్లు, సెప్టెంబర్‌లో సాధారణం 167.1 మిల్లీమీటర్లుకు గాను 15 శాతం లోటుతో 141.7 మిల్లీమీటర్లు నమోదైంది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాల్లోనూ వర్షాభావ ప్రభావం స్పష్టంగా కన్పిస్తోంది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో 15 జిల్లాలు మాత్రమే సాధారణ వర్షపాతం కేటగిరీలో నిలవగా, మిగిలిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఒక్క జిల్లాలోనూ సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవలేదు. మండలాల వారీగా చూస్తే 331 మండలాల్లో లోటు, 5 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదైంది. నగర, పట్టణ ప్రాంతాల్లోనూ వర్షాల ప్రభావం గణనీయంగా తగ్గింది.

హైదరాబాద్ జిల్లాలో 27 శాతం, మల్కాజిగిరిలో 33 శాతం, రంగారెడ్డిలో 14 శాతం మేర లోటు కనిపించింది. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధి మొత్తంగా 26 శాతం లోటు ఏర్పడింది. ఇక జిల్లాల వారీగా చూస్తే నాటికి సిద్దిపేట జిల్లాలో సాధారణం (614.8 మిల్లీమీటర్లు) కంటే 10 శాతం అధికంగా 678.3 మిల్లీమీటర్లు వర్షపాతం కురిసింది. మరోవైపు సెప్టెంబర్ నెలాఖరుకు గద్వాల జిల్లా అత్యధికంగా 41 శాతం లోటుతో (శనివారం వరకూ 44 శాతం లోటు) రాష్ట్రంలోనే అట్టడుగున నిలిచింది. మరోపక్క రుతుపవనాల నిష్క్రమణతో రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం మించి అనూహ్యంగా పెరిగాయి. శనివారం నాటికి గద్వాల్ జిల్లాలో అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# పొగ పీల్చేవారిలోనే మరణాలు ఎక్కువ..!

● లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ఆసక్తికర అంశాలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** సిగరెట్ తాగే వ్యక్తి వదిలిన పొగ గాలిలో కలిసిపోతుందని భావిస్తే పొరపాటే. అది పక్కనున్న వారి ఊపిరితిత్తుల్లోకి చేరి, వారి ప్రాణాలను నిశ్శబ్దంగా హరిస్తోంది. పొగ తాగే అలవాటు లేకపోయినా, ఇతరులు వదిలిన పొగను పీల్చడం వల్ల కలిగే నష్టం ఊహించిన దానికంటే చాలా తీవ్రంగా ఉందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ప్రతిష్ఠాత్మక ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, కేవలం 2023 సంవత్సరంలోనే భారత్‌లో సుమారు 3.25 లక్షల మంది ఈ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. 1990లో ఈ సంఖ్య 2.17 లక్షలుగా ఉండగా, మూడు దశాబ్దాల్లో మరణాలు దాదాపు 50 శాతం పెరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని టొబాకో ఫ్రీ ఇండియా సంస్థ ఈనెల 2న నిర్వహించిన వెబినార్‌లో ఈ ఆందోళనకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ చర్చలో పాల్గొన్న నీతి ఆయోగ్ మాజీ సభ్యుడు డాక్టర్ వీకే పాల్ మాట్లాడుతూ, భారత్‌లో పాసివ్ స్మోకింగ్ ప్రభావంపై కీలక వివరాలు పంచుకున్నారు. 1990లో దేశ జనాభాలో 43 శాతం మంది సెకండ్ హ్యాండ్ స్మోక్‌కు గురైతే, 2023 నాటికి అది 31కి తగ్గిందని తెలిపారు. శాతంపరంగా తగ్గుదల కనిపించినా, దేశ జనాభా భారీగా పెరగడంతో బాధితుల సంఖ్య 37.5 కోట్ల నుంచి 44.4 కోట్లకు పెరిగిపోవడం అత్యంత ఆందోళన కలిగించే విషయం. ప్రపంచవ్యాప్తంగా సెకండ్ హ్యాండ్ స్మోక్ వల్ల ఏటా 17 లక్షల మంది చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిశ్శబ్ద మహమ్మారి కారణంగా పురుషులు, మహిళలు ఇద్దరూ తీవ్రంగా నష్టపోతున్నారు. 1990లో 1,13,400 మంది మహిళలు పాసివ్ స్మోకింగ్‌తో మరణించగా, 2023 నాటికి ఆ సంఖ్య 1,56,900కు చేరింది. అదే సమయంలో పురుషుల మరణాలు 1,04,300 నుంచి 1,68,700కు పెరిగాయి. ఈ మరణాల వల్ల దేశం ఏకంగా 9.28 మిలియన్ల డిసెబిలిటీఅడ్జస్టెడ్ లైఫ్ ఇయర్స్‌ను, అంటే ప్రజలు ఆరోగ్యంగా గడపాల్సిన జీవితకాలాన్ని కోల్పోయింది. ప్రపంచంలో చైనా (49.2 కోట్లు) తర్వాత అత్యధికంగా 44.4 కోట్ల మంది బాధితులతో భారత్ రెండో స్థానంలో నిలవడం సమస్య తీవ్రతను స్పష్టం చేస్తోంది. భారత్‌లో బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడాన్ని నిషేధిస్తూ చట్టం వచ్చి 18 ఏళ్లు పూర్తయినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరు ప్రశ్నార్థకంగానే ఉంది. ముఖ్యంగా ఇళ్లు, కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థల్లో ఈ నిబంధనలు సరిగా అమలు కాకపోవడంతో తీవ్రమైన అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఈ ప్రమాదాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం 100 శాతం పొగ రహిత ప్రజారోగ్య ప్రదేశాలను కఠినంగా అమలు చేయాలని, ఇళ్లలో కూడా పొగ తాగకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తపడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సిఇసి చట్టం 2023ను రద్దు చేయాలి

● జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

**ధర్నాచౌక్, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** రాజ్యాంగ విరుద్ధ చర్యలకు రక్షణ కల్పిస్తున్న సీఈసీ చట్టం 2023ను తక్షణమే రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సర్‌కు ముగింపు పలకాలని డిమాండ్ చేస్తూ టీపీఎఫ్, టీవీఆర్ఎఫ్, ఎన్ఏపీఎం, టీపీయూ, ఏఐపీఎం, ఏపీసీఆర్, డబ్ల్యూటీజేఏసీ, సీజేపీ, ఎంపీజే, ఎస్ఐఒ, స్టాండ్ ఫర్ నేషన్, యూత్ వెల్ఫేర్ తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి వారు మాట్లాడుతూ అప్రజాస్వామికమైన సర్‌ను రద్దు చేయాలని, పౌరులందరి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. పౌరుల ఓటు హక్కును ప్రమాదంలో పడేసిన ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ఆయన చేసిన రాజ్యాంగ ఉల్లఘనలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ సవ్యంగా జరగలేదని, 3.38 కోట్ల ఓటర్లలో 21 శాతం ఓట్లు తొలగించటం అనేది దేశంలోనే అత్యధికంగా ఉందని ఆరోపించారు. తక్షణమే సర్‌ను రద్దు చేయాలని, లేనిపక్షం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఆకునూరి మురళి, ప్రొఫెసర్ కంచె అయిలయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, ఇర్ఫాన్, డాక్టర్ ఏ.సునీత, ప్రొఫెసర్ పద్మజషా, అడ్వకేట్ మహ్మద్ వసీం, కే.శ్రీనివాస్, ఖలీదా పర్వీన్, వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఉస్మాన్, దిల్షాద్ తదితరలు పాల్గొని మద్దతు తెలిపారు.

# అమృత్‌సర్‌లో ప్రముఖ ఇన్‌ఫ్లూయెన్సర్ కాల్చివేత



**అమృత్‌సర్, అక్టోబరు 3:** పంజాబ్‌కు చెందిన ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, మేకప్ ఆర్టిస్ట్ మాడ్ సంధూ (మధుసూదన్)ను శనివారం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి కాల్చి చంపారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన సంధూ రక్తపు మడుగులో రోడ్డుపై పడి ఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా ఆయన మృతి చెందినట్లు సమాచారం. శనివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సంధూపై కాల్పులు జరిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దాడికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. పంజాబ్, అమృత్‌సర్ ప్రాంతాల్లో ప్రముఖ ఎల్‌జీబీటీక్యూ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు పొందిన సంధూ మేకప్, సినీ పరిశ్రమ, లింగ సంబంధిత అంశాలపై పాడ్‌కాస్ట్‌లలో తరచూ మాట్లాడేవారు. సోషల్ మీడియాలో ఆయనపై హోమోఫోబిక్ ట్రోలింగ్ జరిగినప్పటికీ, తన వ్యక్తిత్వాన్ని బహిరంగంగా వ్యక్తం చేసేవారు. తనపై వచ్చే విమర్శలకు స్పందిస్తూ "దేవుడు నన్ను ఇలా సృష్టించాడు" అని చెప్పేవారు. ఫ్యాషన్ రంగంలో స్టైలిస్ట్, అసిస్టెంట్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా సంధూ తన కెరీర్‌ను ప్రారంభించారు. పంజాబ్, ముంబైలోని చిత్ర పరిశ్రమలో పనిచేశారు. అనంతరం ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, వైరల్ వీడియోల ద్వారా విస్తృతంగా గుర్తింపు పొందారు. లగ్జరీ లుక్ టిప్స్, జీవనశైలి, సామాజిక నిబంధనలు, ఎల్‌జీబీటీక్యూ అంగీకారం, పాప్ కల్చర్ వంటి అంశాలపై ఆయన కంటెంట్ రూపొందించేవారు. కొన్ని పంజాబీ సినిమాల్లో, ఓయ్ భోలే ఓయ్ సిరీస్‌లోనూ నటించారు. సంధూ హత్యకు ఏడాది ముందు బఠిండాలో మరో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ హత్యకు గురయ్యారు. 2025 జూన్‌లో కంచన్ కుమారి అలియాస్ కమల్ కౌర్ భాభీని బ్రాండ్ ప్రమోషన్ పేరుతో ఇంటి నుంచి బయటకు రప్పించి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో అమృత్‌పాల్ సింగ్ మెహ్రోన్, అతని సహచరులపై ఆరోపణలు నమోదయ్యాయి. ఆమె సోషల్ మీడియా ఖాతాల్లో సంప్రదాయ సిక్కు మహిళల ఇంటిపేరు కౌర్‌ను తొలగించాలని కూడా ఒత్తిడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఏడాదిలోనే భారత్‌కు డిపోర్ట్ చేసిన అనంతరం ఢిల్లీ విమానాశ్రయంలో అతడిని అరెస్టు చేశారు. ఈ కేసులో బఠిండా కోర్టు హత్య ఆరోపణలను నమోదు చేసినట్లు సమాచారం. మాడ్ సంధూ హత్యకు కొద్ది గంటల ముందు లుధియానాలోని ముల్లాన్‌పూర్‌లో మరో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కారుపై కాల్పులు జరపడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఖంజర్‌వాల్ గ్రామం నుంచి మజ్రీ వైపు తెల్లటి హ్యుందాయ్ ఐ20 కారులో ఇద్దరు యువకులు వెళ్తుండగా, హ్యుందాయ్ వెర్నాలో వచ్చిన దుండగులు వారిని వెంబడించి కాల్పులు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో భుంద్రీ గ్రామానికి చెందిన లాడీ ఖాన్ అనే వ్యక్తికి పలు బుల్లెట్ గాయాలయ్యాయి. ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న మరో వ్యక్తి రోహిత్ అలియాస్ బిల్లా కాల్పుల సమయంలో అక్కడి నుంచి తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ హత్యకు కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. పాత కక్షలు, వ్యక్తిగత వివాదం, గ్యాంగ్ విభేదాలు తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నిజామాబాద్ కమిషనరేట్‌లో నేరాల నివారణకు చర్యలు

● కొత్వాల్ సాయి చైతన్య వెల్లడి

**హైదరాబాద్, అక్టోబరు 3, ప్రభాతవార్త:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో నేరాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. పోలీసులకు సహాయంగా వుండేందుకు, పౌరుల భద్రత కోసం గడచిన తొమ్మిదేళ్ల వ్యవధిలో 10.991 సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ దొంగతనాలతో పాటు నేరాల నివారణలో సిసి కెమెమాలు కీలకంగా మారాయని తెలిపారు. గతంలో జరిగిన నేరాలతో పోలిస్తే ప్రస్తుతం చాలా వరకు తగ్గాయని, ఇదే సమయంలో రికవరీ శాతం కూడా పెరిగిందని, దీనికి కూడా సిసి కెమెరాలు కారణమని ఆయన అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఇవి పోలీసులకు దోహదం చేస్తున్నాయని ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాల నివారణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. మహిళల రక్షణకు నిజామాబాద్ పోలీసులు పెద్దపీట వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు దీనికి సంబంధించి 161 ఈ పెట్టి కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు 61 కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించి ఆకతాయిలకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మందలించడం జరిగిందని ఆయన తెలిపారు.

# శివాజీ పార్క్‌లో నిరసన.. సిజెపిపై ముంబై పోలీసుల కేసు




**ముంబయి, అక్టోబరు 3:** అనుమతి లేకుండా శివాజీ పార్క్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారనే ఆరోపణలపై కాక్‌రాచ్ జనతా పార్టీ పై ముంబై పోలీసులు శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేరును కూడా కేసులో చేర్చారు. అక్టోబర్ 2న ముంబయిలో సిజెపి నిర్వహించిన నిరసనకు సంబంధించి ఈ కేసు నమోదైంది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఈ ఆందోళన చేపట్టింది. శివాజీ పార్క్‌లో నిరసనకు ముంబై పోలీసులు ముందుగానే అనుమతి నిరాకరించారు. 2013 జనవరి 4న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పు, 2016 జనవరి 20న మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా శివాజీ పార్క్‌లో కార్యక్రమాలపై ఉన్న ఆంక్షలను పోలీసులు ప్రస్తావించారు. అనుమతి లభించకపోవడంతో ప్రత్యామ్నాయ వేదికను ఎంచుకోవాలని నిర్వాహకులకు పోలీసులు సూచించారు. అనుమతి లేకుండానే పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి శివాజీ పార్క్‌లో నిరసన నిర్వహించారని న్యాయవాది సిద్ధి డియోలేకర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా శివాజీ పార్క్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 189(2), 223తో పాటు మహారాష్ట్ర పోలీస్ చట్టంలోని సెక్షన్లు 37(1), 37(3), 135 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్, శబ్ద కాలుష్యం, ప్రజల రాకపోకలకు సంబంధించిన అంశాలను కూడా పోలీసులు అనుమతి నిరాకరణకు కారణాలుగా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన నిరసనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటిలో రెండు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో, మరొకటి కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. ప్రభుత్వ ఉద్యోగి జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించిన ఆరోపణలపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 223 కింద ఈ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. న్యూఢిల్లీ జిల్లాలో భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద విధించిన నిషేధాజ్ఞలను నిరసనకారులు ఉల్లంఘించారని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఇప్పటివరకు ఏ వ్యక్తి లేదా సంస్థను నిందితుడిగా పేర్కొనలేదు. నిరసనలను నిర్వహించేందుకు ప్రయత్నించిన లేదా వాటిలో పాల్గొన్న నిర్వాహకులు, సంస్థలకు సంబంధించిన వివరాలను ఎఫ్ఐఆర్‌లలో పొందుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

# దేవాలయాలపై దాడి చేస్తే సహించం

● మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ హెచ్చరిక



**ఎల్.బి.నగర్, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** దేవాలయాలపై జరుగుతున్న దాడులను అపేలా చర్యలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, ఈ చిచ్చును ఆపాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైనే ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత దేవాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఒక సైకో, ఒక ఉన్మాది సంతోషిమాత దేవాలయంలో దాడి చేశాడని, ఈ దాడి మొదటిది కాదని, ఇప్పటికే 20 ఆలయాలకు పైగా దాడులు జరిగాయన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని, మన హృదయాలను గాయపరుస్తున్నారు. సీఎం కుర్చీలో కూర్చున్న రేవంత్‌రెడ్డి నా పేరు రేవంత్‌రెడ్డి కాదు, రేవంతుద్దీన్ అని చెప్పుకుంటున్నారు. మీరు మతం మార్చుకోండి మాకేం అభ్యంతరం లేదు, కానీ అన్ని మతాలను సమానంగా చూడాల్సిన బాధ్యత ఉందని మర్చిపోవద్దని హితవు పలికారు. ధార్మిక సంస్థలలో మత ప్రబోధకుల ప్రోత్బలంతోనే ఈ దాడులు జరుగుతున్నాయని, హిందూ ధర్మం ప్రపంచానికే ఆదర్శమని, ఇతర దేశస్థులు కూడా మన ధర్మాన్ని ఆచరిస్తున్నారని, నాగరికతను, మానవత్వాన్ని నేర్పించిన మన భారతదేశం అన్నారు. దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి శిక్షించడం మాత్రమే మా కోరిక కాదు. ఇలా చేయడానికి కారణమైన వారు, ప్రసంగాలతో రెచ్చగొట్టే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్న వయసు నుంచే పరమతంపై విద్వేషం నింపుతున్న ధోరణులను అరికట్టాలని, వాటిని ఆపకపోతే తీవ్రనష్టం జరుగుతుందన్నారు. అగ్రగామి దేశం అమెరికాలో ట్విన్ టవర్స్‌ను సైతం ఈ ఉన్మాదం కూల్చివేసిందని, దీనిపై ప్రపంచమే ఆలోచిస్తోందని గుర్తుచేశారు. మనభారత పైలట్‌ను చంపి విమానాన్ని హైజాక్ చేసి ట్విన్‌టవర్స్ ఉన్మాదాన్ని మళ్ళీ చేద్దామని ప్రయత్నిస్తే, మన భారతమాత ముద్దుబిడ్డ క్యాప్టెన్ స్మిత్ మచ్చార్ ప్రాణాలకు తెగించి పోరాడి భారతీయుల గొప్పదనాన్ని ప్రపంచానికి చాటారన్నారు. ఐఎస్ఐ పేరుమీద జరుగుతున్న నరమేధాన్ని సృష్టిస్తున్నారని, ఇదే దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబులు పేల్చింది ఎవరని, గోకుల్‌చాట్, లుంబిని పార్క్ వద్ద నరమేధం సృష్టించింది ఎవరని, దాని వెనుక ఉన్నది ఎవరో మన కళ్ల ముందే చరిత్ర కనబడుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల ప్రాణాలు, ఆస్తులు, విశ్వాసాలు కాపాడే బాధ్యత ప్రభుత్వానికి ఉందని, అలా చేయకుండా వారిని ప్రోత్సహిస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాసరెడ్డి, ఎల్బీనగర్ ఇన్చార్జి సామ రంగారెడ్డి, చికోటి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేం దర్‌గుప్తా, మాజీ కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, రంగ నరసింహగుప్త, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయకోటి పవన్ కుమార్, బిజెపి ఓబీసీ ప్రధాన కార్యదర్శి బత్తుల సుమన్‌గౌడ్, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, దాసరి జయప్రకాష్, రుద్రాల శంకర్, మంచుకొండ సురేందర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జనగణనలో ఒబిసి కాలం చేర్చాలని

# ఒబిసిల నిరసన ప్రదర్శన



**సైఫాబాద్, అక్టోబరు 3 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం జాతీయ జనగణనలో ఓబిసి కాలం చేర్చాలని డిమాండ్ చేస్తూ పలు ఓబిసి సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. జాతీయ ఓబిసి కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శనివారం గన్‌పార్కులోని అమరువీరుల స్థూపం వద్ద ఈ నిరసన ప్రదర్శన కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా ఓబిసి ప్రజా ప్రతినిధుల ఫోరం ఛైర్మన్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, విశ్రాంత ఐఎఎస్ అధికారి, బిసి మేధావులు ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, బిసి సంఘాల నాయకులు ఒట్టె జానయ్య, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, ఫ్రంట్ వైస్-ఛైర్మన్ ఎస్.దుర్గయ్యగౌడ్, కన్వీనర్లు అయిలి వెంకన్నగౌడ్, భైరి శేఖర్, అంబాల నారాయణగౌడ్ మాట్లాడుతూ జాతీయ జనగణనలో ఓబిసి కాలం చేర్చాలని డిమాండ్ చేస్తూ జాతీయ స్థాయిలో ఓబిసి సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విడుదల చేసిన జనగణన జివో జిరాక్స్ కాపీలను వారు ఈ సందర్భంగా చించివేసి తీవ్రంగా నిరసన తెలియజేశారు. వచ్చే ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనగణనలో కులగణన చేపట్టకుండా బిసిలకు తీరని అన్యాయం చేస్తున్నదని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి నేటి వరకు బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, రంగాలలో తగిన ప్రాతినిధ్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం కులగణన చేపట్టి బిసిలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



## నస్పూర్ రోడ్డు ప్రమాదం

# చికిత్స పొందుతూ మరో యువతి మృతి

**నస్పూర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా నస్పూర్ గేట్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సలూరి అనూష (20) శనివారం ఉదయం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూసింది. గత సోమవారం మంచిర్యాలకు విధులకు వెళ్తుండగా ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఇప్పటికే ఐదుగురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. తీవ్ర గాయాలపాలైన అనూషను మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె ప్రాణాలు విడిచింది. అనూష మరణంతో ఈ ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య ఆరుకు చేరింది. వరుస మరణాలతో మృతురాలి కుటుంబంతో పాటు ఆమె స్వగ్రామమైన మందమర్రి మండలం వెంకటాపూర్‌లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## విదేశాల నుంచి వచ్చి ఉరివేసుకుని విద్యార్థి ఆత్మహత్య



**ఉప్పల్, అక్టోబరు 3 ప్రభాతవార్త :** ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన ఒక యువకుడు నగరానికి తిరిగి వచ్చి మరుసటి రోజు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదూర్ గ్రామానికి చెందిన వీరగాని మల్లేశం గౌడ్ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి రామంతాపూర్ భగాయత్ బాలకృష్ణనగర్‌లో ఉంటూ ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడి వీరగాని విద్యాసాగర్ (29), చిన్న కుమారుడు ప్రేమసాగర్ (25) ఉన్నారు. కాగా గతంలో విద్యాసాగర్ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి వచ్చాడు. అక్కడ ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో కొద్ది రోజులకు తిరిగి వచ్చాడు. గత మూడు నెలలుగా ఉద్యోగ నిమిత్తం విద్యాసాగర్ జర్మనీలో ఉండి ఈనెల 2వ తేదిన తెల్లవారు జామున ఉదయం 3 గంటలకు ఇండియాకు తిరిగి వచ్చాడు. అదే రోజు ఉదయం 6 గంటలకు తండ్రి పని ఉండగా అతనిని ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద దింపగా పనికి బయలుదేరాడు. అతని చిన్న కుమారుడు ప్రేమసాగర్ నిద్రపోతుండగా, అతను ఒక పని మీద తన సొంత గ్రామానికి వెళ్ళాడు. మధ్యాహ్నం సుమారు 3 గంటలకు, అతని చిన్న కొడుకు నిద్రలేచి తన సోదరుడు విద్యాసాగర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించాడు, కానీ ఎటువంటి స్పందన రాలేదు. అతను తలుపు కూడా తట్టాడు, అయినా ఎటువంటి సమాధానం రాలేదు. విద్యాసాగర్ పడకగదిలో నిద్రపోతూ ఉండవచ్చని అతని చిన్న కొడుకు భావించి మిన్నకుండిపోయాడు. తండ్రి మల్లేశం రాత్రి 8 గంటల సమయంలో రామాంతపూర్‌లోని తన ఇంటికి తిరిగి వచ్చి పడకగది కిటికీలోంచి చూడగా, కొడుకు విగతజీవిగా కనిపించాడు. అతని వద్ద రెండు మొబైల్ ఫోన్లు, చెవులలో ఇయర్‌బడ్స్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతను ఎవరితోనైనా ఫోన్ కాల్‌లో మాట్లాడుతున్నాడేమోనని అనుకున్నామని, ఆ తర్వాత, పడకగదిలో విద్యుత్ తీగకు ఉరివేసుకుని తన కొడుకు మరణించినట్లు తెలిసిందని తెలిపారు. అయితే మృతుడి మరణంపై పోలీసులు అన్ని కోణాలలో విచారణ చేస్తున్నారు. ప్రేమ వ్యవహారం, లేదా ఉద్యోగం రాకపోవడం వల్ల విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు రాష్ట్రాలకు పిసిసి చీఫ్‌లను మార్చిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడానికి పూనుకుంది కాంగ్రెస్ పార్టీ. ఉత్తరప్రదేశ్, పంజాబ్ కాంగ్రెస్ కమిటీలకు కొత్త అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రౌండ్ లెవెల్‌లో పార్టీని బలోపేతం చేయడం, ఎన్నికల వ్యూహాలను పకడ్బందీగా అమలు చేయడానికి ఈ మార్పులు చేసింది. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కొత్త సారథిగా సీనియర్ శాసనసభ్యురాలు ఆరాధన మిశ్రా మోనా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న అజయ్ రాయ్ స్థానంలో ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. ఆరాధన మిశ్రా సీనియర్ కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ ప్రమోద్ తివారీ కుమార్తె. ప్రస్తుతం యూపీ అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా వ్యవహరిస్తోన్నారు. రాష్ట్రంలో పార్టీ గమనాన్ని మార్చే అత్యంత కీలక బాధ్యతలను అధిష్ఠానం ఆమెకు అప్పగించింది. ఆరాధన మిశ్రాతో పాటు యూపీలో మరికొన్ని నియామకాలు జరిగాయి. లోక్‌సభ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌ను యూపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. దేవ్‌ందర్ నిషాద్, ఆలోక్ ప్రసాద్‌ను సీనియర్ వైస్ ప్రెసిడెంట్లుగా నియమిస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఆరాధన మిశ్రా యూపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో చౌదరి వీరేంద్ర సింగ్‌ను కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా అధిష్ఠానం నియమించింది. ఇక పంజాబ్‌లోనూ కాంగ్రెస్ పార్టీ ఊహించని మార్పు చేపట్టింది. భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్, జలంధర్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్‌ను పంజాబ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీపీసీసీ) నూతన అధ్యక్షుడిగా నియమించింది. 2022 నుంచి పంజాబ్ కాంగ్రెస్ సారథిగా కొనసాగుతున్న అమరీందర్ సింగ్ రాజా వారింగ్ స్థానంలో పర్గత్ సింగ్ పగ్గాలు చేపట్టనున్నారు. పంజాబ్ రాజకీయాలలో పట్టు సాధించడానికి క్రీడా స్ఫూర్తితో ప్రజాదరణ పొందిన పర్గత్ సింగ్ నాయకత్వం ఉపయోగపడుతుందని కాంగ్రెస్ భావిస్తోంది.

## సిజెపి నిరసనల్లో రక్షణకవచాలుగా మైనర్లు...




**ముంబయి, అక్టోబరు 4:** సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ ముంబైలోని శివాజీ పార్క్‌లో నిరసన నిర్వహించింది. ఈ నిరసనల్లో మైనర్ పిల్లల్ని ఉపయోగించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. శివాజీ పార్క్‌లో జరిగిన నిరసనల్లో మైనర్లను ఉపయోగించారని, వారి ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని వచ్చిన ఫిర్యాదుపై కమిషన్ విచారణ ప్రారంభించింది. నిరసనకు సంబంధించిన కొన్ని వీడియోల్లో, ఫొటోల్లో చిన్నారులు కనిపించారని, కొందరు రెచ్చగొట్టే నినాదాలు చేస్తున్నట్లు ఉందని సతీష్ వైద్ మానవహక్కుల సంస్థలో ఫిర్యాదు చేశారు. మైనర్లను నిరసనల్లో భాగం చేయడానికి ముందే కొన్ని గ్రూపులు, చాట్‌లలో చర్చలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. పోలీసుల చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవడానికి మైనర్ పిల్లల్ని రక్షణ కవచాలుగా ఉపయోగించారే కోణంలో ఫిర్యాదు అందింది. దీనిపై ఎన్‌హెచ్ఆర్‌సి సభ్యుడు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని ధర్మాసనం ముంబై పోలీస్ కమిషనర్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఎక్స్ కార్ప్ గ్రీవెన్స్ ఆఫీసర్, మహారాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసింది. నిరసనలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలించాలని ముంబై పోలీసుల్ని ఆదేశించింది. నేరం బయపడితే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేయాలని కోరింది. మైనర్లను ముందుగానే ప్లాన్‌లో భాగంగా తీసుకువచ్చారా, చట్టపరమైన చర్యల్ని తప్పించుకోవడానికి ఉపయోగించారా అనే అంశాలను పరిశీలించాలని తెలిపింది. జువైనల్ జస్టిస్ చట్టంలోని సంబంధిత నిబంధనలపై దృష్టి పెట్టాలని ఆదేశించింది. పిల్లల ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరింది. సంబంధిత అధికారులు వారం రోజుల్లో యాక్షన్ టేకింగ్ రిపోర్ట్ సమర్పించాలని ఎన్‌హెచ్ఆర్‌సీ కోరింది.

# చనాతో కమ్మని రుచులు !

## కొబ్బరితో కూర..



**కావలసినవి :** శనగలు- 2 కప్పులు, ఉల్లి తరుగు- అర కప్పు, టొమాటో గుజ్జు, బచ్చలికూర తరుగు, కొబ్బరి కోరు- కప్పు చొప్పున, కొబ్బరి పాలు- అర కప్పు, ఆలివ్ నూనె-1 టేబుల్ స్పూన్, బిర్యానీ ఆకు-1, జీలకర్ర-చెంచా, అల్లం వెల్లుల్లి ముద్ద-చెంచా, ధనియాల పొడి, కారం, గరం మసాలా-చెంచా చొప్పున, పసుపు-పావు చెంచా, ఉప్పు-తగినంత, నిమ్మరసం-ఒకటిన్నర చెంచా, కొత్తిమీర తరుగు- అర కప్పు.

**తయారీ :** . ముందు రాత్రి నానబెట్టిన శనగలను నీళ్లు తీసేసి, కడిగి ఉడికించాలి. అడుగు భాగం మందంగా ఉన్నా పాత్రలో నూనె కాగాక.. బిర్యానీ ఆకు, జఅలకర్ర అల్లం వెల్లుల్లి ముద్ద, ఉల్లి తరుగులను లేత గోధుమ రగు వచ్చేవరకూ వేయించాలి. అందులో టొమాటో గుజ్జు, ధనియాల పొడి, కారం, గరం మసాలా, పసుపు, ఉప్పు వేయాలి. రెండు నిమిషాలు వేయించి, ఉడికిన శనగలు, కొబ్బరి పాలు, బచ్చలికూర తరుగు, అర కప్పు నీళ్లు జతచేసి ఉడికించాలి. ఆరేడు నిమిషాల తర్వాత కొబ్బరి , నిమ్మరసం, కొత్తమీర తరుగు వేసి.. ఒక నిమిషం ఉంచి దించేయాలి. అన్నం, రొట్టెలు, క్వినోవా.. ఎందులోకైనా సూపర్‌గా ఉంటుందీ కూర.

## పంజాబీ ఛోలే..



**కావలసినవి :** శనగలు-2 కప్పులు, టొమాటో గుజ్జు-రెండున్నర కప్పు, ఉల్లి తరుగు కప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద- ఒకటిన్నర చెంచా, యాలకులు -5, బిర్యానీ ఆకులు-2. దాల్చినచెక్క-అంగుళం ముక్క మిరియాలు పావు చెంచా , లవంగాలు -4, ఉప్పు-తగినంత, ఛోలే మసాలా-3 చెంచాలు, గరం మసాలా - పావు చెంచా, కారం-అర చెంచా, కొత్తమీర, తరుగు-అర కప్పు, జీలకర్ర పొడి-ఒకటిన్నర చెంచా, సన్నగా తరిగిన అల్లం పాదుచెంచా,మెంతి ఆకుల పొడి-అర చెంచా, నూనె-2 చెంచాలు, నెయ్యి-ఒక టేబుల్ స్పూన్.

**తయారీ :** శనగలు ముందు రోజు రాత్రి నానబెట్టి, ఆ నీళ్లు తీసేయాలి. వాటికి ఐదు కప్పుల నీళ్లు, ఉప్పు జతచేసి కుక్కర్‌లో ఐదు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి.కడాయిలో నూనె వేడయ్యాక బిర్యానీ ఆకులు, దాల్చినచెక్క మిరియాలు, యాలకులు, లవంగాలు వేయాలి. మంచి వాసన వస్తుండగా అల్లం వెల్లుల్లి ముద్ద , ఉల్లి తరుగు వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేగనివ్వాలి. అందులో టొమాటో గుజ్జు వేసి ఉడికించాలి. మధ్యలో అడుగంటకుండా కలియబెడుతుండాలి. పావు గంట తర్వాత ఛోలే మసాలా, కారం ఉప్పు, జీలకర్ర పొడి, ఉడికించిన శనగల, కప్పు నీళ్లు ఇంకో ఆరేడు నిమిషాలు ఉడికించాలి. నీళ్లు ఇగిరి, చక్కగా ఉడికిందనుకున్నాక.. నెయ్యి, అల్లం తరుగు, గరం మసాలా, మెంతి ఆకులు పొడి, కొత్తిమీర తరుగు వేసి కలియబెట్ట దించేయాలి. అంతే ఘుమఘుమలాడే పంజాబీ ఛోలే తిని ఆనందించడమే తరువాయి.

## హమ్మస్ తాహినీ



**కావలసినవి :** ఉడికించిన శనగలు-కప్పున్నర, నువ్వులు-ముప్పావు కప్పు, ఆలివ్ నూనె-4 టేబుల్ స్పూన్లు నిమ్మరసం-2 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు-2, ఉప్పు-తగినంత, రెడ్ పెప్పర్ ఫ్లేక్స్-అర చెంచా. కొత్తమీర తరుగు-చారెడు, సన్నగా తరిగిన ఉల్లి, టొమాటో, కీరదోస ముక్కలు-అన్నీ కలిపి అర కప్పు, పిటా బ్రెడ్-150 గ్రాములు.

**తయారీ :** ముందుగా నువ్వులను వేయించాలి. వాటికి రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనె జతచేసి రుబ్బి, తాహినీ తయారుచేసుకోవాలి. పిటా బ్రెడ్‌ను కాస్త వేడి చేయాలి. మిక్సీ జార్‌లో ఉడికించిన శనగలు, కొన్ని నీళ్లు, మిగిలిన ఆలివ్ నూనె, నిమ్మరసం, వెల్లుల్లి రెబ్బలు ఉప్పు, తాహినీ వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక ప్లేటులోకి తీసి రెడ్ పెప్పర్ ఫ్లేక్స్ కొత్తిమీర తరుగు ఉల్లి టొమాటో, కీరదోస ముక్కలతోగార్నిష్ చేసి. పిటా బ్రెడ్‌తో సర్వ్ చేయాలి.

## చనా పులావ్ ..



**కావలసినవి :** శనగలు-2 కప్పులు, బాస్మతి బియ్యం-కప్పున్నర, నూనె-2 టేబుల్ స్పూన్లు, నెయ్యి-టేబుల్ స్పూన్, ఉల్లిపాయ-1, పచ్చిమిర్చి-4, వెల్లుల్లి రెబ్బలు-4, అల్లం ముద్ద-చెంచా, దాల్చినచెక్క-అంగుళం ముక్క, బిర్యానీ ఆకులు-2, మిరియాలు-అర చెంచా, బ్లాక్ కార్డమం-1, లవంగాలు-5, జీలకర్ర-టేబుల్ స్పూన్, ఉప్పు-తగినంత, కొత్తిమీర తరుగు-చారెడు.

**తయారీ :** శనగలు ముందు రోజు రాత్రి కడిగి నానబెట్టాలి. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో నూనె కాగాక.. ఉల్లితరుగును వేయించాలి. అది కాస్త వేగాక, దాల్చినచెక్క బిర్యానీ ఆకులు, మిరియాలు, బ్లాక్ కార్డమం, లవంగాలు జీలకర్ర, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బలు, అల్లం ముద్ద వేసి రెండు నిమిషాలు వేగనివ్వాలి. అందులో 8 కప్పుల నీళ్లు శనగలు వేసి కలియతిప్పి.. సెగ పెంచాలి. నీళ్లు మరుగుతున్నప్పుడు కడిగిన బియ్యం, ఉప్పు వేసి మీడియం సెగ మీద ఉడికించాలి. దించే ముందు నెయ్యి కొత్తిమీర వేయాలి. అంతే ఆహా అనిపించే రుచీ, పరిమళాలతో చనా పులావ్ తయారైపోతందుఇ. కీర దోస రైతాతో తింటే అదుర్స్ అనాల్సిందే ! □

## ఫలాఫెల్



**కావలసినవి :** శనగలు-2 కప్పులు, శనగపిండి లేదా మైదా-2 టేబుల్ స్పూన్లు, ఉల్లి తరుగు-అర కప్పు, వెల్లుల్లి తరుగు-చెంచా, ధనియాల పొడి-2 చెంచాలు, జీలకర్ర చెంచా, మిరియాల పొడి-చెంచా, కారం-అర చెంచా, ఉప్పు-తగినంత, పచ్చిమిర్చి ముద్ద - అర చెంచా, కొత్తిమీర తరుగు - అర కప్పు, నూనె-వేయించేందుకు సరిపడా.

**తయారీ :** శనగలు కడిగి 12 గంటలు నానబెట్టాలి. వీటికి కాసనత గాల తగలాలి కనుక మూత పెట్టకుండా శుభ్రమైన వస్త్రాన్ని కప్పాలి. ఆ నీళ్లు తీసేసి కడిగి మిక్సీ జార్‌లోకి తీయాలి. అందులో శనగ లేదా మైదాపిండి, ఉల్లి, వెల్లుల్లి తరుగు, ధనియాల పొడి, జీలకర్ర, మిరియాల పొడి, కారం, ఉప్పు, పచ్చిమిర్చి ముద్ద, కొత్తిమీర తరుగు వేసికాస్త బరకగా ఉండేలా గ్రేండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని నిమ్మకాయంత ఉండలు చేసి కాగుతున్న నూనెతో వేయించుకుంటే సరిపోతుంది. ఇవి కొబ్బరి పచ్చడితో మరింత కమ్మగా ఉంటాయి.

# మీ హాబీయే మీకు రక్ష !



**పెయింటింగ్, అల్లికలు, సంగీతం.. ఇలా ఏదో ఒక హాబీ ఉంటే ఆరోగ్యానికి లాభం అంటున్నాయి పరిశోధనలు. సాధారణంగా మహిళల జీవితకాలం పురుషులకంటే ఎక్కువ. వయసు పెరిగేకొద్దీ శరీరంలో మార్పులు వస్తాయి. దాంతో అనారోగ్య సమస్యలు వస్తాయి. వీటికి చెక్ పెట్టడానికి హాబీలు మేలు చేస్తాయి.**

హాబీలు డెమెన్షియా నుంచి దూరంగా ఉంచి మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా న్యూరోప్లాస్టిసిటీని పెంచుతాయి. అంటే, నాడీ వ్యవస్థ మార్పులకు లోనయ్యేలా, కొత్త అంశాలకు అలవాటుపడేలా, కొత్త వ్యవస్థలను రూపొందించుకునేలా సాయపడతాయి. ఈ వ్యవస్థలు హాబీతోపాటు ఇతర నైపుణ్యాలూ పెరిగేందుకు సాయపడుతాయి సంగీతం నేర్చుకునేవాళ్లు గణితంలోనూ రాణించడం లాంటి వాటి వెనక కారణం ఇదే కావొచ్చట. తరచూ ఇష్టమైన పనులు చేయడం వల్ల మెదడులో జీవరసాయన మార్పులు వచ్చి ఉత్తేజితమవుతుంది. మెదడును ఉపయోగించుకో లేదా పోగొట్టుకో అనే పరిస్థితి ఉంటుంది. కాబట్టి మనం ఎన్ని రకాల పనులు చేస్తే అంతగా మన మెదడు చురుకుగా మారుతుందన్నమాట. హాబీని ఆస్వాదిస్తూ సమయం గడపడంవల్ల ఆనందాన్ని కలిగించే రసాయానలైన ఎండార్ఫిన్లు విడుదల వుతాయి. ఇవి బిపినీ, అంతర్గత వాపు (ఇన్‌ఫ్లేమషన్)నీ తగ్గిస్తాయి. నిద్ర పట్టేలా చేస్తూ, వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు హాబీని కొనసాగించడంవల్ల క్రమంగా తగ్గుముఖం పడతాయనేది ఓ పరిశోధన. హాబీని కొనసాగిస్తే ఎనిమిది శాతం సంతోషం పెరుగుతుందనీ.. ఒత్తిడి, ఆందోళన 10 శాతం తగ్గుతాయనీ ఓ అధ్యయనం. పాడటం, వాద్య పరికరాలు వాయించడం, ఇతర రకాల కళలు ప్రదర్శించడం ద్వారా నలుగురిలో కలుస్తాం. ఫలితంగా ఆత్మ గౌరవమూ పెరుగుతుంది. కాబట్టి సమయం లేదనో మరో కారణం తోనో హాబీని పక్కన పెట్టేయొద్దు. □

# సిలువ ప్రేమ నిశ్చలం !



కాలములను, సమయములను తన స్వాధీనమందు ఉంచు కొన్న అదృశ్య దేవుడు నియామక కాలాలలో కొన్నిం టిని ఇంకా వాక్యరూపంలోనే ఉంచక అనగా, భవిష్యత్ ప్రవచనా లను వెలుగులోకి తెస్తూ, ఆ దేవ దేవుడేనేరుగా తానే రంగములోనికి దిగి ప్రత్యామ్నాయానికి తావులేనివిధంగా ప్రత్యక్ష పరుస్తూ ఏదైనా పరాకాష్టగా కళ్ళకట్టేలా వర్ణనకు ఏమాత్రం అందని రీతిలో తనదైన విశ్వరూపాన్ని తన కుమారుని ద్వారా విశ్వమంతటి తెరపై వినూత్నంగా ప్రదర్శించాడు.అదే సిలువ ప్రేమ. పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణము కానిది నిరర్ధకమవుతుంది. క్రీస్తునుబట్టి పాత నిబంధన కొట్టి వేయబడి క్రొత్త నిబంధన అమలులోకి వచ్చింది.బైబిలునందు అన్నీ ఉన్నాయి. లేనిదంటూ ఏదిలేదు. ఎప్పుడూ చేతిలో మొబైల్ ఫోన్, ట్యాబ్, ఒళ్ళో లాప్టాప్ ఉండడం కంటె కూడా పరిశుద్ధ గ్రంథమనే బైబిలు ఉండుటే అన్ని విధాలా మేలు. సెల్ ఫోన్, ట్యాబ్, లాప్టాప్లలో బైబిలు చదువడం పూర్తిగా మానివేసి ఎవరికివారు సొంతంగా ఒక బైబిలు కలిగి ఉండి లేకుంటే కొనుక్కొని అదే చదవడం వారికి మేలు. నేటి ఆధునిక యుగపు మన చేతిలోని చరవాణి అన్నీ మింగివేసినట్టుగానే యుక్త కాలాన క్రీస్తు సిలువ ప్రేమ వెల్లడై అది అన్నింటిని అనగా దేవుని శక్తిని, దేవుని జ్ఞానమును, సూచక క్రియలను, సత్యము, బోధ, వినయ విధేయతలు, ఉపదేశసారం, పని, ఉపాయం, తగ్గింపు, దీనత్వం, తెలివి వంటి అన్నింటిని నిశ్శబ్దంగా తనలో నిక్షిప్తం చేసుకుంది.దేవుని శక్తి యావత్తు క్రీస్తులో అనగా సిలువ వేయబడిన క్రీస్తులో దర్శనమిస్తుంది. నిలిచి ఉండే వాటిలో విశ్వాసము, నిరీక్షణల కంటె శ్రేష్ఠమైన ప్రేమలోనే, క్రీస్తు సిలువ ప్రేమలోనే జ్ఞానాన్ని అనుభవించగలము.ఈ సర్వ లోకానికి సిలువ ప్రేమను మించిన ఔసూచక క్రియ ఏముంది? సత్యము, సత్య విషయమైన ప్రేమ ఒక్క క్రీస్తు సిలువ ప్రేమలోనే కనుగొంటాము. తన జీవిత కాల బ్రతుకులో ప్రేమను కనబరచుటను మించిన బోధ ఏముంది? సత్య విషయమైన ప్రేమను అవలంబిస్తూ అట్టి ప్రేమను పంచుతూ ప్రకటించుట మించిన బోధ ఏముంది? క్రీస్తు చేతులు చాచిన చేతల సిలువ ప్రేమే బోధించడం నేర్పుతుంది. మరణము పొందునంతగా సిలువ మరణం పొందునంతగా క్రీస్తు విధేయతను సిలువ ప్రేమలో కనబరిచాడు. సిలువలో మనకు కనిపించే విధేయత వినమ్రతలు ఎక్కడ కానరావు. ఉపదేశానుసార ప్రేమసారం క్రీస్తు సిలువ ప్రేమలో ఉంది. పవిత్ర హృదయం, మంచి మనస్సాక్షి, నిష్కపటమైన విశ్వాసం నుండి కలిగే అత్యున్నత ప్రేమను సిలువను చూసే నేర్చుకోగలుగుతాము.చేయుటకు నీ చేతికి అందివచ్చిన ఏ పనియైనను నీ శక్తిలోపము లేకుండా చేయుము అనేది సిలువలో కనబడుతుంది. క్రమశిక్షణతో కష్టపడి పనిచేసే చీమలే చిన్నబోయేలా క్రీస్తు అవిశ్రాంతంగా పనిచేసిన విధానం ఎల్లరకూ స్ఫూర్తిదాయకం.

**- జేతమ్**

# తెర

## సుడిగాలి సుధీర్ ‘గోట్’ నవంబరు 12న విడుదల



ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం G.O.A.T (గోట్) అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ సమర్పణలో ఈ చిత్రం నవంబరు 12న థియేట్రికల్ విడుదల కానుంది. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు మంచి స్పందన వస్తోంది. త్వరలోనే ఈ చిత్రం ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉందిఖి అన్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, సర్వధమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, బ్రహ్మాజీ, పృథ్వీ, ఆడుకాలం నరేష్, రాజేంద్రన్, ఆనంద్ రామరాజ్, చమ్మక్ చంద్ర, పమ్మీ సాయి,నవీన్ నేని, తదితరులు నటిస్తున్నారు.

## ‘మొహాబ్బత్’ టీజర్ ఆవిష్కరణ



సంతోష్ రాజా, శ్రేయాస్ సేన్ జంటగా రూపొందుతున్న చిత్రం ‘మొహబ్బత్’ ఏబీఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై మ్యాక్ దర్శకత్వంలో అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హీరో నవదీప్, దర్శకుడు కరుణకుమార్ హాజరయ్యారు. నవదీప్ మాట్లా డుతూ నిర్మాత అఫ్రోజ్ అమెరికాలో జాబ్ చేసి...వాళ్ల సొంత ఊరిలో స్కూల్ కట్టిం చడం.. ఇప్పుడు తన డ్రీమ్ సినిమాను నిర్మిస్తున్నారు. ఎంతో డేడికేటెడ్ నిర్మాతలుగా కనిపిస్తున్నారు. కొత్తవాళ్లను ఈసినిమా ద్వారా దర్శకుడు ఎంకరైజ్ చేశాడు.అజయ్ ఘోష్ మాట్లాడుతూ నిర్మాతలు అమెరికాలో ఉద్యోగం చేసి.. 25 సంవత్సరాల తరువాత సినిమా నిర్మించాలనే కలను నెరవేర్చు కుంటున్నారు. నిర్మాణం అంటే ఎంతో టఫ్.. తప్పకుండా వీళ్ల ఇండస్ట్రీలో మంచి నిర్మాత లుగా పేరు తెచ్చుకోవాలి. నిర్మాత అఫ్రోజ్ షేక్ మాట్లాడుతూ యూఎస్‌లో 25 సంవత్సరాల నుంచి ఉంటున్నాను. ఓ మంచి సినిమా తీద్దామనే ఉద్దేశంతో ఈ సినిమా నిర్మించాను. ఈ స్టోరీ నచ్చింది.తప్పకుండా ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది. దర్శకుడు మ్యాక్ మాట్లాడుతూ ఈ సినిమా కోసం అందరం ఎంతో కష్టపడ్డాం. ఈ కథను నమ్మి ఈ సినిమా కోసం నిర్మాత ఎంతో ఖర్చుపెట్టారు. కొత్త విషయం చెప్పాలన్న తాపత్రయంతో ఈ సినిమా చేశాం. సునీల్ కశ్యప్ ఈ చిత్రానికి మంచి సంగీతాన్ని అందించారు. హీరోయిన్ శ్రేయాస్ సేన్ మాట్లాడుతూ ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ సినిమా విజయంపై ఎంతో నమ్మకంతో ఉన్నాను.

## ‘తెల్ల కాగితం’ సక్సెస్ మీట్‌లో వేణుగోపాల్ ఎమోషనల్



శ్రీమతి కె.శ్రీదేవి సమర్పణలో అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన సినిమా ‘తెల్లకాగితం. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటించగా.. ఈ సినిమాకి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు నందు సవిరిగాన అందిచారు. ఈ మూవీకి రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహించారు. అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలో మూవీ టీమ్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ.. “ప్రేక్షక దేవుళ్లందరికీ చాలా చాలా థాంక్స్. ఒక మంచి సినిమా తీస్తే ఇంత ప్రేమని ఇస్తారని మళ్లీ ప్రూవ్ చేశారు. ప్రీమియర్స్ స్టార్ట్ అయినప్పటి నుంచి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. అన్ని ప్యూర్ సోల్స్ కలిసి ఒక సినిమా చేస్తే ఎలా ఉంటుందో అదే ఖితెల్లకాగితంఖి. ఎంతో ఇష్టపడి చేశాం ఈ సినిమా. మేము థియేటర్ విజిట్స్ వెళ్లినప్పుడు రెస్పాన్స్ కూడా మామూలుగా లేదు. .“ అని అన్నారు. హీరోయిన్ నక్షత్ర మాట్లాడుతూ.. “తెల్లకాగితం సినిమాకి ఇంత మంచి రెస్పాన్స్ ఇచ్చినందుకు థాంక్యూ సో మచ్. ఇంత బ్యూటిఫుల్ రెస్పాన్స్ ఎక్స్‌పెక్ట్ చేయలేదు. నన్ను అందరూ నక్షత్ర కన్నా ‘ఆశా, ఆశా’ అనే పిలుస్తున్నారు. దర్శకుడు రమేష్ బండ్రెడ్డి మాట్లాడుతూ.. “సినిమాకు ఇంత సూపర్ రెస్పాన్స్ చాలా సంతోషంగా ఉంది. నటుడు అజయ్ మాట్లాడుతూ.. “ఆడియన్స్‌కి థాంక్స్.. బ్రహ్మాండమైన హిట్ ఇచ్చారు. నిన్న ప్రీమియర్‌తో స్టార్ట్ అయిన కలెక్షన్స్ గ్రాడ్యువల్‌గా ఇంప్రూవ్ అయ్యాయి. నటి శ్రావ్య మాట్లాడుతూ.. “తెల్లకాగితం సినిమాలో భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉంది. మా ప్రొడ్యూసర్ సపోర్ట్‌తో, రమేష్ గారి సపోర్ట్‌తో ఈ సినిమాలో పార్ట్ అయ్యాను.ప్రొడ్యూసర్ నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. “కృష్ణన్న నాకు వెరీ క్లోజ్. ఇది నా సొంత ప్రొడక్షన్ హౌస్ లాగానే.. నేను ఎన్నో లవ్ స్టోరీస్ చూశాను, ఎన్నో లవ్ స్టోరీస్ తీశాను, ఎన్నో సక్సెస్‌లు కొట్టాను, కానీ అప్పుడప్పుడు కొన్ని కొత్త బంగారు లోకం లాంటి సూపర్ హిట్ సినిమాలు వస్తుంటాయి. అలాంటి ఒక హిట్ సినిమా తెల్లకాగితంఖి అన్ని ఏరియాల నుంచి, ఓవర్సీస్ నుంచి షో షోకి కలెక్షన్లు పెరుగుతున్నాయి.అని అన్నారు.

## ‘క్రేజీ కల్యాణం’ ‘అల సెంద్రవంక’ లిరికల్ సాంగ్ రిలీజ్



నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా ‘క్రేజీ కల్యాణం’. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ ‘అల సెంద్రవంక’ లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. సురేష్ బొబ్బిలి బ్యూటిఫుల్ మెలోడీ ట్యూన్‌తో ఈ పాటను కంపోజ్ చేయగా జి. వెంకన్న ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. అనురాగ్ కులకర్ణి అందంగా పాడారు. ‘అల సెంద్రవంక’ లిరికల్ సాంగ్ ఎలా ఉందో చూస్తే ఖిఅందం మురిసే, గంధం కురిసే పిల్లా నీ మేని సొగసు లనే చూసి, వేకువలోనా వెన్నెల కాసి, పిల్లా నీ పెదవులపై నవ్వై పూసే, నీ అడుగులతోనే అవనే పులకించే, నీ తనువును తాక మేఘం తలవంచే, సింగిడి రంగులతో పొంగే ఆకాశం, నీ ఒంటికి చీరై నిగనిగా మెరిసిందా.. అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

## ‘చంద్రయాన్’ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్



ఈ నెల 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న హిలేరియస్ అడ్వెంచర్ మూవీరాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో ‘చంద్రయాన్’ టైటిల్ తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన ‘చంద్రయాన్’ సినిమా ఈ నెల 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మ్యూజిక్ డైరెక్టర్ హర్ష ప్రవీణ్ మాట్లాడుతూ మా సినిమాకు వర్క్ చేసేందుకు ఎంతో సపోర్ట్ గా నిలబడిన మా వేణు ఊడుగులకి థ్యాంక్స్. యాక్టర్ లోకేష్ మాట్లాడుతూ ఇది నటుడిగా నాకు మొదటి సినిమా. ఈ చిత్రంలో చిన్నా అనే పాత్రలో నటిస్తున్నాను. నటుడు రవి శివతేజ మాట్లాడుతూ నేను గోదావరి జిల్లాల యాస మాట్లాడుతాననే పేరుంది. ఈ సినిమాలో మాత్రం కంప్లీట్‌గా నేటివ్ తెలంగాణ యాసలో నటించాను. ఈ సినిమా నటుడిగా నాకు మంచి పేరు తెస్తుంది.హీరోయిన్ స్వప్న ప్రియదర్శిని మాట్లాడుతూ తెలుగు సినిమాల్లో నటించాలని కలగంటూ వచ్చాను. ఈ చిత్రంతో నా కల నిజమైంది. తెలుగు సినిమాను మన దేశమే కాదు ప్రపంచమంతా ఇష్ట పడుతోంది. ప్రొడ్యూసర్ డా.పూజారి నాగేశ్వరరావు మాట్లాడుతూ వేణు అన్న ప్రెజెంట్స్ చేస్తు న్నారంటే ఈ సినిమా సక్సెస్ అని అనుకోవచ్చు. ఆయన స్ట్రాంగ్ కంటెంట్ ఉన్న మూవీస్ మన ముందుకు తీసుకొస్తుంటారు. గ్లింప్స్ చూస్తుంటూనే ఈ సినిమా మంచి ఎంటర్ టైన్ మెంట్ ఇస్తుందని అర్థమవుతోంది. హీరో శివకుమార్ ధీకొండ మాట్లాడుతూ ఈ చిత్రానికి దాదాపు అందరం కొత్త వాళ్లమే పనిచేశాం. మా లాంటి వాళ్లతో సినిమా చేసిన మా ప్రొడ్యూసర్స్ గట్స్ ను అప్రిషియేట్ చేయాలి. ఈ సినిమాలో హీరోగా నటించాను.

## ఆది పినిశెట్టి ‘మరకతమణి 2’ షూటింగ్ పూర్తి



ఆది పినిశెట్టి హీరోగా నటించిన బ్లాక్ బస్టర్ ‘మరకతమణిఖి. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్ గా వస్తున్న ‘మరకతమణి 2’ షూటింగ్ పూర్తయిం దని మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతు న్నాయి. 2017లో విడుదలైన ఒరిజినల్ చిత్రం తమిళం, తెలుగులో బ్లాక్‌బస్టర్ విజ యాన్ని అందుకుంది. ఈ సినిమా ఫ్రాంచైజీ అభిమానులకు ఇప్పటికీ గుర్తుండిపోయే ఎన్నో మధురమైన జ్ఞాపకాలను అందించింది. వివిధ భాషల ప్రేక్షకులను తన నటనతో మెప్పించిన ఆది కెరీర్‌లో కూడా ఈ సినిమాకు ప్రత్యేక స్థానం ఉంది. సీక్వెల్ ప్రకటిం చిన ప్పటి నుంచి అభిమానులతో పాటు ట్రేడ్ వర్గాలు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తు న్నాయి. ఈ అంచనాలు రోజురోజుకూ మరింత పెరుగు తున్నాయి. ఒరిజినల్ చిత్రాన్ని తెరకెక్కిం చిన దర్శకుడు ఏఆర్‌కే శరవణ్ ఈ ఫ్రాంచైజీతోనే కొనసాగుతున్నారు. ఈ ప్రయాణంలోని ప్రతి దశలోనూ ఆయన భాగస్వామిగా ఉన్నారు. అభిమానులు సీక్వెల్‌పై పెట్టుకున్న అంచనాలను అందుకునేలా రెండో భాగాన్ని రూపొందించేందుకు ఆయన ప్రత్యేకంగా కృషి చేశారు.ఈ చిత్రాన్ని సుధన్ సుందరం, మనీష్ సింగాల్, దుర్గారామ్ చౌదరి, దేవ్, కేవీ దురై నిర్మిస్తున్నారు. ప్యాషన్ స్టూడియోస్, డాంగల్ టీవీ, ఆర్‌డీసీ మీడియా, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, గుడ్ షో బ్యానర్లపై ఈ చిత్రం రూపొందుతోంది. ఆది, సత్యరాజ్, ప్రియా భవానీ శంకర్, నిక్కీ గల్రాణి పినిశెట్టి, మునీష్‌కాంత్, ఆనంద్‌రాజ్, డానియే, అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఉత్కంఠపోరులో భారత్ విజయం

## 19 రన్స్‌తో పాకిస్థాన్ చిత్తు



**న్యూఢిల్లీ:** పాకిస్థాన్‌తో జరిగిన ఆసియా క్రీడలు 2026 పురుషుల టీ20 గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు అదరగొట్టింది. నిస్సిన్‌లోని కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా శనివారం ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోరులో భారత పురుషుల క్రికెట్ టీమ్ స్వర్ణ పతకం సాధించింది. పాకిస్థాన్‌పై టీమిండియా 19 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగుల భారీ స్కోర్ చేసింది. భారత్ బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టుకు బలమైన పునాది వేశాడు. కేవలం 28 బంతుల్లో 61 పరుగులు చేసిన అతడి ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అభిషేక్ కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. పాకిస్థాన్‌పై టీ20ల్లో భారత బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీగా ఇది నిలిచింది. మరో ఎండ్‌లో తిలక్ వర్మ చివరి ఓవర్లలో భారీ షాట్లతో స్కోరును 200 మార్క్ దాటించాడు. 22 బంతుల్లో అజేయంగా 51 పరుగులు చేసిన తిలక్ 3 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. చివర్లో శివమ్ దూబే(15బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 27) దూకుడుగా ఆడాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(21), ఇషాన్ కిషన్(20) పర్వాలేదనిపించారు. పాకిస్థాన్ బౌలర్లలో అరఫత్ మిన్హాస్(2/25) రెండు వికెట్లు తీయగా, సైమ్ అయూబ్, అహ్మద్ డానియల్, అబ్రర్ అహ్మద్ తలో వికెట్ తీసారు. అనంతరం పాకిస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 192 పరుగులే చేసి ఓటమిపాలైంది. హసన్ నవాజ్(51 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లతో 96) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. అతనితో పాటు సైమ్ అయూబ్(29) రాణించారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్(2/29), వాషింగ్టన్ సుందర్(2/29), శివమ్ దూబే(2/33) రెండేసి వికెట్లు తీసారు. ఈ విజయంతో భారత్‌కు స్వర్ణం దక్కగా, పాకిస్థాన్‌కు సిల్వర్ మెడల్ దక్కింది.



# గోల్ఫ్‌లో ప్రణవికి స్వర్ణం

## భారత్ మహిళల జట్టుకు సిల్వర్

**కసుగై:** ఆసియా క్రీడల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లే పోటీలను 15అండర్ 265 స్కోరుతో ముగించిన ప్రణవి ఉర్స్ స్వర్ణ పతకం గెలుచుకున్న తొలి భారత మహిళగా భారత గోల్ఫ్ చరిత్ర సృష్టించారు. కసుగై కంట్రీ క్లబ్ ఈస్ట్ కోర్సులో శనివారం సింగపూర్‌కు చెందిన షానన్ టాన్‌పై మూడు స్ట్రోక్‌ల ఆధిక్యంతో ప్రారంభించినప్పటికీ, మూడవ హోల్‌లో ట్రిపుల్



బోగీని నమోదు చేయడంతో ప్రణవి కష్టమైన ఆరంభాన్ని ఎదుర్కొంది. తదుపరి నిలకడగా పుంజుకుని, ఆరవ, 10వ, 13వ హోల్స్‌లో బర్డీలు సాధించి తిరిగి ఆధిక్యాన్ని సంపాదించింది. ఆ తర్వాత ఆమె చివరి దశను ఎలాంటి నష్టం లేకుండా పూర్తి చేసి, 18వ హోల్‌ను పార్‌తో ముగించి తన చారిత్రాత్మక స్వర్ణ పతక ప్రదర్శనను పూర్తి చేసింది. కాగా ఇదే రోజు మహిళల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు నాలుగు రౌండ్లలో కలిపి 14అండర్ 546 స్కోరుతో ముగించి, ఆసియా క్రీడల్లో మహిళల టీమ్ గోల్ఫ్ ఈవెంట్‌లో దేశానికి తొలి పతకాన్ని సాధించింది. భారతదేశానికి రజత పతకం రావడంలో ప్రణవి సాధించిన స్వర్ణం కూడా దోహదపడింది. అదితి అశోక్ చివరి రౌండ్‌లో మూడు అండర్ 67 స్కోరు చేసి, మొత్తం మీద రెండుఓవర్ 282 స్కోరుతో పోటీని ముగించి 14వ స్థానంలో నిలిచింది. దీక్షా దాగర్ చివరి రౌండ్‌లో ఏడుఓవర్ స్కోరు చేసి, మొత్తం మీద 12ఓవర్ స్కోరుతో సంయుక్తంగా 23వ స్థానంలో నిలిచింది.

ఆట



# రెజ్లింగ్‌లో సెహ్రావత్‌కు స్వర్ణం

**నగోయా:** ఆసియా గేమ్స్ 2026, రెజ్లింగ్‌లో ఒక్క రోజులోనే స్వర్ణంతో సహా మూడు పతకాలను భారత్‌కు అందించారు. శనివారం నగోయా సిటీలో జరిగిన పురుషుల విభాగంలో అమన్ సెహ్రావత్ స్వర్ణాన్ని, దీపక్ పునియా కాంస్యాన్ని, మహిళల విభాగంలో ఆంటిమ్ పంఘల్ రజత పతకాన్ని సాధించి చరిత్ర సృష్టించారు. ఉత్తర కొరియాకు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ హాన్ చోంగ్‌సాంగ్‌ను 11-7 తేడాతో ఓడించిన అమన్ పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. ఫైనల్ లో అమన్ 6-1 ఆధిక్యం సాధించిన తర్వాత హాన్ 3, 2 పాయింట్ల మూవ్‌లతో పుంజుకుని 7-6 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. హాన్ విఫలమవ్వడంతో, అమన్‌కు అదనంగా ఒక పాయింట్ లభించి 11-7 ఆధిక్యంలో స్వర్ణాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక మంగోలియాకు చెందిన గంఖుయాగ్ గన్బాతర్‌ను 2-1 తేడాతో ఓడించి దీపక్ పురుషుల ఫ్రీస్టైల్ 97 కేజీల విభాగంలో కాంస్యాన్ని గెలుచుకున్నాడు. తొలి పీరియడ్‌లో పునియా రెండు పాయింట్లు సాధించి ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నాడు. రెండో పీరియడ్‌లో గన్బాతర్ ఒక పాయింట్ సాధించినప్పటికీ పునియా ఆధిక్యాన్ని నిలుపుకొని కాంస్యాన్ని దక్కించుకున్నాడు. ఇక మహిళల విభాగంలో జపాన్‌కు చెందిన మో కియూకా చేతిలో 1-9 తేడాతో ఓటమితో పంఘల్ 53 కేజీల విభాగంలో రజతాన్ని కైవసం చేసుకుంది. ఆరంభంలో కియూకా ఆధిపత్యం తెచ్చుకున్న తర్వాత ఒక పాయింట్ సంపాదించి, తొలి పీరియడ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని 2-0కి పెంచుకుంది. రెండవ పీరియడ్‌లో ఆంటిమ్ పునరాగమనం చేయడానికి ప్రయత్నించి విఫలమైంది. కియూకా టేక్‌డౌన్‌తో తన ఆధిక్యాన్ని 9-1కి పెంచుకుని, స్వర్ణ పతకాన్ని ఖాయం చేసుకోగా, పంఘల్‌కు రజతం దక్కింది.

# కుంకుమ్‌కు పసిడి

**ఒకాజాకి:** పదిహేడేళ్ల కుంకుమ్ మోహోద్ శనివారం భారత ఆర్చరీ చరిత్రలో ఒక మైలురాయిని నెలకొల్పింది. ఒకజాకీలో శనివారం స్వర్ణ పతకం కోసం జరిగిన ఉత్కంఠభరితమైన షూట్‌ఆఫ్‌లో దక్షిణ కొరియాకు చెందిన యెజిన్ ఓహ్‌ను ఓడించి, వ్యక్తిగత రికర్వ్ ఈవెంట్‌లో ఆసియా క్రీడల పతకం గెలుచుకున్న తొలి భారత మహిళగా ఆమె నిలిచింది. ఫైనల్‌లో కుంకుమ్ ఆరంభంలోనే ఎదురైన ఎదురుదెబ్బను అధిగమించాల్సి వచ్చింది. ఓహ్ తొలి సెట్‌ను 29



-27తో గెలుచుకుని 2-0 ఆధిక్యంలోకి వెళ్లగా, రెండో సెట్ 29-29తో ముగియడంతో కొరియా క్రీడాకారిణి 3-1 ఆధిక్యంలో నిలిచింది. కుంకుమ్ వరుసగా మూడు 10లు సాధించి 30 పాయింట్లతో పరిపూర్ణ స్కోరును నమోదు చేసింది. ఓహ్ 29 పాయింట్లు సాధించడంతో, కుంకుమ్ స్కోరు అంతరాన్ని 3-3కు తగ్గించింది. ఓహ్ నాలుగో సెట్‌లో 28-27 తేడాతో గెలిచి మళ్లీ ఆధిక్యం సాధించి, తన స్కోరును 5-3కు చేర్చి, టైటిల్‌కు ఒక సెట్ దూరంలో నిలిచింది. కుంకుమ్ ఐదవ సెట్‌లో 10 పాయింట్లతో ప్రారంభించి, ఆ తర్వాత మరో రెండు 10 పాయింట్లు సాధించి, మరో 30 పాయింట్లతో సంపూర్ణ విజయాన్ని నమోదు చేసింది. ఓహ్ కేవలం 28 పాయింట్లు మాత్రమే సాధించడంతో, మ్యాచ్ షూట్‌ఆఫ్‌కు దారితీసింది. ఓహ్ 8 స్కోరు చేసిన తర్వాత, అత్యంత కీలకమైన సమయంలో కుంకుమ్ తన నిర్ణయాత్మక బాణంతో 10 రింగ్‌ను ఛేదించి విజయాన్ని అందించింది.



# హాకీలో భారత్ పురుషుల జట్టుకు స్వర్ణం

**కకమిగహార:** హాకీ ఫైనల్ పోరులో మలేషియాను 5-1 తేడాతో చిత్తుగా ఓడించి, ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారిగా పురుషుల హాకీ స్వర్ణ పతకాన్ని విజయవంతంగా నిలబెట్టుకుని చరిత్ర సృష్టించింది. జపాన్‌లోని కకామిగహారాలో శనివారం జరిగిన మ్యాచ్‌ను భారత్ జట్టు దూకుడుగా ప్రారంభించింది. పదేపదే సర్కిల్‌లోకి ప్రవేశిస్తూ, 11వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ నుండి లభించిన బంతిని శక్తివంతమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలిచి స్కోరింగ్‌ను ప్రారంభించాడు. ఇదే సమయంలో సిల్వేరియస్ గోల్ చేయడంతో మొదటి క్వార్టర్ ముగిసేసరికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. రెండవ క్వార్టర్‌లో 23వ నిమిషంలో జుగ్రాజ్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో భారత్ 2-1తో మళ్లీ ఆధిక్యంలోకి వచ్చింది. తదుపరి భారత్‌కు పలు పెనాల్టీ కార్నర్‌లు లభించగా, హార్దిక్ సింగ్ ఆ అవకాశాన్ని గోల్‌గా మలచి, మూడవ క్వార్టర్ ముగిసేసరికి భారత్ ఆధిక్యాన్ని 3-1కి పెంచాడు. ఆఖరి పావుగంటలో కూడా భారత్ ఆటపై ఆధిపత్యం కొనసాగించింది. మలేషియా దాడి అవకాశాలను కట్టడి చేస్తూనే, ఎదురుదాడి ద్వారా అవకాశాలను సద్వినియోగం చేసుకున్న శిలానంద్ లక్రా, 54వ నిమిషంలో భారత్ తరఫున నాలుగో గోల్ సాధించాడు. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్ మరో పెనాల్టీకార్నర్‌ను విజయవంతంగా గోల్‌గా మార్చి తన రెండో గోల్‌ను పూర్తిచేశాడు, దీంతో భారత్ ఆధిక్యం 5-1కి చేరి, ఘనవిజయంతో స్వర్ణాన్ని ఖాయం చేసింది.

# శ్రీలంకకు కాంస్యం

## 63 రన్స్ తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

**నిస్షిన్:** ఆసియా గేమ్స్ క్రికెట్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 63పరుగుల తేడాతో శ్రీలంక ఓడించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. శనివారం టాస్ ఓడిపోయి బ్యాటింగ్ కు దిగిన శ్రీలంకకు ఆరంభం కష్టంగా సాగింది. బంగ్లా దేశ్ స్పిన్నర్లు పిచ్ నుండి టర్న్, బౌన్స్ రాబట్టడంతో ఆ జట్టు ఐదు ఓవర్లలోపే 21/4 స్కోరుకు పడిపోయింది. సహన్ అరచ్చిగే, అషెన్ బండార ఇన్నింగ్స్‌ను నిలబెట్టిన తర్వాత రత్నాయకే 65 పరుగులు బాది శ్రీలంకను



కష్టాలనుంచి గట్టెక్కించాడు. అరచ్చిగే నిలకడగా 33 పరుగులు చేయగా, రత్నాయకే దూకుడుగాఆడటంతో శ్రీలంక చివరి 15 ఓవర్లలో 114 పరుగులు చేసి, తమ 20 ఓవర్లలో 165/9 స్కోరుతో ముగించింది. ఆ తర్వాత బంగ్లాదేశ్ ఛేజింగ్ ఆరంభం నుంచే కుప్పకూలింది. నువాన్ తుషారా సైఫ్ హసన్‌నుడకౌట్‌చేసి వికెట్ మెయిడన్‌తో ప్రారంభించగా, ఆ తర్వాత రత్నాయకే తంజిద్ హసన్ తమీమ్‌ను అవుట్ చేశాడు. తుషార మళ్లీ విజృంభించి నాలుగు ఓవర్ల తర్వాత బంగ్లాదేశ్‌ను 18/4తో కష్టాల్లోకి నెట్టాడు. తౌహిద్ హృదయ్ 11 పరుగులు చేసి ఛేజింగ్‌ను పునరుద్ధరించేలా కనిపించినా, రత్నాయకే బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత విజయకాంత్ వియస్కాంత్ వరుస బంతుల్లో పర్వేజ్ హుస్సేన్ ఎమోన్, మహేది హసన్‌లను ఔట్ చేశాడు. వనుజ సహన్ రిషాద్ హుస్సేన్, యాసిర్ అలీ వికెట్లను పడగొట్టాడు. నసుమ్ అహ్మద్ 26 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు, కానీ 18వ ఓవర్‌లో అతను అవుటవడంతో బంగ్లాదేశ్ ఆశలు దాదాపుగా ముగిసిపోయాయి. ఆ ఇన్నింగ్స్ 17.3 ఓవర్లలో 102 పరుగులకే ఆలౌట్ అయింది.

# 21న జియో ఐపిఓ



**ముంబయి, అక్టోబరు 3:** దేశంలోనే అతిపెద్ద ఐపిఓ రిలయన్స్ ఇండస్ట్రీస్ సబ్సిడరీ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఐపిఓ రాబోతుంది. ఇన్వెస్టర్లు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ ఐపిఓకు సంబంధించి ఇప్పుడు కీలక తేదీలు వెలుగులోకి వచ్చాయి. జియో ఐపిఓ ఈనెల 21నే సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈనెల 23 వరకు ఇష్యూ కొనసాగే అవకాశం ఉండగా, అక్టోబర్ 19న యాంకర్ ఇన్వెస్టర్ల కోసం బుక్ ఓపెన్ కావొచ్చని తెలుస్తోంది. ఇక షేర్లు అక్టోబర్ 28న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ అయ్యే అవకాశం ఉంది. మార్కెట్ పరిస్థితుల్ని బట్టి ఈ తేదీల్లో మార్పులు కూడా ఉండొచ్చని సదరు రిపోర్ట్ పేర్కొంది. ఇక జియో ప్లాట్‌ఫామ్స్ ఐపిఓ విలువ సుమారుగా 3.8 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది భారత కరెన్సీలో చూసినట్లయితే సుమారు రూ. 36 వేల కోట్ల కంటే ఎక్కువే ఉంటుంది. ఈ పరిమాణంతో ఐపిఓ వస్తే భారతదేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా సరికొత్త చరిత్ర సృష్టిస్తుంది. ఇప్పటివరకు హ్యుందాయ్ మోటార్ ఇండియా సుమారు రూ. 27 వేల కోట్ల వరకు నిధుల్ని సమీకరించి అతిపెద్ద ఐపిఓగా ఉండగా, దీనిని జియో అధిగమించనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ కంపెనీ ఇప్పటికే జూన్ నెలలో సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ సమర్పించింది. తర్వాత ఆగస్ట్ 28న మార్కెట్ నియంత్రణ సంస్థ ఆమోదం తెలపడంతో ఐపిఓ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి మార్గం సుగమమైంది.

# తుది దశలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

## త్వరలో మోడీ-ట్రంప్ మరోసారి చర్చలు: యుఎస్ వాణిజ్య ప్రతినిధి జెమీసన్‌గ్రీర్



**మిల్వాకీ, అక్టోబరు 3:** భారత్, అమెరికా మధ్య చాలా కాలంగా కొనసాగుతున్న వాణిజ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జి20 వాణిజ్య మంత్రుల సమావేశం సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు గ్రీర్ సమాధానమిస్తూ.. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని పూర్తి చేసేందుకు ఇరు దేశాలు నిరంతరం ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో జరిగిన చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని తెలిపారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని పూర్తి చేసేందుకు మేము నిరంతరం ప్రయత్నిస్తున్నాం. చర్చలు తుది దశకు చేరుకున్నాయని గ్రీర్ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే నిర్మాణాత్మకంగా చర్చించారని గ్రీర్ తెలిపారు. పురోగతిని సమీక్షించేందుకు ఇరువురు నేతలు త్వరలో మరోసారి ఫోన్‌లో మాట్లాడే అవకాశం ఉందన్నారు. ఏ అంశాలపై ఇంకా అంగీకారం రావాల్సి ఉందో గుర్తించాం. వాటిపై పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. పురోగతి, ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకు అధ్యక్షుడు, ప్రధాని త్వరలో మరోసారి మాట్లాడవచ్చని గ్రీర్ చెప్పారు. అయితే, ఒప్పందంపై అధికారిక ప్రకటన తక్షణమే వెలువడుతుందని మాత్రం చెప్పలేమని ఆయన స్పష్టం చేశారు.

# ఫెడ్ రిజర్వు బోర్డునుంచి పావెల్ రాజీనామా చేయాలి: ట్రంప్

**వాషింగ్టన్,అక్టోబరు 3:** ఫెడరల్ రిజర్వ్ ప్రధాన కార్యాలయ పునరుద్ధరణ పనుల్లో అవకతవకలు, నిర్వహణ లోపాలు చోటుచేసుకున్నాయన్న నివేదిక నేపథ్యంలో మాజీ ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ సెంట్రల్ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ నుంచి రాజీనామా చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేశారు. ఫెడ్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణ పనులు నిర్ణీత బడ్జెట్‌ను భారీగా దాటిపోయాయని, ఆలస్యమయ్యాయని ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. 2.4 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి ఫెడ్ అంతర్గత వాచ్‌డాగ్ విడుదల చేసిన నివేదికలో నేరపూరిత చర్యలకు ఎలాంటి ఆధారాలు లభించలేదని, అలాగే పరిపాలనా లోపాలున్నట్లు గుర్తించలేదని తెలిపింది. అయినప్పటికీ, ప్రాజెక్ట్ నిర్వహణలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయని నివేదిక వెల్లడించింది. ఫెడ్ ఛైర్మన్‌గా పావెల్ పనిచేసిన కాలంలో ద్రవ్య విధానంపై ట్రంప్ పలుమార్లు విమర్శలు చేశారు. ఫెడ్ ప్రధాన కార్యాలయ పునరుద్ధరణ ప్రాజెక్ట్‌ను కూడా పావెల్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ఉపయోగించారు. పావెల్‌ను పదవినుంచి తొలగించే ప్రయత్నాలను ఆయన ప్రతిఘటించారు. ఛైర్మన్‌గా రెండోపదవీకాలం మేలో ముగిసిన తర్వాత కూడా ఫెడ్ గవర్నర్‌గా కొనసా గాలని పావెల్ నిర్ణయించుకున్నారు. ఆయన గవర్నర్ పదవీకాలం జనవరి 2028 వరకు కొనసాగ నుంది. ఇది జెరోమ్ పావెల్ తప్పిదమే. ఆయన వెంటనే రాజీనామా చేయాలి. రాజీనామా చేయకపోతే అవినీతి లేదా అసమర్థత కారణంగా అమెరికా ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో ఆయనపై చర్యలు తీసుకోవాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# ఆర్థిక స్థిరత్వంకోసం నిరంతరం అప్రమత్తత

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

వాణిజ్యం



**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో ఎదురయ్యే ముప్పులకు ఇదే పరిస్థితి కొనసాగుతుందనే హామీ లేదని రిజర్వ్ బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన మల్హోత్రా విధాన నిర్ణేతలు ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్థిక స్థిరత్వం అంటే సంక్షోభాలను పూర్తిగా నివారించడం కాదని, వాటి ప్రభావాన్ని తట్టుకుని నిలబడేలా ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిల బలమైన బ్యాలెన్స్ షీట్ల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉందని ఆయన తెలిపారు. అయితే ఈ పటిష్టత రేపటి ముప్పుల నుంచి రక్షణకు హామీ కాదని పేర్కొంటూ, కొత్తగా ఉద్భవించే ప్రమాదాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఆర్థిక వ్యవస్థను బలంగా, స్థిరంగా ఉంచేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో అంతర్గతంగా లేదా బాహ్యంగా ఏర్పడే షాక్‌లు అనివార్యమని మల్హోత్రా పేర్కొన్నారు. తీవ్రమైన ఒత్తిడి పరిస్థితుల్లోనూ ప్రజలకు, వ్యాపారాలకు అవసరమైన ఆర్థిక సేవలను అందించగలిగే వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

కొత్త తరం వ్యవస్థాగత ముప్పులు బ్యాంకింగ్ రంగానికి మాత్రమే పరిమితం కాకుండా దేశ సరిహద్దులను దాటి, వివిధ రంగాలతో లింక్ అవుతున్నాయని ఆయన చెప్పారు. తదుపరి ఆర్థిక సంక్షోభం తప్పనిసరిగా బ్యాంకులో లేదా ఆర్థిక రంగంలోనే ప్రారంభం కావాల్సిన అవసరం లేదని అన్నారు. భౌగోళికరాజకీయ పరిణామం, సైబర్ దాడి లేదా సాంకేతిక వైఫల్యం వంటి ఘటనలు కూడా సంక్షోభానికి కారణమై వివిధ మార్గాల ద్వారా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థలోని వివిధ సంస్థలు, వ్యవస్థల మధ్య ఉన్న అనుసంధానాలను, ఒక రంగంలో ఏర్పడిన సమస్య మరొక రంగానికి ఎలా వ్యాపిస్తుందో మరింత లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని గవర్నర్ చెప్పారు. రిస్క్ మేనేజ్‌మెంట్‌లో వివిధ పరిస్థితులను ముందుగానే ఊహించి చేసే సన్నివేశ విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మెరుగైన, మరింత వివరమైన డేటా ఆధారంగా ముప్పులను పర్యవేక్షించే వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ బలంగా ఉంటే సరిపోదని, ఆర్థిక వ్యవస్థ మొత్తం స్థాయిలో స్థిరత్వం ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్‌బీఎఫ్‌సీలు, ఆర్థిక మార్కెట్లు, చెల్లింపుల వ్యవస్థలు, సాంకేతిక మౌలిక సదుపాయాల సంస్థలు, కీలక థర్డ్ పార్టీ సేవలు, అంతర్జాతీయ ఆర్థిక నెట్‌వర్క్‌లలోనూ పటిష్టత అవసరమని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), టోకెనైజేషన్ వంటి సాంకేతికతలు, కొత్త తరహా ఆర్థిక మధ్యవర్తిత్వ విధానాలు సామర్థ్యాన్ని గణనీయంగా పెంచగలవని మల్హోత్రా అన్నారు. అయితే ఆవిష్కరణల కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకానికి పునాదులు దెబ్బతినకూడదని స్పష్టం చేశారు.

# నటరాజన్ నియామకంపై నోయెల్‌టాటా అభ్యంతరం



**ముంబయి, అక్టోబరు 3:** పారిశ్రామిక దిగ్గజ సంస్థ టాటా సన్స్‌లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ పునర్‌నియామకంపై టాటాట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గతనెలలో జరిగిన బోర్డు సమావేశంలో అనుసరించిన విధానాలను ప్రశ్నిస్తూ ఆయన టాటా సన్స్ బోర్డుకు లేఖ రాశారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్, వీడియో రికార్డింగ్ అందించాలని డిమాండ్ చేశారు. గతనెల 30న రాసిన ఈమెయిల్‌లో, చంద్రశేఖరన్ పునర్‌నియామక అంశం అసలు సమావేశపు ఎజెండాలోనే లేదని నోయల్ టాటా స్పష్టం చేశారు. డీబ్రీఫ్ బై ఎన్ఆర్‌సీ అనే అంశం కింద దీనిని చర్చకు తీసుకురావడాన్ని ఆయన తప్పుబట్టారు.

ఈ తీర్మానం చట్టవిరుద్ధమని, దానికి చట్టపరమైన విలువ లేదని గ్రూప్‌లో మెజారిటీ వాటాదారు అయిన టాటా ట్రస్ట్స్ ఇప్పటికే ప్రకటన చేసింది. గతనెల 17న జరిగిన సమావేశంలో, టాటా ట్రస్ట్స్ నామినీ డైరెక్టర్ అయిన నోయల్ టాటా ఈ నియామకాన్ని వ్యతిరేకించారు. మరో నామినీ డైరెక్టర్ వేణు శ్రీనివాసన్ మాత్రం మద్దతు తెలిపారు. దీంతో ఓట్లు సమానం కావడంతో, సమావేశానికి అధ్యక్షత వహించిన స్వతంత్ర డైరెక్టర్ హరీశ్ మన్వానీ తన కాస్టింగ్ ఓటును ఉపయోగించి తీర్మానాన్ని ఆమోదింపజేశారు. ఈ నిర్ణయాన్ని సమర్థించుకునేందుకు టాటా సన్స్, మాజీ సిజెఐ జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఎన్ శ్రీకృష్ణల నుంచి న్యాయసలహాలు తీసుకుంది. కంపెనీ ఆర్టికల్ 121 ప్రకారం కాస్టింగ్ ఓటు చెల్లుబాటు అవుతుందని వారు తెలిపారు. ఇద్దరు నామినీ డైరెక్టర్లు అంగీకరించాల్సిందేనని వాదిస్తున్న టాటా ట్రస్ట్స్, తమ వాదనకు మాజీ సిజెఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అభిప్రాయాన్ని ఉటంకిస్తోంది. దీంతో టాటా గ్రూప్‌లో ఈ వివాదం మరింత ముదిరినట్లయింది.

# మరోసారి 'నయారా' పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు



**ముంబయి, అక్టోబరు 3:** గ్లోబల్‌మార్కెట్లలో ఇంధన ధరల నేపథ్యంలో దేశీయ ఇంధన రిటైలర్లపై ఒత్తిడి మళ్లీ పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రైవేట్ ఇంధన విక్రయ సంస్థ నయారా ఎనర్జీ ఈ యేడాది మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. దేశ వ్యాప్తంగా 7,108 పెట్రోల్ పంపులను నిర్వహి స్తున్న నయారా శనివారం తెల్లవారు జామునుంచి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. పెట్రోలుపై లీటరుకు ఐదు, డీజిల్‌పై లీటరుకు మూడు చొప్పున పెంచింది. ఇరాన్ వివాదం కారణంగా ఇంధన సరఫరాలకు అంతరాయం ఏర్పడిన సమయంలో గత మార్చి 26న పెట్రోల్ ధరను లీటరుకు రూ.5, డీజిల్ ధరను రూ.3 చొప్పున కంపెనీ పెంచింది. దీంతో అప్పట్లో నయారా అవుట్‌లెట్లలో పెట్రోల్ ధర రూ.100.71, డీజిల్ ధర రూ.91.31కి చేరింది. ఆ తర్వాత ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు కూడా మేలో ధరల పెంపును ప్రారంభించాయి. దశలవారీగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంతో మే చివరి నాటికి ఒక్కో లీటరుపై మొత్తం పెంపు సుమారు రూ.7.50కి చేరింది. మే 25న చేసిన నాలుగో విడత పెంపులో పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున ధరలు పెరిగాయి. అంతర్జాతీయ ముడిచమురు ధరలు తగ్గడంతో నయారా జూలై 1న మార్చిలో చేసిన పెంపును వెనక్కి తీసుకుంది. పెట్రోల్ ధరను రూ.5, డీజిల్ ధరను రూ.3 చొప్పున తగ్గించింది. రిటైల్ ధరలను మళ్లీ పెంచుతూ అధిక వ్యయ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేసే ప్రయత్నాన్ని నయారా ప్రారంభించినట్లయింది. ప్రైవేట్, ప్రభుత్వ రంగ ఇంధన కేంద్రాల మధ్య ధరల వ్యత్యాసం ప్రస్తుతం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం ప్రైవేట్ రిటైలర్లు తమ కేంద్రాల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలను పరిమితం చేయకూడదని సూచించింది. సెప్టెంబర్‌లో చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌పై లీటరుకు సుమారు రూ.8, డీజిల్‌పై రూ.9 మేర ప్రతికూల మార్కెటింగ్ మార్జిన్లను ఎదుర్కొన్నాయి. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ కలిపి చమురు మార్కెటింగ్ కంపెనీలు రోజుకు సుమారు రూ.530 కోట్ల నష్టాన్ని చవిచూస్తున్నాయని ఇక్రా తెలిపింది. అధిక ముడిచమురు ధరలు, మార్పులేని దేశీయ ఇంధన ధరలు కంపెనీల లాభదాయకత, నగదు ప్రవాహాలపై ఒత్తిడి పెంచుతున్నాయని పేర్కొంది. ముడిచమురు ధర బ్యారెల్‌కు 85-90 డాలర్ల స్థాయిలో ఉన్నప్పుడు చమురు మార్కెటింగ్ కంపెనీల రిఫైనింగ్, మార్కెటింగ్ కార్యకలాపాలు బ్రేక్‌ఈవెన్‌కు చేరుతాయని ఇక్రా గతంలో తెలిపింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.